
సల్లక్షీత రహస్యం

TIRUPATI

# నల్లకోట రహస్యం

అలక్ నందా దీవి: పురవీధులు కోలాహలంగా వున్నాయి.

ఎక్కడ చూచినా తోరణాలు, రంగవల్లులు, ముత్యాల ముగ్గులు.

మద్దెల ఒకటి భుజాన వ్రేలాడేసుకుని గజదొంగ గంగన్న. మురళిని చేతబట్టుకుని గూఢచారి నిశీధుడు వీధుల వెంట వస్తారు.

గతరాత్రే నర్తకి అపురూపతో అలక్ నందా దీవి రాజధాని నగరంలోకి చేరుకున్నారు ఆ యిద్దరూ. అలక్ నందా దీవి రాకుమారి జన్మదినోత్సవ సందర్భంగా నృత్య ప్రదర్శన పోటీల నిమిత్తం వచ్చిన నర్తకి రాకకు ఎవరూ ఎలాంటి అభ్యంతరమూ చెప్పలేదు. సరికదా, వసతి గృహంలో ఏర్పాట్లు కూడా జరిగాయి.

తనలో ఏకాంతాన్ని అభిలషించే అపురూపకు దూరంగా వుండటం మంచిదనుకున్నాడు నిశీధుడు. అందుకనే పురవీధులు చూడాలనే వంకతో గంగన్నను వెంటేసుకుని బయటకు వచ్చేశాడు.

వసతిగృహం దాటకుండానే ఎదురయ్యారు రాజసైనికులు. "ఏయ్ మద్దెలోడా! ఎక్కడికి పోతున్నావ్?" నవ్వుతూ అడిగాడొకడు.

గిరుక్కున తిరిగాడు గంగన్న. మద్దెల వాయించినట్లు ఆ సైనికుడి మొహాన్ని టపటపా వాయించి వేస్తే ఎలా వుంటుందీ అన్న ఆలోచన ప్రవేశించి ది అతని అంతరంగంలో. ఆ ఆలోచనను ఆచరణలో పెట్టకముందే నిశీధుడి చెయ్యి అతని భుజంమీద పడింది

గంగన్న నోరెత్తకముందే ఆ సైనికులకు జవాబు చెప్పాడు నిశీధుడు. "అన్నదా! మీ రాజధానీ నగరం అత్యంత వైభవంగానూ, శోభాయమానంగానూ వుంటుందని విన్నాము. చూచిపద్దామని బయల్దేరాం."

నిశీధుడి జవాబుకి మెత్తబడినట్లు కనిపించారు ఆ రాజసైనికులు. "సరే పొండి! ఎక్కడబడితే అక్కడ తిరగకండి...." అని హెచ్చరించి వెళ్ళిపోయారు

"మద్దెల వాడంటాడా నన్ను ఆ మాట అన్నవాడిని ఎడాపెడా వాయించేయకుండా నన్ను ఆపుచేస్తావా? ఇదేం బాగాలేదు, ధీరా!" అంటూ రుసరుసలాడాడు గంగన్న.

"మద్దెలవాడికుండే ధైర్యం ఎంతటిదో ఆ సైనికులకు తెలియకపోదు - నువ్వు మద్దెల వాడివి కాదని అనుమానం కలిగిన మరుక్షణం నీ వీపు మద్దెల వాయించేస్తాడు ఆ సైనికుడు.... ఇక నోరు మూసుకు పద!" అని గద్దించాడు.

గతుక్కుమన్నాడు గంగన్న. 'అవును, నిజమే! తన అంతమూలం ఆలోచించలేదు. తనెవరో నిశీధుడెవరో తెలిసిన



మరుక్షణం అలకనందాదీవి రాజసైనికులూ, గూఢచారులూ ఊరుకుంటారా?'

"పద, ధీరా! ఎక్కువసేపు ఇక్కడే వుంటే ఆ దొంగ నాయాళ్ళకు అనుమానం వస్తుంది" అంటూ తొందర చేశాడు గంగన్న.

చిన్నగా నవ్వుకుంటూ వేగంగా అడుగులు ముందుకు వేశాడు నిశీధుడు. అమోఘంగా మద్దెల వాయించేవాడి మాదిరి తలా, చేతులూ ఊపేస్తూ నిశీధుడ్ని అనుసరించాడు గంగన్న.

రెండు వీధులు తిరిగి మూడో వీధిలోకి వచ్చేసరికి మేకులు కొట్టినట్లు నిలిచిపోయాయి నిశీధుడి పాదాలు. అతన్ని దాటి మరో రెండు అడుగులు వేసి తిరిగాడు గంగన్న.

"ఏం జరిగింది ధీరా? ఎందుకలా ఆగిపోయావు?" అని అడిగాడు లోగొంతుకతో.

జవాబు చెప్పలేదు నిశీధుడు. అతని చూపులు నిలిచిన చోట తనూ దృష్టి మళ్ళించాడు గంగన్న.

ఒక యువకుడు హుషారుగా నడిచి వస్తున్నాడు. నడుముకి వరలో కత్తి. తలమీద శిరస్త్రాణమూ వున్నా ధరించిన దుస్తులు సైనిక దుస్తులుకావు బహుశ అతనికి ఆ రోజు పని లేదేమో? కొత్త దుస్తులు ధరించి హుషారుగా వీధిన పడ్డట్టు వున్నాడు

"ఆ కుర్ర వెధవని చూస్తే ఏమొస్తుంది ధీరా! ఆడపిల్లయినా కాదాయె? పోదాంపద!" అంటూ నిశీధుడి చెయ్యి పట్టుకుని లాగాడు గంగన్న.

"ఆగు, గంగా! ఆ కుర్రాడు ధరించిన దుస్తులు మన

శ్రీశర్మ వేసుకునేవిలాగా లేవూ?" అడిగాడు నిశీధుడు తల తిప్పకుండానే.

అప్పటికిగాని గంగన్న ఆ యువకుడ్ని పరీక్షగా చూడలేదు. "ఔను. ధీరా.....నిజమే! మన శ్రీశర్మ ఈ దుస్తులు వేసుకోవటం నేను చాలాసార్లు చూశాను. అలాగే వున్నాయి" అనాడు.

"పద! ఆ కుర్రాడ్ని ఓ పట్టుపట్టి చూస్తే కాని మనకి శ్రీశర్మ ఆచూకీ తెలియదు...." అంటూ అడుగు ముందుకు వేశాడు నిశీధుడు

"ధీరా! నీకేమీ మతి పోలేదుకదా? నీవా మురళీ, నేని మద్దెలా వెంట బెట్టుకుని అతన్ని అనుసరించి ఎంత దూరం పోతాం?" లోగొంతుకతో వారించాడు గంగన్న.

"ఆ మాట నిజమే! అవసరమైతే ఆ కుర్ర సైనికుడ్ని వెంటాడుతూ ఎంత దూరమైనా వెళ్ళాల్సి రావచ్చు! మురళిని చేతబట్టి తనూ, మద్దెల వీపున వ్రేలాడేసుకుని గంగన్నా అలా వెడితే ఇంకేమయినా వుందా?

చటుక్కున ప్రక్కనే వున్న అంగడిలోకి జొరబడ్డాడు నిశీధుడు రొ టిన వున్న సంచిలో నుంచీ ఒక బంగారు నాణాన్నితీసి అంగడి యజమానికి యిచ్చాడు

"ఏం కావాలి?" అడిగాడు శెట్టి

"శెట్టిగారూ మాకేమీ అవసరం లేదు. దయచేసి మీరు మావాడి మద్దెలనూ, నా మురళినీ జాగ్రత్తగా చూస్తూ వుండండి. మళ్ళీవచ్చి తీసుకుంటాం. వీటిని వెంటేసుకుని నగరంలో అన్నీ చూడలేం" అన్నాడు నిశీధుడు.

ఆనందంతో పొంగిపోయాడు ఆ శెట్టి కేవలం ఒక



మద్దెలను, మురళిని దాచి వుంచినందుకు ఒక బంగారు నాణమా? పిల్లాజెల్లాలేని పిచ్చిమాలోకమా అన్నట్లు చూశాడు శెట్టి.

అతని చూపులు పట్టించుకోకుండా వెనక్కి తిరిగాడు నిశీధుడు. "అమ్మయ్య! మంచి పనిచేశావు ధీరా! ఇక నడు...." అని తొందర చేశాడు గంగన్న.

అప్పటికే కొత్త దుస్తులు ధరించిన ఆ యువకుడు చాలా దూరం పోయాడు. వేగంగా అడుగులు వేస్తూ అతన్ని వెన్నంటి నడక సాగించారు మిత్రులిద్దరూ.

ఆ కుర్ర సైనికుడు విఫణి వీధులన్నీ చూసుకుంటూ నాలుగు ఫలాలు, ఒక సారాసీసా కొనుక్కొని ముందుకు నడిచాడు. మాంసం దుకాణంలో వేయించిన మాంసం కొన్నాడు.

చూస్తూ వుండగానే వాడు పొలిమేరలు దాటుతూండటం చూసి "ఇదేమిటి ధీరా! ఈ కుర్రవెధవ ఇంతదూరం పోతున్నాడు. మనల్ని ఏ వల్లవాటికో తీసుకుపోడు కదా?" అన్నాడు గంగన్న.

నిశీదుడు జవాబు చెప్పలేదు. రెండు నిమిషాల తరువాత ఒక తోటలోకి ప్రవేశించాడు ఆ కుర్ర సైనికుడు. అతన్ని అనుసరించి పోయి చటుక్కున ఒక చెట్టు చాటుకు తప్పుకున్నారు మిత్రులిద్దరూ.

కుర్రసైనికుడు అటూ యిటూ చూసి ఒక పెద్ద చెట్టు క్రింద ఎండుటాకులను అటూ యిటూ తోసి. చదునుగా చేసి, చతికిలబడ్డాడు. కాలుమీద కాలువేసుకుని నడుం వాల్చాడు.

సారాసీసా మూత ఊడతీసి. తాగుతూ, మధ్య మధ్య మాంసం ముక్కలు తింటూ కూనిరాగాలు తీస్తున్నాడు.

ఆ సీసా చూడగానే మొదలైంది. గంగన్న మనసులో ఆరాటం. దారిలో ఓ సీసా కొని తెచ్చుకుంటే బాగుండేదని పించింది. పైకి ఆ మాట అంటే రణధీర్ వూరుకోడని తెలుసు.

"తొందరగా పోదాం ధీరా! కుర్రవెధవ ....అంత సీసా తాగితే ఎందుకు పనికిరాడు!" అంటూ మహా జాలిపడిపో నారంభించాడు గంగన్న.

అతనికోసం కాకపోయినా మరీ తాగటం శృతిమించితే ఆ కుర్రాడు మాట్లాడే స్థితిని దాటిపోతాడేమోనని భయ పడ్డాడు నిశీధుడు

అందుకని నాలుగంగల్లోపోయి ఆ కుర్రాడి ముందు నిల బడ్డాడు. అప్పటికే మైకం కొంత తలకెక్కిన ఆ కుర్రాడు నిశీధుడి వంక. అతని ప్రక్కకు వచ్చి నిలబడిన గంగన్న వంకా చూశాడు.

"హలో! సోదరులూ....యిప్పుడు వచ్చారేం? కొంచెం సేపు ముందుగా వచ్చివుంటే మీరూ నాతో కలిసి తాగేవారు కదా!" అన్నాడు నవ్వుతూ.

'అడుగు ముందుకు వేశాడు గంగన్న. "చూడు తమ్ముడూ! మేము రాజుగారి అంతరంగిక గూఢచారులం, మన సైనికులలో ఎవరు క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తు న్నారో తెలుసుకుని ఆ విషయం వారికి నివేదించడమే మా పని!" అన్నాడు.



అయ్యో బాబోయ్! మన్నించండి దొరా! క్షమించండి." అంటూ లేవబోయి సీసా వదిలేశాడు ఆ కుర్రాడు

క్రింద పడబోయిన సీసాని మధ్యలోనే అందుకుని చటుక్కున చెట్టుచాటుకు తప్పుకున్నాడు గంగన్న. అదేమీ పట్టించుకోకుండా కుర్రాడి ముందు మోకరించి కూర్చున్నాడు నిశీధుడు. "చూడు బాబూ! వృద్ధిలోకి రావల్సిన వాడివి! ఇలా తాగి తందనాలూ ఆడటం అంత మంచిది కాదు. ఒక్క విషయం చెపితే నీ గురించి రాజుగారికి ఫిర్యాదు చేయం...." అన్నాడు.

"అడగండి. అన్నగారూ! మీ రడిగితే ఏ విషయమైనా చెపుతాను...." అంటూ వడివడి దణ్ణాలు పెట్టాడు ఆ కుర్ర సైనికుడు."

"నువ్వు వేసుకున్న దుస్తులు ఎవరివి?" అడిగాడు నిశీధుడు.

"నావే!"

అప్పటికే సారాసీసా ఖాళీచేసి తిరిగి వచ్చాడు గంగన్న. "ఈ కుర్రకుంక అలా జవాబు చెప్పడు ధీరా...." అంటూ వాడి మెడపట్టుకుని పైకి ఎత్తేశాడు

పిల్లిపిల్లలా గిలగిలలాడిపోయాడు ఆ కుర్ర సైనికుడు. "ఏరా .... చెపుతావా .... లేక ఇలాగే చెట్టుకువేసి కొట్ట మంటావా?" అడిగాడు క్రోధంగా చూస్తూ.

"వద్దు!....వద్దు....ఇవి నా బట్టలు కావు...." భయంతో గొంతు కీచుగా సమాధానం చెప్పాడు వాడు.

"మరి ఎవరివి?" అడిగాడు నిశీధుడు.

"ఈ మధ్య ఒక పరదేశీ కుర్రాడొకడు మాకు దొరికిపోయాడు. అతని దుస్తులు యివి!"

"ఏమయినాడు ఆ కుర్రాడు?" గంగన్న అతన్ని క్రిందకు దించకుండానే అడిగాడు.

"విప్లవ దళానికి చెందిన కొంతమంది కుర్రాళ్ళను కూడా విడిపించుకుని చెరసాలనుంచి పారిపోయాడు. ఆ తరువాత పరదేశీని, మాధవుడు అనే కుర్రాడ్ని మేము వెంటాడాము. మాకు దొరక్కుండా పారిపోయే ప్రయత్నంలో మాధవుడు ఆ కుర్రాడూ మరణించారుట. అందుకని పరదేశీ కుర్రాడి దుస్తులు నేను తీసేసుకున్నాను...." అని వివరంగా చెప్పేశాడు ఆ కుర్ర సైనికుడు.

నిశీధుడి వైపు చూశాడు గంగన్న. ఇంక ఆ కుర్ర సైనికుడినుంచీ తెలిసే విషయాలు ఏముంటాయి? వదిలేయమన్నట్లు సైగచేశాడు నిశీధుడు.

పిల్లిపిల్లని విసిరినట్లు చెట్టు మొదలుకేసి విసిరాడు గంగన్న. నడుం కలుక్కుమందేమో కెవ్వుమన్నాడు ఆ కుర్ర సైనికుడు.

"జాగ్రత్త! మా గురించిగాని, మేమిలా అడిగినట్లుగాని ఎవరికీ చెప్పవద్దు...." అని హెచ్చరించి కదిలాడు గంగన్న.

ఇద్దరూ తోటలోనుంచీ బయటకు వచ్చారు. "ఇది నిజమంటావా ధీరా! మన శ్రీశర్మ మరణించినట్లేనంటావా?" కంపిస్తున్న స్వరాన్ని అదుపులో పెట్టుకుంటూ అడిగాడు గంగన్న.

తల అడ్డంగా తిప్పాడు నిశీధుడు. శ్రీశర్మ అంత తేలికగా-సామాన్య సైనికులకు దొరికి ప్రాణం పోగొట్టుకుని



వుంటాడంటే నేను నమ్మను. ఆ మాధవుడనే కుర్రాడితో పాటు ప్రాణాలు పోగొట్టుకుంటాడా ........ ఏదో ఎత్తువేసి వుంటాడు!

కాకపోతే శ్రీశర్మ గురించి తెలుసుకుందామని అనుకున్న మన ప్రయత్నం ఎక్కడుందో అక్కడే వుండిపోయింది. కథ మొదటికే వచ్చినట్లుంది...." అన్నాడు గాఢంగా నిట్టూరుస్తూ.

"నువ్వు అధైర్యంగా వున్నావేమో అనుకున్నాను ధీరా! ఇక ఫరవాలేదు....మనవాడి ఆచూకీ ఎక్కడో అక్కడ తెలియకపోదు. "పద!" అంటూ దారితీశాడు గంగన్న.

వెనక్కి తిరగటం కంటే మరో దారిలేదు. ఆలోచిస్తూనే అడుగులు వేస్తున్నాడు నిశీధుడు.

ప్రగూసం. గూఢచారి లోలా చెప్పిన వివరాల ప్రకారం అయితే తను కలుసుకోవల్సింది నల్లకొండలలోని పుళిందుడనే వాడిని! కాని శ్రీశర్మ విషయం తెలుసుకోకుండా ముందుకు పోవటం ఎలా?

"ధీరా! ఎలాగూ యింతదూరం వచ్చాము. రాత్రికి కదా నృత్య ప్రదర్శన .... కాస్త గొంతు తడుపుకుందాం...." అన్నాడు గంగన్న జంకుతూనే

'ఏం, తాగింది చాలలేదా' అంటాడేమో? అనుకున్నాడు గంగన్న. ఏ కళనున్నాడో తల వూపాడు నిశీధుడు.

హుషారు పుంజుకుని అటువైపు నడక సాగించాడు గంగన్న. కుర్రసైనికుడు శ్రీశర్మ దుస్తులు చేజిక్కించుకున్నాడు. శ్రీశర్మ పట్టుబడకముందో, పట్టుపడినాకనో

మిగిలిన సైనికులకు తెలిసివుండాలి మరికొన్ని వివరాలు. సారా అంగడిలాంటి చోట్ల గుమిగూడతారు సైనికులు విరామ కాలంలోనూ, సెలవు దినాలలోను.

తాగే అలవాటు ఉండాలే కాని, ఖాళీ అంటూ దొరికితే చాలు ఉదయమూ, సాయంత్రమూ అనే పట్టింపు వుండదు తాగుబోతులకు. అలాంటి పక్కా తాగుబోతు లెవరివల్లనయినా శ్రీశర్మ గురించిన వివరాలు తెలియవచ్చునని నిశీధుడి ఆశ! ఆ ఆశతోనే అతను గంగన్న అడగగానే అంగీకరించాడు.

ఇద్దరూ ఒక సారా అంగడిదగ్గరకు చేరేసరికి మరో అరగంటపైగా గడిచిపోయింది. అంగడికి చేరగానే రెండు సీసాలు కొనేశాడు గంగన్న. ఒకటి నిశీధుడికి అందించబోయాడు. వద్దని అటూ యిటూ చూశాడు నిశీధుడు.

"నువ్వు మరీ అర్భకుడివి గురూ! దొరికినప్పుడైనా పట్టించకపోతే ఎలా!" అంటూనే సీసా ఎత్తి ఖాళీ చేయటం ప్రారంభించాడు గంగన్న.

అతని గురించి పట్టించుకోకుండా ముందుకు కదిలాడు నిశీధుడు. ఒక స్తంభానికి ఆనుకుని ఖాళీసీసా ఎత్తి పట్టుకుని బోర్లించి చూస్తూ ఏదో గొణుక్కుంటున్న ఒక వృద్ధుడు అతన్ని ఆకర్షించుకున్నాడు.

అప్పటికి నాలుగుసార్లు సారా అంగడి యజమాని దగ్గరకుపోయి ఇంకో సీసాకోసం బ్రతిమలాడి భంగపడ్డాడు ఆ వృద్ధుడు.

డబ్బు యివ్వనిదే సీసా కాదుకదా, ఒక్కచుక్క సారా కూడా యివ్వనని నిక్కచ్చిగా చెప్పేశాడు అంగడియజమాని.



అతన్ని తిట్టుకుంటూ, తన దురదృష్టాన్ని నిందించుకుంటూ ఖాళీ సీసాలో అట్టడుగున ఒక చుక్క అయినా వుండేమోనని వెతుకుతున్నాడు ఆ వృద్ధుడు.

రెండు అంగలు వేసి అతని ప్రక్కకుపోయి కూర్చున్నాడు నిశీధుడు. "ఏం తాతా! ఈ వయసులో కూడా డబ్బుకు యిబ్బంది పడుతున్నట్లున్నావే..." అని అడిగాడు.

మూసుకుపోయే కనురెప్పలెత్తి చూశాడు ఆ వృద్ధుడు. "ఎవరు బాబూ నీవు? వారం క్రితం నీకంటె చిన్నవాడొకడు నాపై జాలిపడి నా కూతురి పెళ్ళికని డబ్బు సహాయం చేశాడు. చూస్తే నీదీ అతనిదీ ఒకేదేశం అనిపిస్తోంది" అన్నాడు

ఉలికిపాటుని అణచుకున్నాడు నిశీధుడు. ఆ ఉలికిపాటుని, ఆత్రుతనూ అణచుకునేందుకు అతనికి నిమిషం పట్టింది. వెదకబోయిన తీగ కాలికి తగులుకోబోతున్నది.

"ఆ కుర్రాడికి పెళ్ళయిందంటావా? ఎలా వుంటాడు తాతా!" అని ప్రశ్నించాడు దుస్తుల చాటునుంచీ చిన్న సంచీ తీస్తూ. తీస్తూండగానే ఆ సంచీ గలగలలాడింది.

ఆశగా చూశాడు వృద్ధుడు. కను చివర్లనుంచీ వృద్ధుడి వాలకం గమనిస్తూనే వున్నాడు నిశీధుడు.

"చెప్పు తాతా! ఆ కుర్రాడు ఏమని అడిగాడు? నీకూ అతనికీ ఎలా పరిచయం అయింది?" అంగడి యజమానిని ఒక సీసా తీసుకు రమ్మని సైగచేస్తూ అడిగాడతను.

వృద్ధుడు అది గమనించాడు. మొహమంతా నవ్వుల మయం చేసుకుంటూ తనకు శ్రీశర్మ ఎలా పరిచయ

మైనాదో వివరించాడు. తన ముసలి గుర్రాన్ని యిచ్చిన సంగతి కూడా వివరించాడు,

తల ఊపాడు నిశీధుడు. అంగడి యజమాని యిచ్చిన సీసా వృద్ధుడికి యిచ్చి ఆలోచనలో మునిగాడు.

శ్రీశర్మ నల్లకొండల గురించి వివరాలు అడిగాడూ అంటే అటువైపే వెళ్ళవుండాలి. వృద్ధుడు తన ముసలి గుర్రాన్ని కూడా యిచ్చినట్లు చెపుతున్నాడు. నల్లకొండ వైపు వెళ్ళాలనే ఆలోచన శ్రీశర్మకు ఎందుకు కలిగింది? దానికి కారణం ఏమిటి?

సీసా ఖాళీచేసిన వృద్ధుడి మైకం మరో మెట్టు పెరిగి పోయింది. ఆ మైకంలోనే యింకో నిజాన్ని బయట పెట్టాడు.

"ఇదిగో, అల్లుడూ! ఆ కుర్రాడికి నా గుర్రాన్ని ఇచ్చానా-! ఆ వెంటనే వచ్చేసిందది! దానికి నాతోబాటు రాత్రివేళ యిక్కడికి రావటం అలవాటు. రెండు సీసాలు తాగనిదే కదలదు నా గుర్రం తాగే అలవాటుతో ఆ కుర్రాణ్ణి క్రింద పడేసి తిరిగి నా దగ్గరకు వచ్చేసింది పిచ్చి గుర్రం! పాపం ఆ కుర్రాడు ఎలా వెళ్ళాడో? తిరిగి వస్తే నా కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలి;"

వళ్ళు మండిపోయింది నిశీధుడికి. లాగిపెట్టి ముసలాడి మొహంమీద గుద్ది, బుద్ధి చెపుదామా అనుకున్నాడు.

"అల్లుడూ! యింకో సీసా తెప్పించు..........నా చిన్న కూతురు చక్కని చుక్క....అన్నట్లు నీకు పెళ్ళయిందా?" తడబడుతున్న స్వరాన్ని అదుపులో పెట్టుకుంటూ అడిగాడు వృద్ధుడు.



"అయింది తాతా! నీ కూతుర్ని చేసుకుంటే ఇరవై ఒకటో భార్య అవుతుంది...." అని చెప్పి లేచి వచ్చాడు నిశీధుడు,

అప్పటికి రెండు సీసాలు ఖాళీచేసి మూడోది కొందామా వద్దా అని ఆలోచిస్తూ దుస్తుల చాటున వెదుకులాట ప్రారంభించాడు గంగన్న.

ఎక్కడా చిల్లి గవ్వకూడాదొరికినట్లు లేదు. తెల్లమొహం వేసి అటూ యిటూ చూస్తున్నాడు నవ్వుతూ అతన్ని సమీపించాడు నిశీధుడు.

"పద గంగా! తాగింది చాలు. రాత్రికి నృత్య ప్రదర్శనలో మద్దెల వాయింపులో శృతితప్పితే నీకు శృతిలేకుండా చేసేస్తారు జాగ్రత్త!" అని హెచ్చరించాడు నిశీధుడు.

అతన్ని అనుసరించి పరుగున వచ్చాడు గంగన్న. "మన శ్రీ గురించి ఏదో విషయసేకరణ చేసినట్లున్నావు! ఏమయినా తెలిసిందా?" అని అడిగాడు.

చిన్నగా చెప్పాడు నిశీధుడు. అంతా విని తల వూపాడు గంగన్న. "రాత్రిదాకా ఎందుకు ధీరా! యిక్కడే నల్లకొండలలోకి బయలేరితే సరిపోదూ?" అన్నాడు.

"మనం నర్తకితో వచ్చాం! ఆమె నృత్య ప్రదర్శన సమయంలో మనం లేకపోవటం వల్ల ఆమె ఏదయినా చిక్కుల్లో పడవచ్చు! నృత్య ప్రదర్శన పూర్తి కాగానే మనం ఆమె తిరుగు ప్రయాణంలో బయటపడి, చిన్నగా నల్లకొండవైపు దారి తీద్దాం. అదీగాక కోటలోని పరిస్థితులేమిటో తెలియాలి అంటే మనం నర్తకితో అంతఃపురం ప్రవేశించాలి!" అని వివరించాడు నిశీధుడు.

"సరే! అలాగే చేద్దాం...." అన్నాడు గంగన్న. నడుస్తూనే ఒక చోట చటుక్కున ఆగిపోయాడు

అప్పటికి సారా అంగడిదాటి ఎక్కువదూరం రాలేదు కూడా. అంగడి వున్న ప్రాంతం కూడా దాదాపు నగరం చివర వున్నట్లే. అంగడి దాటి నగరంలోకి ప్రవేశించే ముందు ఎదురవుతున్నదో తోట.

ఆ తోటలోకి మళ్ళాయి గంగన్న చూపులు. "ఏమిటి గంగా! మళ్ళీ సారాసీసా ఏదయినా కనిపించిందా ఏం?" అంటూ తలతిప్పి తనూ అటు చూశాడు నిశీధుడు

మరు క్షణం వింటినుంచీ వెలువడిన బాణంలా అటు పరుగుతీశాడు తేరుకున్న గంగన్న కూడా అతన్ని అనుసరించాడు.

తోటలో వున్న ఒక చెట్టుకి ఉరితాడు బిగించి ఆ ఉచ్చు మెడకు తగిలించుకుని ఉరి వేసుకునే ప్రయత్నం చేయబో తున్నది ఒక పడుచు.

ఒక్క అంగలో పోయి ఆ యువతిని పట్టుకున్నాడు నిశీధుడు దుస్తుల చాటున దాచిన చురకత్తి తీసి ఉచ్చు తాడు తీసి పరపరా కోసేశాడు గంగన్న.

"ఏం పనమ్మాయీ ఇది? పట్టుమని పదహారేళ్ళు కూడా లేవు! నూరేళ్ళ జీవితాన్ని అంతం చేసుకుంటావా? అంత కష్టం ఏ మొచ్చింది నీకు?" పెద్దరికం తెచ్చిపెట్టుకున్న కంఠంతో అడిగాడు గంగన్న.

జవాబు చెప్పలేదు ఆ యువతి. వెక్కి వెక్కి ఏడుస్తూ వుండిపోయింది. ఆమె దుఃఖావేశం తీరేంతవరకు మౌనంగా వుండిపోయారు మిత్రులిద్దరూ.



రెండు నిమిషాల తరువాత కనులు తుడుచుకుంది ఆ యువతి. అడగకుండానే తన కథ వివరించటం మొదలు పెట్టింది.

"నా పేరు సౌందర్య! నా తండ్రి శ్రీరాములు ఒక సామాన్య సైనికుడు. తాగుబోతు. జీతం చాలక అప్పులు చేసి ఒక వడ్డీ వ్యాపారికి బాకీ పడ్డాడు. ఆ బాకీ తీర్చలేక వృద్ధుడైన ఆ వడ్డీ వ్యాపారికి నన్నిచ్చి వివాహం చేయా లనుకుంటున్నాడు. నా తల్లి బ్రతికి వున్నంతకాలం ఆమె ఈ వివాహం జరగకుండా అడ్డం పడింది. వారం రోజుల క్రితం ఆమె జబ్బు తీవ్రమై మరణించింది. ఆ రోజే ఒక యువకుడు మా నాన్నకి ఎలా పరిచయమైనాడో గాని, ఆయనతో మా యింటికి వచ్చాడు.

తల్లికూడా లేకపోయాక నా తండ్రికి అడ్డు చెప్పే దెవరు? ఆటంకపరిచే దెవరు? నేను బ్రతికి ప్రయోజనం ఏముంది? ఆ రాత్రి ఆత్మహత్య చేసుకోబోతూండగా ఆ యువకుడు మీలాగే నన్ను వారించాడు. ఎలా సంపాదిం చాడో తెల్లవారేలోగా రెండువేల వరహాలు తీసుకు వచ్చి యిచ్చి నా పెళ్ళికి ఉపయోగించుకోమని చెప్పి వెళ్ళి పోయాడు. ఆ డబ్బుతో నా వివాహం చేయాల్సింది పోయి మా నాన్న ఆ ధనం తీసుకుపోయి వడ్డీ వ్యాపారికి యిచ్చేసి బాకీ జమవేశాడు. తనకి డబ్బు వద్దని, నన్ను యిచ్చి పెళ్ళి చేయమని వడ్డీ వ్యాపారి అల్లరి చేస్తున్నాడుట. పెళ్ళి చేయక పోతే బాకీ చెల్లు వేయలేదని న్యాయస్థానంలో ఫిర్యాదు చేస్తాడుట! యిచ్చిన డబ్బుకి సాక్ష్యం ఏమిటని అడుగు

తున్నాడుట. నా తండ్రి యిప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నాడు. ప్రయోజనం ఏముంది? నాకు చావుతప్ప వేరే మార్గం కనిపించటం లేదు....." బుగ్గమీదకు జారిన కన్నీరు తుడుచుకుంటూ అంది ఆమె.

"నీకు డబ్బు యిచ్చిన ఆ యువకుడు ఎవరు? ఎలా వుంటాడు? పేరు చెప్పగలవా?" అడిగాడు గంగన్న ఆతృతగా.

"నాకు అంత సహాయం చేసిన ఆ మనిషి పేరయినా తెలుసుకోకుండా ఎలా వుంటాను? అతనిపేరు శ్రీ శర్మ!" చెప్పింది సౌందర్య.

"ఎక్కడికి వెడుతున్నాడో చెప్పాడా?" సాలోచనగా అడిగాడు నిశీధుడు.

తల వంచుకుని జవాబు చెప్పింది సౌందర్య. ఎక్కడికి వెళ్ళేది చెప్పమని, తిరుగు ప్రయాణంలో రమ్మని బ్రతిమిలాడాను. నల్లకొండలలోకి పోతున్నానని మాత్రం చెప్పాడు....."

చిన్నగా నవ్వి నిశీధుడివైపు చూశాడు గంగన్న. తల పంకించాడు నిశీధుడు.

"సరేనమ్మా! మిమ్మల్ని బెదిరించి బాధిస్తున్న ఆ వడ్డీ వ్యాపారి ఎవరో, ఎక్కడుంటాడో చెప్పు....నీ వ్యవహారం మేము చక్కచేస్తాం. ఎప్పుడూ యిలాంటి పొరబాటు చేయకు...." అన్నాడు గంగన్న.

ఏదో అడగాలనుకుంది సౌందర్య. అడకలేక తలవూపి గంగన్న అడిగిన వివరాలు చెప్పి, తోటలోనుంచీ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళినవైపే చూస్తూ అన్నాడు గంగన్న.



"ఏమో అనుకున్నాను, ధీడా! మనవాడు ఈ చిన్నదాని మనసులో చోటు చేసుకున్నాడు. కాని తన గురించి పెద్దగా వివరాలు బయట పెట్టలేదు....పరవాలేదు, జాగ్రత్తపడ్డాడు...." అన్నాడు గంగన్న తల వూపుతూ.

నిశీధుడు మాట్లాడలేదు. అతని మనసుని రకరకాల ఆలోచనలు ఆక్రమించుకుని వున్నాయని గ్రహించాడు గంగన్న. మౌనంగా ముందుకు నడిచాడు.

## 2

అంబ పలుకు....జగదాంబా పలుకు. కాశీ అన్నపూర్ణా పలుకు....కంచి కామాక్షీ పలుకు...." అంటూ వీధుల వెంట తిరుగుతున్నాడో బుడబుక్కల వాడు.

చెయ్యెత్తు మనిషి. కండలు తిరిగిన శరీరం, నొసట విబూది రేఖలు, మూడో కన్నులా ఎర్రగా వెలుగుతున్న బొట్టు, ఒక చేతిలో త్రిశూలం, ఇంకో చేతిలో ఢమరుక.

సాక్షాత్తు కైలాసపతి దిగి వచ్చినట్లే వుందతని వేషం. అతని ప్రక్కనే జోలె పట్టుకుని భుజాన ఒక మూటతో అనుసరించి వస్తున్నాడో యువకుడు.

సాధారణంగా బుడబుక్కల వాళ్ళు తెల్లవారు ఝామునో తెల్లవారుతూండగానో రావటం నోటికి వచ్చిన జోశ్యం చెప్పి, యిచ్చింది పుచ్చుకుని పోవటం సహజం! కాని మిట్ట మధ్యాహ్నం వేళ రావటం, ఒక శిష్యుడ్ని వెంట బెట్టుకుని రావటం విడ్డూరంగా వుంది వారిని గమనిస్తున్న వారందరికీ.

చూపులతోనే వారి సందేహాలన్నీ గమనించినట్లున్నాడు

శిష్యుడు. వెంటనే గొంతెత్తి "శంభో మహాదేవా! శంకర శివా...." అన్నాడు బిగ్గరగా

వెంటనే అందరి చూపులూ యువకుని వైపు తిరిగాయి.

"ఫట్ ఫట్ స్వాములవారు .... హిమాలయాల నుంచీ ఉదయమే వచ్చారు. మిట్టమధ్యాహ్నం వేళ, అర్ధరాత్రి వేళ నగరంలో తిరిగే దయ్యాలను తరిమికొట్టగలరు. అందుకనే మధ్యాహ్నం సమయంలో అయినా సంచారం చేస్తున్నారు. ఎవరికయినా, దయ్యాలు, పిశాచాలు పట్టబోతే ఆ విషయం ముందే గమనించి దీనులను కాపాడుతారు..." అంటూ శిష్యుడు బిగ్గరగా ప్రకటించాడు

త్రిశూలం నేలకి తాటిస్తూ అపర పరమేశ్వరునిలా సాగి పోతున్నాడు ఆ జంగందేవర ఇళ్ళల్లోనుంచీ బయటకు వచ్చి, అతనికి వంగి వంగి నమస్కారాలు చేస్తున్నారు కొందరు.

చెయ్యెత్తి వారి నాశీర్వదించుతున్నాడు జంగందేవర. ఇంత విబూతితోబాటు **నాలుగు** బంగారు కాసులు కూడా వారిమీద పడుతున్నాయి. దానితో ప్రారంభమయింది కోలాహలం.

"జంగందేవర మనకి బంగారం యిస్తున్నాడు రోయ్! రండి....రండి...." అని అరిచాడొకడు. అంతే!

ఇళ్ళల్లో నుంచి బయటకు రానివారుకూడా పరుగు పరుగున వచ్చేశారు! వారినందరినీ ఆదిలించి, ఒక వరసలో నిలబడమని, స్వామివారి అనుగ్రహం ఎవరిమీద వుంటే వారికే విబూది, బంగారు నాణాలు లభించగలవని అదిలిస్తున్నాడు శిష్యుడు.



నాలుగు యిళ్ళుదాటి చటుక్కున ఒక యింటి ముందు ఆగిపోయాడు జంగందేవర.

"రేయ్, శిష్యా! ఈ యింట్లో వుంటున్నది ఎవరురా?"

"తెలియదు, గురూ! మహా తపస్సంపన్నులు....అపర కైలాసనాథులు .... మీరే సెలవీయండి .... గురూ...." అన్నాడు శిష్యుడు.

"చెపుతామురా! అర్భకా....మేముగాక ఇంకెవరు చెప్ప గలరా!" అంటూ "ఇది లక్ష్మన్ బాలా అనే వడ్డీ వ్యాపారిదిరా ఈ యిల్లు! పాపం వృద్ధుడైనా కామం తీరలేదురా! నాలుగో పెళ్ళి చేసుకుందామని ఆలోచిస్తున్నాడురా........ చేసుకోబోయే పిల్లపేరు సౌందర్యరా....ఔనో కాదో.... పోయి ఆ లక్ష్మన్ బాలానే అడగండిరా!" ఖంగుమంటున్న స్వరంతో అన్నాడు జంగందేవర.

"ఇక్కడే వున్నాను స్వామీ! అనుగ్రహించండి...." అంటూ సాగిల పడిపోయాడు గడకర్రలా వున్న వృద్ధుడొకడు.

"ఏరా! నీవేకదురా లక్ష్మణ్ బాలా....ఏరా! నీకు మళ్ళీ పెళ్ళి కావాలిరా?"

"ఔను స్వామీ! కాని ఆ పిల్ల మొరాయిస్తున్నది.... స్వామి...." జంగందేవర పాదాలు కనులకు అద్దుకుంటూ అన్నాడు లక్ష్మణ్ బాలా.

"అది నీ మంచికేరా! నీ మూడోభార్య పిశాచియై కాచుకున్నదిరా! నువ్వు ఏపిల్లను పెళ్ళాడినా దాన్ని అది పిశాచయై పట్టుకుంటుందిరా! కాచుకుని వున్నది ఆ పిశాచం! నీ కొత్తపెళ్ళాన్నిపట్టి అది నిన్ను వేదిస్తుంది. నిన్ను

చంపి తినేదాకా వదలదురా! నీ మేలుకోరి చెప్పానురా" ఖంగ్‌మంటున్న స్వరంతో అన్నాడు జంగందేవర.

"స్వామీ! వద్దు స్వామీ పెళ్ళివద్దు పెడాకులూ వద్దు స్వామీ! బ్రతికివుంటే చాలు! ఆ దయ్యాన్ని- నా మూడో భార్య బాలుకు దయ్యాన్ని నా జోలికి రావద్దని చెప్పండి స్వామీ!" అంటూ లబలబలాడాడు లక్ష్మణ్ భోలా.

లాభం లేదురా! పోయి నువ్వు పెళ్ళి చేసుకోదల్చుకున్న ఆ పిల్ల కాళ్ళు పట్టుకుని పెళ్ళి వద్దని చెప్పరా. అప్పుడు గానీ నీ మూడో భార్య ఆత్మశాంతించదు!" తల అడ్డంగా తిప్పుతూ అన్నాడు జంగందేవర.

"అలాగే స్వామీ! ఇప్పుడే పోతాను. మీరుకూడా ఆ పిశాచానికి చెప్పి తరిమేయండి" అంటూ లేచి పరుగు తీశాడు లక్షణ్ భోలా.

మరో యిద్దరిని ఆశీర్వదించి, నాలుగేసి బంగారు నాణాలు విబూదితోపాటు ప్రసాదంగా పదిలి ముందుకు కదిలారు గురుశిష్యులు యిద్దరూ.

వెంట రాబోయిన కొందరిని వారించారు శిష్యుడు. "స్వాములవారు ఈ రోజుకు ఎవర్నీ చూడరు! వెళ్ళి పోండి...." అని సలహా యిచ్చి మరో వీధిలోకి తిరిగారు గురు శిష్యులు యిద్దరూ.

ఆ తరువాత నిర్జనంగా వున్న తోటలోకి చేరుకున్నారు.

"ఈ సౌందర్య పరిణయ భంగం కాదుగాని ధీరా! ఇప్పటికి నలభై నాణాలు ఖర్చు అయిపోయాయి...." జంగందేవర వేషాన్నుంచి బయటపడుతూ అన్నాడు గంగన్న.



"పోనివ్వు! ఒక ఆడపిల్లను ఒక దుష్టుడి బారిన పడ కుండా కాపాడిన పుణ్యం నీదే గంగా!" నవ్వుతూ అన్నాడు నిశీధుడు.

"పోదూ! నువ్వు మరీనూ .... అక్కడికి పుణ్యమంతా నాదే అయినట్లు! ఈ ఆలోచనా పథకం నాదా?" అడిగాడు గంగన్న.

"కాకపోయినా జంగందేవర వేషంలో ఆ ముసలి పెళ్ళి కొడుకుని పెళ్ళంటే హడలిపోయేట్లు చేసింది నీవా, నేనా?" అడిగాడు నిశీధుడు.

"సరే! యిలా ఒకర్ని ఒకరం పొగుడుకుంటూ వుండట మేనా? కాలేకడుపుకింత కబళం వేసేదేమయినా వుందా?" కోపం నటిస్తూ అడిగాడు గంగన్న,

"జంగందేవర వేషంలో వున్నప్పుడు భక్తులు యిచ్చిన పళ్ళూ ఫలాలు వున్నట్లు వున్నాయి చూస్తా వుండు...." అంటూ నిశీధుడు జోలెలో వెదికాడు.

కొన్ని అరటి పళ్ళు, జామపళ్ళు, నాలుగు మామిడి పళ్ళూ, కాసిని బియ్యమూ, కూరగాయలు వున్నాయి జోలెలో.

మిత్రు లిద్దరూ ఆలోచనల మధ్య ఆ పళ్ళు తినేసి తోటలోని మోట బావిలో నీళ్ళు తోడుకుని తాగారు. కాళ్ళు చేతులు కడుగుకుని తోటలోనుంచీ వీధిలోకి వచ్చారు యిద్దరూ.

దారిలో ఎదురయిన బిచ్చగాడికి బియ్యమూ, కూర గాయలు యిచ్చేసి తిన్నగా వసతి గృహం చేరుకున్నారు.

"ఎక్కడికి పోయారు యిద్దరూ? మీ కోసం చూచిచూచి విసుగెత్తి పోయాను. భోజనం కూడా చేయలేదు" అగిడింది అపురూప ఇద్దరినీ పరీక్షగా చూస్తూ.

"నాకు ఆకలితో ప్రేవులు అపురాపురంటున్నాయి. భోజనం ఎక్కడ?" అంటూ అటు యిటూ చూశాడు నిశీధుడు. కడుపునిండా పళ్ళు ఫలాలు పట్టించినవాడికి యింకా ఆకలి ఎక్కడుందో అర్థం కాలేదు గంగన్నకు.

## 3

అంతఃపుర మందిరంలోకి చేరుకున్నారు మిత్రులిద్దరూ.

రాకుమారి జన్మదినోత్సవ సందర్భంగా వివిధ దేశాల నుంచీ వచ్చిన నర్తకీమణుల మధ్య ఆరంభమయింది పోటీ. న్యాయ నిర్ణేతలుగా నృత్య శాస్త్రకోవిదులు కొందరు పిలిపించబడ్డారు.

నర్తకి అపురూపవంతు వచ్చేసరికి అర్ధ రాత్రివేళ అయింది. పోటీలు మరునాటికి వాయిదా వేసి లేవాడు అలక్ నందాదీవి ప్రభువు. ఉస్సురని నిట్టూర్చాడు గంగన్న. వ్యవహారం ఏదో తేలిపోయి తెల్లవారు ఝామునైనా శ్రీశర్మను వెదుక్కుంటూ పోవచ్చునని అనుకున్నారు తామిద్దరూ.

అలాంటిది మరునటి రోజుకు వాయిదాపడింది నృత్య ప్రదర్శన. అలక్ నందాదీవికి సురక్షితంగా చేరేందుకు కారకురాలు నర్తకి అపురూప. ఆమెను వదలి పోవటం



ఎలా? పోటీ పూర్తయితే ఆమె దారిన ఆమె పోతుంది. తనూ, నిశీధుడూ లేకపోయినా అనుమానం రాదు ఎవరికీ.

పోటీలు వాయిదా పడగానే ఎక్కడివారక్కడ సర్దుకోవటం ప్రారంభించారు అందరూ. నిశీధుడు మాత్రం కదిలే సూచనలు కనిపించక అతనివైపు చూశాడు గంగన్న.

రణధీర్ చూపులు రాకుమారి మీద నిలిచివున్నాయి. పోటీలు ఆరంభమైనప్పట్నుంచి రాకుమారి హావభావాలలో మార్పులేదు. శిలా విగ్రహం మాదిరి ఎలాంటి స్పందనా లేకుండా కూర్చుని వున్నది.

రాకుమారి ముభావానికి కారణం ఏమిటి? తరచుగా ఆమెనే గమనిస్తున్నట్లు కూచుని వున్నాడు రాజు. రాకుమారి అనారోగ్యంగా వుందా? దేశ పరిస్థితి బాగాలేదు. ఎక్కడ చూచినా విప్లవం. విప్లవకారులు! అలాంటి స్థితిలో అనారోగ్యంగా వున్న రాకుమారి జన్మదినోత్సవ వేడుకలని చేయవల్సిన అవసరం ఏముంది?

ఇలాంటి ఆలోచనలతో సతమతమౌతున్నాడు నిశీధుడు.

"ధీరా! ఏమిటి ఆలోచన? అందరూ వెళ్ళి పోయారు! నువ్విలా కూర్చున్నావూ అంటే అనుమానం వస్తుంది.." వంగి నిశీధుడి మెడలోని జారిన హారాన్ని సరిచేస్తున్న వంకతో అన్నాడు గంగన్న!

ఆలోచనలోనుంచీ తేరుకున్నాడు నిశీధుడు. లేచి గంగన్నను అనుసరించాడు. ఇద్దరూ ఆ నర్తనశాలలో నుంచీ బయటకు వచ్చారు.

రాజకుమారి వెనుక ఏదో రహస్యం వుందనిపించింది

నిశీధుడికి. అదేదో తేల్చుకోవాలనే కోరిక అంతకంతకూ బలీయమవుతున్నది అతని అంతరంగంలో.

గంగన్నను అనుసరించి బయటకు రాగానే అటూ యిటూ చూశాడు నిశీధుడు.

"గంగా! నువ్వు అపరూపతో వెళ్ళిపో! నేను వెంటనే వచ్చేస్తాను. నా గురించి ఆలోచించకు" అని లోగొంతుకతో చెప్పి చీకటిలోకి దూకాడు నిశీధుడు.

క్షణకాలం అలాగే నిలబడిపోయాడు గంగన్న. నిశీధుడి వెంట పోదామా అనిపించినా ఏ ఆలోచనతో నిశీధుడు ఒక్కడే వెళ్ళాడో వెంటబడితే ఎలాంటి పరిస్థితి ఎదురు అవుతుందో, లేనిపోని సమస్యలు సృష్టించవల్సి వస్తుందో నని మౌనంగా అపరూపని అనుసరించి కదిలాడు గంగన్న.

o o o

చీకట్లలో నక్కుతూ అంతపురంలోని రాజమందిరానికి చేరుకున్నాడు నిశీధుడు. లోపలకు ప్రవేశించటం ఎలా అన్నదే సమస్యగా నిలిచింది.

ఎదురుచూస్తున్న అదృష్టం కొజ్జా బానిస. "ఏమిటి?" అని అడిగాడు. చీకటిలో నిశీధుడు సరిగా కనిపించలేదు కాబోలు; పైగా రాజపరివారంలో ఒకడనే అనుకున్న ట్లున్నాడు.

పెదవులు కదిల్చీ కదల్చగుండా ఏదో గొణిగాడు నిశీధుడు.

"ఏమిటి? త్వరగా చెప్పు...." విసుగ్గా అడిగాడు బానిస.

మళ్ళీ గొణిగాడు నిశీధుడు.



"త్వరగా చెప్పు! మళ్ళీ రాకుమారి దగ్గరకు పోవాలి.."

విసుగ్గా, కోపంగా అడిగాడు బానిస.

నిశీధుడికి కావల్సినదేదో ఆ బానిస నోటినుంచీ బయట పడిన వెంటనే మెరుపులా కదిలింది అతని చెయ్యి.

కణతమీద లాటిపెట్టి గుద్దాడు నిశీధుడు. ఆ పక్క దెబ్బకే కిక్కురుమనకుండా పడిపోయాడు వాడు.

ముళ్ళ కంపను లాగినట్లు బానిస శరీరాన్ని చాటుకు లాగేశాడు నిశీధుడు. చకచకా ఆ బానిస దుస్తులు ధరించాడు. క్రింద పడివున్న ఆ బానిస చేతిలోని ఈటెని అందుకుని లోపలికి అడుగు వేయబోయి ఆగాడు.

బయట వున్నప్పుడు చీకటి కనుక తనని ఎవరూ గుర్తించలేక పోయారు. కాని అంతపురంలో బాగా తెలిసిన బానిస రూపంలో వెడుతున్నాడు తను! ఎవరికీ అనుమానం కలగదని నమ్మకం ఏమిటి?

—"రోటిలో తలదూర్చి రోకటిపోటుకు వెరవడం దేనికి?

అంతపురంలో గొడవలతో నీకేమిటి? తిన్నగా పోయి శ్రీశర్మ పరిస్థితి ఏమిటో చూడరాదా?

అని సలహా యిచ్చింది అంతరాత్మ. ఆ అంతరాత్మ సలహాని కొట్టి పారేసి నేలమీద యింత మట్టితీసి. మొహానికి పూసుకుని. తలకు వున్న పాగా మరింత క్రిందకు లాగుకుని కదిలాడు నిశీధుడు.

అంతపురంలోకి ప్రవేశించాడు నిశీధుడు. అప్పటికే అర్ధ రాత్రి దాటిపోయి వుండటంవల్ల ఎక్కడి పరిచారిక లక్కడే

నిద్రతో జోగుతూ గోడకు ఆనుకుని వుండిపోయార కావలి భటులు

నిద్ర కనులలో సోలిపోయి వున్నారు బానిసలు. మరింత లోపలకు పోయాడు నిశీధుడు. విశాలమైన గది తలుపుల ఓరగా మూసి వున్నాయి. గది తలుపులకున్న నగిషీలు. ద్వారం ముందు గోడకు ఆనుకుని నిలబడి గుర్రుకొడు తున్న బానిసనూ చూచి అదే రాకుమారి గది అని గ్రహిం చాడు నిశీధుడు.

నెమ్మదిగా తలుపులు నెట్టాడు. లోపలికి అడుగువేశాడు నిశీధుడు. కాలితో నెట్టి తలుపులు మూశాడు.

గాజు బుడ్లలో అమర్చిన నూనె దీపాల కాంతితో ప్రతి వస్తువూ చక్కగా కనిపిస్తున్నది.

అపురూపమైన హంసతూలికా తల్పం. ఆ తల్పం మీద ముడుచుకుని పడివున్నదో సుందరి. ఆమె రాకుమారి.

నేలమీదపడి గాఢ నిద్రలో మునిగి పున్నారు పరిచారికలు. దుస్తుల చాటునుంచీ ఏదో చిన్న వుండల్లాంటిది తీశాడు నిశీధుడు. చేతుల మధ్య దానిని నలిపిఒక్కొక్కరికీ వాసన చూపించాడు.

ఒక్కొక్కరూ చిన్నగా తుమ్మి తలలు వాల్చేశారు. నెమ్మదిగా అడుగు ముందుకు వేశాడు నిశీధుడు.

తల్పంమీద నిదరలో వున్నది ఆ సుందరి. తల్పం సమీపించి మౌనంగా వుండి పోయాడు నిశీధుడు.

ఏమని అడుగుతాడు ఆ సుందరిని? ఏమని ప్రశ్నిస్తాడు! నిద్రలేపి ఏ ని అడగాలి? సందిగ్ధంలో పడినట్లుగా నిల బడాడా నిశీధుడు.



కనులు తెరిచి లేచి కూర్చుంది రాకుమారి. నిశీధుడ్ని చూసి చిన్నగా నవ్వింది. "వెళ్ళి ఆ తలుపులు గడియ పెట్టి రా...." అంది చిన్నగా.

చటుక్కున కదిలాడు నిశీధుడు. ఒక్క అంగలో వెళ్ళి తలుపులు మూసివచ్చాడు. ఈలోగా తల్పం దిగి వెళ్ళి గవాక్షాల తలుపులు మూసి వచ్చింది రాకుమారి.

"చెప్పు, ఎవరు నువ్వు? నావైపు ఎందుకలా చూశావు?" అడిగింది తీక్షణంగా.

"బానిసను....మీరు ఎవరనుకుని మాట్లాడుతున్నారో?"

"ఎందుకు వచ్చావు నా మందిరంలోకి?"

"ఏదయినా ఖరీదైనవి దొరుకుతాయేమో తీసుకుపోదామని దొంగతనం చేద్దామని వచ్చాను...."

నవ్వింది రాకుమారి. "కాదు....నువ్వు దొంగవు కాదు. ఆ సంగతి నాకు తెలుసు. నర్తకీతో వచ్చిన వాద్యగాడి లక్షణాలు లేవు నీలో! నిజం చెప్పు" అంది అతన్ని పరీక్షగా చూస్తూ.

"క్షమించండి! నేను దొంగను. భటులను పిలిపించి నన్ను శిక్షించండి...." అన్నాడు నిశీధుడు.

"శిక్షిస్తాను....శిక్షించకుండా ఎలా వుంటాను?" అంటూ అతన్ని సమీపించి చివాలున కౌగిలించుకుంది రాకుమారి.

కంగారుగా ఏదో అనబోయాడు నిశీధుడు. అతని పెదాలకు ఆమె అరుణాధరాలు తాపడమై పోయాయి. ఆమె చేతులు తృష్ణసర్పాల్లా అతని మెడను చుట్టుకుపోయాయి.

ఆ కౌగిలిలోనుంచీ తప్పించుకునే ప్రయత్నం చేశాడు నిశీధుడు. నెరవేరలేదు అతని ప్రయత్నం.

"నిన్ను వదిలే ప్రసక్తిలేదు నిశీధా!" అందామె గుసగుసగా.

ఉలిక్కిపడ్డాడు నిశీధుడు. తన గురించి పూర్తిగా తెలిసిపోయింది ఈమెకు.

## 4

అరగంట తరువాత చెదరిన కురులూ, దుస్తులూ సరిచేసుకుంటూ చిన్నగా నవ్వింది రాకుమారి.

"నీ గురించి నాకు అపురూప అంతా చెప్పింది. నీ సహాయంతోనే నా తండ్రిని కాపాడుకోవాలనుకుంటున్నాను. నేనే నిన్ను నా దగ్గరకు రమ్మని పిలవాలని అనుకుంటున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు" అంది.

తండ్రిని కాపాడుకోవటమా? అలక్‌నందాదేవి రాజుకి ఏమయింది? నృత్య పోటీల సందర్భంగా వచ్చిన అతన్ని తనూ చూశాడు. ఎలాంటి మార్పూ కనిపించలేదు.

అతని ఆలోచన గ్రహించినట్లు చెప్పింది రాకుమారి. "రాజుగా నటిస్తున్నతను నా తండ్రి కాదు. నా తండ్రిని ఎక్కడో బంధించారు. నేను ఆ విషయం ఎవరికీ చెప్పుకునేందుకులేదు. నాకుతప్ప ఎవరికీ తెలియదు ఆ రహస్యం. విప్లవం కూడా ఈ ద్రోహి చేస్తున్న కుట్ర! రాజభక్తులను, విశ్వాస పాత్రులను కాల్చుకుతింటున్నాడు. ఎక్కడికక్కడే తనకు ఆటంకం లేకుండా చేసుకుంటున్నాడు.



"నిశీధా! ఎలాగైనా నా తండ్రిని కాపాడాలి! అలక్‌నందాదేవి రాజ్యంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనేలా చూడాలి. ఈ బాధ్యత నువ్వు నిర్వహించక తప్పదు. "నా కోసం " అంటూ అతని రెండు చేతులూ పట్టుకుంది.

సున్నితంగా తన చేతులు విడిపించుకున్నాడు నిశీధుడు. "రాకుమారీ! నా ప్రయత్నం నేను చేస్తాను. అయితే మీ తండ్రిగా నటిస్తున్న దెవరు?" అని అడిగాడు.

"తెలియదు."

"అతను మీ తండ్రికాదని ఎప్పుడు అనుమానించారు? మీ తల్లి గారికి తెలియదా?" ప్రశ్నించాడు నిశీధుడు.

"నా తల్లిగారు స్వర్గస్తురాలయి సంవత్సరం దాటింది. ఇతను నా తండ్రి కాదని అనుమానించటం పెద్ద సమస్యకాదు. కన్న తండ్రి అయినవాడెవడూ బిడ్డను చూసే చూపులు కావని" తల వంచుకుంది రాకుమారి.

ఇంకేదో అడగబోయాడు నిశీధుడు. అంతలోనే తలుపు మీద టక్‌టక్ చప్పుడైంది. కంగారుగా నిశీధుడి చెయ్యి పట్టుకుంది రాకుమారి.

చటుక్కున అతన్ని ప్రక్కకు లాగుకు పోయింది రాకుమారి. మూసివున్న తలుపులు తెరిచి గదిలోకి నెట్టింది తిరిగి తలుపులు మూసి గడియవేసింది.

"ఎవరు?" బిద్ధకం ధ్వనిస్తున్న కంఠంతో అడిగింది.

"యువరాణీ? తలుపులు తెరవండి. ప్రభువులు మీ కోసం వచ్చారు...." అని వినిపించింది బయటనుంచీ.

అలజడిగా నిశీధుడ్ని లోపలకు నెట్టిన గదివైపు చూసింది రాకుమారి.

మరోసారి తలుపులపై చప్పుడు. "రాకుమారీ! తలుపు తెరవండి...." అని పిలుపు.

నిదరమత్తు వదలినట్లు పెద్దగా ఆవలిస్తూ కదిలింది రాకుమారి. తలుపు గడియతీసి మరోసారి ఆవలించి చిటికెలు వేసింది.

"ఏమిటిది? అర్ధరాత్రివేళ .... నిదరపోనీయరా ఏం?" విసుగు నటిస్తూ అంది రాకుమారి.

ముందుకు వచ్చాడు అలకనందాదీవి పరిపాలకుడు "ఏమీ లేదమ్మా యువరాణీ! మన బానిసను ఎవరో చంపేశారు. వాడి దుస్తులులేవు. శవం గోడచాటున పడివుంది. అంతే ఆ బానిస వేషంలో ఎవరో మన అంతఃపురంలోకి ప్రవేశించాడు!" అంటూనే వెనక్కి తిరిగి భటులవైపు చూశాడతను.

"వెదకండి! బానిస వేషంలో వచ్చిన వాడు ఎక్కడున్నాడో వెదకండి...." అని ఆజ్ఞాపించాడు.

"అతను నా మందిరంలో ఎందుకు వుంటాడు?" తీవ్రంగా చూస్తూ అడిగింది రాకుమారి.

"ఆ బానిస నీ మందిరానికి సంబంధించినవాడే కనుక ఆ వేషంలో వచ్చినవాడూ నీ మందిరంలోకి వచ్చివుండాలి!" అంటూ భటులను వెదకమని సైగ చేశాడతను.

అదుపు తప్పుతున్న గుండెని చిక్కబట్టుకుంటూ చూసింది రాకుమారి. మందిరంలో జొరబడిన భటులు అంగుళం కూడా వదలటం లేదు. నిశీథుడు దాగిన గదిని మాత్రం వదులుతారా?



రాకుమారి భయపడినంతా జరిగింది. నకిలీ రాజు తనని గమనిస్తున్నాడని గ్రహించి తల వంచుకుంది.

భటులు తలుపులు తెరిచారు. వేగంగా లోపలికి జొరబడ్డారు. గుండెలమీద చెయ్యి వేసుకుని నిలబడింది రాకుమారి.

లోపలకు వెళ్ళిన భటులు తిరిగి వచ్చారు. "ప్రభూ! లోపల ఎవరూ లేరు. అంతా వెదికాం. బానిస వేషంలో అంతఃపురంలోకి వచ్చిన ఆ కొత్త వ్యక్తి ఎవరో రాకుమారి మందిరంలోకి రాలేదు" అన్నారు ఏకకంఠంతో.

"సరే, వెళ్ళండి! జాగ్రత్తగా అంతఃపురం అంతా వెదకండి. అనుమానితుడుగా ఎవరూ కనిపించినా వెంటనే పట్టుకోండి. సాధ్యం కాకపోతే అక్కడికక్కడే చంపండి!" ఖంగ్‌మంటున్న స్వరంతో ఆజ్ఞాపించాడు ప్రభువు.

"చిత్తం, మహారాజా!" అంటూ ఆ గదిలోనుంచి వెళ్ళిపోయారు భటులు.

ఓరకంట చూశాడు మహారాజు. మందిరాన్నంతా పరీక్షించి తిరిగి రాకుమారి వైపు చూశాడు.

"యువరాణీ! ఆ మనిషిని నువ్వు దాచాలనో, రక్షించాలనో ప్రయత్నిస్తే అది మూర్ఖత్వమే అవుతుంది!" అని హెచ్చరించి బయటకు వెళ్ళిపోయాడు నకిలీ మహారాజు.

తలుపులు మూసి, లోపల గడియపెట్టి వేగంగా నిశీథుడున్న దాచిన గదిలోకి పరుగుతీసింది రాకుమారి.

గదినంతా వెతికించి ఆందోళనాభరిత హృదయంతో

ఏడీ నిశీధుడు? వుంచేగా? ఆ గదిలో కిటికీ తలుపులు బార్లా తెరిచి వున్నాయి.

నిశీధుడు ఆ కిటికీ గదిలోనుంచీ బయటకు దూకి తప్పించుకున్నాడని గ్రహించింది రాకుమారి.

చిన్నగా నిట్టూరుస్తూ శయ్యను సమీపించింది. ఆమె కనులముందు బలమైన నిశీధుడి కౌగిలి గుర్తుకి వస్తూంటే తన్మయత్వంతో కనులు మూసుకుంది రాకుమారి.

## 5

అకస్మాత్తుగా ఎక్కడికి వెళ్ళారు ప్రభూ! వంటరిగా భయంతో హడలిపోతూ వుండిపోయాను" గారంగా అంటూ రాజు వైపు చూసింది ఆ పడుచు.

నవ్వాడు మహారాజు. భుజంమీద వున్న పట్టు ఉత్తరీయాన్ని తీసి బల్లమీద వుంచి, నడుముకి వున్న కత్తిని వరతో సహా తీసి, శయ్యకు అందుబాటులో వుంచాడు.

శయ్యమీద అర్ధ నగ్నంగా కూర్చుని వుందా పడుచు. ఆమెని దగ్గరకు లాక్కుంటూ శయ్యమీద వాలాడు మహారాజు.

ఆమెకూడా జారిపోయే వస్త్రాన్ని పట్టించుకోకుండా అతన్ని కౌగలించుకుంది. ఇద్దరూ క్షణంలో ఏకమైపోయారు.

క్షణాలు నిమిషాలయి పోతున్నాయి. శయ్య ప్రక్కనే వున్న వరతో సహా కత్తిని ఎవరో అందుకోవటంగాని, ఆ గది తలుపులు మూసుకు పోవటంగాని మహారాజు గమనించలేదు.



ఆ పడుచు పరువాలతో ఆడుకుని సంతృప్తి చెందిన ట్లున్నాడు మహారాజు. నవ్వుతూ లేచి జారిన దుస్తులు సరి చేసుకుంటూ ఎందుకో తలెత్తి ఉలిక్కిపడ్డాడు.

ఎదురుగా తన కత్తినే పట్టుకుని నిలబడి వున్నాడో బానిస.

"ఎవరు నువ్వు?" అడిగాడు మహారాజు తీక్షణంగా చూస్తూ.

ఆ పడుచు కంగారుగా దుస్తులుమీదకు లాగుకుంది. చూపులు మహారాజు మీదకు మళ్ళించాడు బానిస వేషంలోని నిశీధుడు.

"నకిలీ మహారాజా! నేను ప్రపంచ గూఢచారుల సంస్థ తరపున వచ్చాను. అసలు మహారాజుని ఎక్కడ బంధించావో చెప్పి లొంగిపోవటం నీకు మంచిది...." సూటిగా చూస్తూ అన్నాడు నిశీధుడు.

కనులు పెద్దవి చేసి చూశాడు మహారాజు ఆ తరువాత పెద్దగా నవ్వాడు. "ప్రగూసం తరపున వచ్చావా? సరే.... నువ్వు ఎవరయినా సరే! యిక్కడి నుంచీ తప్పించుకు పోలేవు...." అన్నాడు గంభీరంగా.

"నా సంగతి కాదు. నకిలీ రాజా! ఎక్కడ బంధించావు అసలు మహారాజుని?" రెట్టించి అడిగాడు నిశీధుడు.

నవ్వాడు మహారాజు. జవాబు చెప్పకుండా పెద్దగా నవ్వాడు. అంతే!

ఆ గదిలోని మూసివున్న యితర ద్వారాలు తెరుచుకున్నాయి. బిలబిలమంటూ వచ్చి చక్రబంధంలో నిశీధుడ్ని చుట్టూ ముట్టారు ఇరవై మంది సైనికులు.

క్షణకాలం చకితుడై చూశాడు నిశీధుడు. అది చూసి వికటంగా నవ్వాడు రాజు.

"ఇప్పుడేమంటావు, గూఢచారీ! నీలాంటి వారిని పట్టుకునేందుకు రాజమందిరాలలో ఎలాంటి ఏర్పాట్లు వుంటాయో నీకు తెలిసినట్లు లేదు...."

జవాబు చెప్పలేదు నిశీధుడు. మెరుపులా కదిలాడు. కంటికి కనిపించని వేగంతో కదిలింది అతని చేతిలోని కత్తి.

ఐదుగురి చేతులలోని కత్తులు ఎగిరి పోయాయి. మరొకసారి కత్తి తిప్పాడు నిశీధుడు ఆ ఐదుగురి తలలూ ఎగిరి పోయాయి.

అది చూసి కంగారుగా అరిచాడు మహారాజు. "పట్టుకోండి. లేదా ముక్కలుగా నరకండి ఈ గూఢచారిని...." అంటూ ద్వారంవైపు అడుగు వేయబోయాడు.

తలుపు తెరిచి మరికొందరిని పిలవబోతున్నాడని గ్రహించాడు నిశీధుడు కాళ్ళు నేలకి తన్ని గాలిలోకి ఎగిరాడు.

ఒక కాలెత్తి నకిలీ మహారాజు నడుంమీద లాగిపెట్టి తన్నాడు. కెవ్వున అరుస్తూ భటులమీద పడ్డాడు మహారాజు.

క్రిందపడిన కత్తులలో రెండోదాన్ని అందుకున్నాడు నిశీధుడు. రెండు చేతులతో కత్తులు తిప్పుతూ విజృంభించాడు నిశీధుడు.

ఎక్కువసేపు అలా ఆ భటులతో పోరాడుతూ కూర్చో



లేనని తెలుసు అతనికి. మరో నలుగురి తలలు ఎగరకొట్టి ఎగిరి ద్వారం దగ్గరకు దూకాడు నిశీధుడు.

చేతిలోని రెండో కత్తిని గిరగిరా తిప్పి తనమీదకు రాబోయే నలుగురిమీదకు విసిరాడు. కెవ్వున అరిచారు ఆ నలుగురూ.

ఇద్దరి మొహాలు తీవ్రంగా గాయపడ్డాయి. మరో ఇద్దరి కత్తులు ఎగిరిపోయాయి ఆ వ్రేటుకు.

"పట్టుకోండి! ఆ దుర్మార్గుడ్ని పట్టుకోండి...." అని అరిచాడు మహారాజు.

తలుపులు వేస్తూ దుస్తుల చాటునుంచీ ఏదో వుండలాంటిది తీసి వారిమీదకు విసిరాడు నిశీధుడు.

నేలను తాకుతూనే టప్‌మంటూ బ్రద్దలయిందది. బ్రద్దలవుతూనే నల్లటి పొగలను వెలువరించిందది.

క్షణంలో దట్టంగా అలుముకున్నాయి ఆ పొగలు గది నిండా.

నకిలీ మహారాజుతో సహా ఎక్కడి వారక్కడ స్పృహ కోల్పోయి పడిపోయారు. ఆ గదిలోనుంచి బయటకు దూకి, ముందుకు పరుగెత్తాడు నిశీధుడు. మహారాజు అరుపులు విని పరుగు పరుగున వస్తున్నారు భటులు.

"తొందరగా వెళ్ళండి! ఎవడో దొంగ అంతపురంలో జొరబడ్డాడు. మహారాజు ప్రమాదంలో వున్నారు" అంటూ ప్రక్కకి తిరిగి యువరాణి గదిలోకి వెళ్ళాడు నిశీధుడు.

శయ్యపై వాలినా ఇంకా నిద్రపోలేదు రాకుమారి. అతన్ని చూడగానే చటుక్కున లేచి కూర్చుందామె

"రాకుమారీ! నీ తండ్రిగారిని గుర్తుపట్టేందుకు, ఆయన నన్ను అనుమానించకుండా వుండేందుకు ఏమయినా చెప్పండి. వ్యవధిలేదు...." అన్నాడు నిశీధుడు.

"అంత తొందరేం! మళ్ళీ ఎవరయినా వస్తారనా?"

"దయచేసి నాకు వివరంగా చెప్పండి. మీ తండ్రిగారిని అన్వేషిస్తూ వెళ్ళాలి!" తొందర చేశాడు నిశీధుడు.

క్షణం ఆలోచించి చెప్పింది రాకుమారి. తన మెడలోని పతకపు గొలుసుతీసి యిచ్చింది. "యిదిగో .... నా తండ్రిగారిని రక్షించి తిన్నగా యిక్కడికి తీసుకురావాలి. నువ్వు నాదగ్గరే వుండిపోవాలి... అర్థమైందా?" అడిగింది.

తల వూపాడు నిశీధుడు. పతకపు గొలుసు దుస్తులలో భద్ర పరచుకుని ఆ గదిలోనుంచి బయటకు వచ్చేశాడు.

నకిలీ మహారాజుకు యింకా స్పృహ వచ్చినట్లులేదు. రాజ వైద్యుడూ, మంత్రి తదితర అధికారులు హడావుడిగా పోతున్నారు ఆ గదిలోకి.

నవ్వుకుంటూ బానిస దుస్తులు విప్పి, దూరంగా విసిరి, వసతి గృహం వైపు పరుగు తీశాడు నిశీధుడు

ముసుగుపెట్టి గురకలు కొడుతున్నాడు గంగన్న. పాదరక్షలు దూరంగా విసిరి గంగన్న ప్రక్కలోకి దూరి ఆ ముసుగు తనూ మీదకు లాగుకున్నాడు నిశీధుడు

అప్పుడు కాని తెలియలేదు అతనికి. ముసుగులో వున్నది గంగన్న కాదని, అపురూప అనీ!

చటుక్కున లేవబోయిన అతన్ని మీదకు లాగుకుంది నర్తకి అపురూప. "చేసిన సాహసాలు చాలుగాని ఇకనైనా మన సంగతి ఆలోచించు...." అంది నవ్వుతూ.

# 6

అపురూపా! ఇక నీవుగాని, మేముగాని ఇక్కడుండటం మంచిదికాదు; వెంటనే నీ దారిన నీవూ, మాదారిన మేమూ బయల్దేరటం మంచిది...." అన్నాడు నిశీధుడు.

తెల్లవారు ఝామున నాలుగు గంటలు కావస్తోంది. గంగన్న ఆవలిస్తూ ఒక మూలగా కూర్చుని వున్నాడు.

"అదేమీ కుదరదు. వంటరిగా వెనక్కి తిరిగే ప్రసక్తి లేదు. మీతోపాటు నల్లకొండలోకి రావల్సిందే! తప్పదు" దృఢ స్వరంతో అంది నర్తకి అపురూప.

నిస్సహాయంగా, నచ్చచెప్పమన్నట్లు చూశాడు గంగన్న వైపు. భుజాలు ఎగరేసి. ఇది మీ ఇద్దరి వ్యవహారం అన్నట్లు చూసి, అవతలికి పోయాడు గంగన్న.

అది గమనించి మరింత పట్టుదలగా అంది అపురూప. "ఇదిగో నీ మాయవేషాలు నాదగ్గర కుదరవు!" నన్నూ నల్లకొండలోకి తీసుకు వెళ్ళాల్సిందే...."

ఇంక చేసేది లేదని అర్థమైంది నిశీధుడికి. అయినా తప్పించుకునే మార్గం దొరుకుతుందేమోనని అడిగాడు.

"మేమంటే ఎలాగో అలా పారిపోగలం. కానీ నువ్వు ఆడదానివి...."

"చూడు. మహాశయా! నేనూ ప్రగూఢం నియమించిన గూఢచారిణిని. నర్తకిగా పోటీలో పాల్గొననీ, అనారోగ్యంగా వుందని, వెళ్ళిపోయేందుకు అనుమతి పత్రం వ్రాయించుకుని సిద్ధంగా వుంచుకున్నాను. మన ప్రయాణా

నికి ఎలాంటి ఆటంకమూ రాదు...." అంది అపురూప నవ్వుతూ.

పొంగివచ్చే నిట్టూర్పుని అణుచుకున్నాడు నిశీధుడు. "ఇంకెందుకు ధీరా! ప్రయాణానికి ఏర్పాట్లు చేయనా?" అంటూ వచ్చాడు గంగన్న.

"కానివ్వు!" అన్నాడు నిశీధుడు నవ్వుతూ. మెరుస్తున్న కనులతో గంగన్న వెళ్ళగానే నిశీధుని సమీపించబోయింది అపురూప.

ఒక్క గంతులో ప్రక్కకి తప్పుకున్నాడు నిశీధుడు. కొరకొరా చూస్తూ తనవంతు బట్టలు, నృత్య ప్రదర్శనకు సంబంధించిన సామాగ్రి సర్దుకోవటం ప్రారంభించింది అపురూప.

అరగంట తరువాత తెరలు కట్టిన బండిలో బయల్దేరారు అపురూప, నిశీధుడు, గంగన్న. మిగిలిన వాద్యగాళ్ళు మరో బండిలో ప్రయాణం సాగించారు.

అపురూప అనుకున్నంత తేలిక కాలేదు ప్రయాణం. అడుగడుక్కీ రాజభటులు బండీలను ఆపి శల్యపరీక్ష ప్రారంభించారు. ఆ ప్రమాదాన్ని ముందే గ్రహించాడు నిశీధుడు. ముందే గూనివాడి వేషం వేశాడు. దానికి తోడు రాజభటులు ప్రశ్నించినప్పుడల్లా మెల్లకన్ను పెట్టి నత్తిగా జవాబులు చెప్పటం ప్రారంభించాడు.

నగరం చివరికి చేరేసరికి ఆ నాటకం కూడా ఎక్కువసేపు కొనసాగదని అర్థమైపోయింది ముగ్గురికీ.

దాదాపు నలభైమంది రాజభటులు శిరస్త్రాణాలు, ఉక్కు కత్తులూ ధరించి కాచుకుని వున్నారు. బండిని చూడగానే చుట్టుముట్టారు అందరూ.

ఆ భటులకు అధికారి కాబోలు వరలోనుంచీ కత్తితీసి ఝళిపిస్తూ "బండి దిగండి" అని హెచ్చరించాడు.

"బ బ బం....డి ది....గ....టం ఎందుకు అ....య్యా....?" నత్తిగా అడిగాడు నిశీధుడు

"గూఢచారి ఒకడు మారువేషంలో తప్పించుకు పోతున్నాడని వార్త అందింది....దిగరా! నీది అసలు నత్తి అవునో కాదో పరీక్షించాలి....అగు!" కటువుగా అంటూ తెరలు కత్తితో ప్రక్కకి నెట్టాడు ఆ దళాధిపతి.

"గూఢచారా....ఆయ్యో బాబోయ్...." అంటూ చేతిలో వున్న మద్దెల బండిలోనుంచీ క్రిందకు జారవిడిచాడు గంగన్న.

అటూ ఇటూ తెరుచుకు పోయింది ఆ మద్దెల. బుస్సుమంటూ పడగలు విప్పుకుని బయటకు వచ్చాయి నాలుగు విషసర్పాలు.

దళాధిపతి పాదాన్ని ముద్దుగా కాటువేసిం దొకటి, అందిన వాటినల్లా కాటువేస్తూ బుసలు కొట్టడం ప్రారంభించాయి మిగిలిన సర్పాలు

"చచ్చానురోయ్ ....పాము కరిచింది నన్ను!" అని అరిచాడొకడు

"భగవంతుడా! నా నలుగురు భార్యలకు దిక్కెవరు?" అని ఆక్రోశించాడొకడు.

దుస్తుల చాటున దాచిన కత్తులు బయటకు లాగి గుర్రెల మీదకు దూకే జంటపుల్లా విజృంభించారు మిత్రులిద్దరూ.

అందిన వాడిని అందినట్లే ఊచకోత కోయటం ప్రారంభించారు. అది చూచి మిగిలిన వాయిద్యగాళ్ళు, అపురూప విజృంభించారు.

నలభై మందిలో సగం మందిని పంచుకున్నట్లు విజృం విజృంభించారు మిత్రులిద్దరూ. ఆ కత్తుల శబ్దాలకు బెదరి పారిపోయాయి సర్పాలు.

కత్తి పుచ్చుకుని చెంగు నడుముకి చెక్కి వీరనారిలా విజృంభించింది నర్తకి అపురూప.

రెండు చేతులతో కత్తులు పట్టి ఎక్కడ చూచినా తానై వీరవిహారం చేస్తున్నాడు నిశిధుడు.

అతని కత్తి దెబ్బలను కాచుకోవటమే అసాధ్యమై పోయింది రాజభటులకు. పైగా దళాధిపతిలేని సైన్యం, నాయకత్వం లేకపోవటంతో తకావికలై పోయింది. ఐదు నిమిషాలు గడిచేసరికి పదిమంది కూడా మిగలలేదు.

ఆ పదిమందికీ ప్రాణాలపై ఆశ పుట్టినట్లుంది. తప్పించుకు పోవాలని ప్రయత్నించారు నెరవేరలేదు వారి ప్రయత్నం.

"రేయ్ ఎక్కడికి పోతార్రా! ధీరా .... వీళ్ళని పోనిస్తే మనకే ప్రమాదం...." అని హెచ్చరిస్తూ వారిమీదకు దూకాడు గంగన్న.

ఇంకోవైపునుంచీ నిశిధుడు, అపురూప కమ్ముకున్నారు. వలలో చిక్కిన పక్షుల్లా ఆ పదిమంది నాశనమై పోయారు.

మూడు గుర్రాలను ఎన్నికచేసి, మిగిలిన వాటిని దూరంగా తోలేశాడు గంగన్న.



తనతో వచ్చిన వాద్యగాళ్ళ చేతికి దండిగా ధనం ఇచ్చి ఎక్కైనాపోయి బ్రతకమని చెప్పి ఒక అశ్వాన్ని అధిరోహించింది నర్తకి అపురూప.

మూడు గుర్రాలూ ఉదయిస్తున్న సూర్యకాంతిలో వేగంగా అడవులవైపు సాగిపోయాయి.

* * ○

ఎక్కడా ఆగకుండా పగలంతా ప్రయాణించి చీకటి పడేవేళకు అడవిలోకి ప్రవేశించాయి మూడు గుర్రాలూ.

"గంగా! ఇంక ఈ అరణ్యంలో మనం ముందుకుపోలేం. రాత్రికి జాగ్రత్తపడి తెల్లవారగానే తిరిగి బయల్దేరుదాం" అన్నాడు నిశిధుడు.

ముగ్గురూ గుర్రాలు దిగారు. తల ఎత్తి పైకి చూసింది అపురూప. ఆకాశాన్ని అంటుకునేంత ఎత్తులో వున్నాయి చెట్లు అల్లిబిల్లిగా అల్లుకుపోయాయి పొదలు. సూర్యుడు యింకా పూర్తిగా అస్తమించకముందే అడవిలో చీకటి ఏర్పడుతుంది.

"ధీరా! నేనీ చెట్టు ఎక్కి మన ముగ్గురికీ పడుకునేందుకు ఏర్పాటు చేస్తాను. నువ్వు తినేందుకు పళ్ళు ఫలాల వంటివి ఏమయినా వున్నాయేమో చూడు...." అంటూనే చెట్టు ఎక్కాడు గంగన్న.

అపురూపని జాగ్రత్తగా వుండమని హెచ్చరించి తను ఒక ప్రక్కకు పోయాడు నిశిధుడు. చేత కత్తి ధరించి ధైర్యంగా నిలబడింది అపురూప.

సరిగా గంగన్న ఎక్కిన చెట్టు చాటునుంచీ పిల్లుల్లా

కదిలి వచ్చారు యిద్దరు వికృత రూపులు. బిగించి పట్టుకున్న కత్తితో అటు యిటూ చూస్తూ నిలబడింది అపురూప. కాని వెనకనుంచీ వచ్చే ప్రమాదాన్ని గమనించలేదు.

అడుగుల చప్పుడు కాకుండా ఆమె వెనుకగా వచ్చారు ఆ యిద్దరు వికృతరూపులూ. ఒకడు ఆమె చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నాడు. రెండోవాడు నోరునొక్కి ఎత్తి భుజం మీద వేసుకోబోయాడు.

చాలా ఆలస్యంగా గ్రహించింది అపురూప. చేతుల్ని కదిలించటానికి వీలు కాకపోయినా కాళ్ళు నేలకి తన్ని పట్టి కొడుతూ, తన చేతుల్ని విరిచి పట్టుకున్న వాడి పొట్టలో లాగిపెట్టి తన్నింది.

పట్టు వదిలేస్తూ కెవ్వున అరిచాడు వాడు. గిరుక్కున తిరిగి నిలదొక్కుకుంటూ రెండోవాడిమీదకు దాడి చేసింది అపురూప.

అదిరిపడి వెనక్కి గెంతాడు వాడు. నడుముకి వుందో వంపు తిరిగిన కత్తి ఎత్తి ఒకే ఒక్క దెబ్బవేసేంది వాడి నడినెత్తిన.

రెండుగా చీలిపోయింది వాడితల. సుడులు తిరుగుతూ ఎగజిమ్ముకు వచ్చింది రక్తం. క్రిందపడి లేచి అపురూప మీదకు దాడి చేద్దామనుకున్నాడు మొదటి వాడు.

తన సహచరుడి చావు చూసేసరికి అర్థమైపోయింది వాడికి.

తాము పట్టుకోబోయిన స్త్రీ సామాన్యురాలు కాదని! వొంటరిగా ఆమె నెదరించే ధైర్యం చాలలేదు వాడికి.



గిరుక్కున తిరిగి ఒక్క పరుగులో చీకట్లలో కలిసిపోయాడు ఆ వికృత రూపుడు.

తలపాగాలో మూట కట్టుకు వచ్చాడు నిశీధుడు అడవి దుంపలు, పండ్లూ. వస్తూనే క్రింద పడివున్నవాడిని, రక్తపు మడుగునూ చూచాడు.

"అపురూపా! ఎవరినో యమపురికి పంపినట్లున్నావే?" అని అడిగాడు నవ్వుతూ.

తల వూపింది అపురూప. "ఎవరో తెలియదు ధీరా! నా అనుమానం ఆటవికులో, నరమాంస భక్షకులో అయి వుండాలి! మనం రాత్రివేళ కూడా వంతులవారిగా నిద్రపోకుండా వుండటం అవసరం!" అంది గంభీరంగా.

"ఇద్దరూ పైకి రండి, ధీరా! తరువాత చర్చ చేయవచ్చు...." అని కేకవేశాడు గంగన్న చెట్టు పైనుంచీ.

"సరే! చెట్టెక్కగలవా?" నవ్వుతూ అడిగాడు నిశీధుడు.

"చూడు. మహాశయా! ముదితల్ నేర్వగరాని విద్య కలదే అన్నారు పెద్దలు...." నవ్వుతూ చెప్పి కత్తి వరలో దూర్చి చకచకా చెట్టెక్కింది అపురూప.

ఆమె వెనుకనే తనూ చెట్టు ఎక్కాడు. ఆ యిద్దరూ పడుకునేందుకు వీలుగా ఒక మంచెలాంటిది తయారు చేశాడు గంగన్న చెట్టు కొమ్మలు, తీగలు ఉపయోగించి.

తనకి యింకో కొమ్మమీద పడక ఏర్పాటు చేసుకున్నాడు. మూటలోనుంచీ తీసిన దుంపలు, పళ్ళూ ముగ్గురికీ సమంగా పంచి యిచ్చింది అపురూప.

"అసలు అలక్‌నందాదీవి రాజు బంధింపబడిన దెక్కడో నీకు సూచనగానైనా తెలుసా?" దుంపలు నములుతూ అడిగాడు

"లోలా* అనే ప్రగూనం గూఢచారి తన అనుమానంగా మాత్రమే నల్లకొండలలో అసలు రాజు బంధింపబడి వుండాలని తెలియజేశాడు. మరికొన్ని వివరాలు తెలుసుకునేందుకు బయల్దేరాడు. ప్రాణాలతో వుంటే ఎప్పటికైనా వచ్చి కలుస్తానని. లేకపోతే తన అనంతరం పరిశోధనకు వచ్చే గూఢచారి వచ్చి నన్ను కలుసుకుంటాడని చెప్పి పోయాడు. మళ్ళీ రాలేదు. అతను పంపిస్తానన్న గూఢచారి రాలేదు...." అంది అపురూప.

* లోలా అనే గూఢచారి గురించి తెలుసుకునేందుకు చదవండి: 'ఎర్ర చీమ' తుర్లపాటి రచన. డాలర్ బుక్ హౌస్, మద్రాసు-600026 ప్రచురణ.

"గూఢచారి లోలా పంపిస్తానన్న గూఢచారిని నేనే. తన పేరు డోలా కాదు లోలా!" వివరించాడు నిశీధుడు.

చిన్నగా నిట్టూర్చింది అపురూప. ఆ సంభాషణతో తనకు నిమిత్తం లేనట్లు దుంపలు, పళ్ళు తినేసి చేతులు దులుపుకుని పెద్దగా ఆవలించాడు గంగన్న.

"ధీరా! నేనుపోయి పడుకుంటాను. అర్ధరాత్రివరకు మీ వంతు ఆ తరువాత మేలుకోవటం నా వంతు!" అని వాటాలు నిర్ణయించి తన పడక దగ్గరకు వెళ్ళిపోయాడు గంగన్న.

"భలే మిత్రుడిన్ని సంపాదించావు ధీరా! నీ కోసం ప్రాణమయినా యిస్తాడు...." అంది అపురూప.



తల వూపాడు నిశీధుడు. "అసలు మహారాజు నల్లకొండలలో ఎక్కడో బంధించబడి వుండాలి...." అన్నాడు.

"ఎందుకిలా అనుకుంటున్నావు?" కనులు చిట్లించి అడిగింది అపురూప.

"లోలా మరణిస్తూ నల్లకొండలలో వుండే అతని మిత్రుడు పుళిందుని కలుసుకుంటే నా పరిశోధన ముందుకు సాగుతుందని చెప్పాడు. అంతేకాదు, నల్లకొండల గురించి వివరాలు తెలుసుకునేందుకు నిన్ను కలుసుకోమని చెప్పాడు. నేను అందుకనే నీ దగ్గరకు వచ్చాను. తీరా నిన్ను కలుసుకున్నాక శ్రీశర్మ విషయం తెలిసింది...." అన్నాడు నిశీధుడు సాలోచనగా తల పంకించింది నర్తకి అపురూప.

"ఇప్పుడు అర్థమవుతోంది ధీరా! నన్ను కలుసుకున్నప్పుడే నల్లకొండల గురించి వివరాలు తెలుసుకుని వుండమని, అవసరమైతే నేను అక్కడికి వెళ్ళవల్సి వుంటుందని అన్నాడు. అప్పటికే అతనికి మహారాజా అక్కడ బంధించబడి వున్నట్లు అనుమానం వుండి వుంటుంది. మరికొన్ని వివరాలు సేకరించేందుకు పోయి, శత్రువులకు చిక్కివుంటాడు...." అంది నెమ్మదిగా.

తల వూపాడు నిశీధుడు. అలక్‌నందాదీవి తరపున ఎవరో ప్రగూనంని, రాజ్యాన్ని, రాజునీ కాపాడమని ఎవరు కోరినట్లు?" అని ప్రశ్నించాడు.

"రాకుమారికి అత్యంత ఆప్తుడు రాజకుటుంబానికి రాజకుటుంబానికి సన్నిహితుడూ అయిన వ్యాపారస్తుడు నరేంద్రవర్మ! అతని ద్వారా ప్రగూనంకి వార్తపంపించింది

రాకుమారి. ఆ విషయం మిత్రురాలనైన నాకూ తెలియజేసింది.

విప్లవ నాయకుడూ, నకిలీ రాజూ, నరేంద్రవర్మని మాయం చేశాడు; అతని కుటుంబాన్ని వీధులపాలు చేశాడు. పైగా నరేంద్రవర్మ విప్లవసంఘానికి నాయకుడని ప్రచారం చేశాడు. అలా ప్రగూసం గూఢచారిలో అసలు ప్రభువుకోసం పరిశోధనకు దిగాడు నేను అలక్‌నందాదేవి రాకుమారికి మిత్రురాలనని తెలిసి తప్పనిసరి అయితేనే నన్ను పరిశోధనకు దిగమని, అంతవరకూ బయట పడవద్దని హెచ్చరించాడు అందువల్లనే నేను అన్నీ తెలిసినా అలక్‌నందాదేవికి వచ్చే ప్రయత్నం చేయలేదు...." అని వివరించి చెప్పింది అపురూప.

"ఏమయినా నువ్వు మాతో రావటం కొంచెం సాహసం చేసినట్లే!"

"నీకోసం ఏమయినా చేస్తాను ధీరా! నీ గురించి కథలు కథలుగా విని నీపై మనసు నిలుపుకున్నాను. నిన్ను చూడాలని కలలు కన్నాను. చివరికి యిలా నా కోరిక తీరింది. నీవు పక్కనుండగా ప్రాణం పోయినా ఫరవాలే...." అంటూ చేతిలోవున్న దంపని క్రిందకు విసిరి నిశీధుడి మీద వాలింది అపురూప.

"మనం మేలుకుని వుండాలి .... మైమరచిపోతే ఇద్దర్నీ చెట్లెక్కడం నేర్చిన అడవి జంతువులు స్వాహా చేస్తాయి" నవ్వుతూ వారించాడు నిశీధుడు.

○ ○ ○



"అమ్మయ్యా! ఎలాంటి ప్రమాదమూ లేకుండా రాత్రంతా గడిచిపోయింది. ఇక బయల్దేరుదామా?" అడిగింది అపురూప.

మన గుర్రాలు సజీవంగా వున్నాయో, ఏ క్రూర జంతువులకైనా విందు భోజనంగా మారిపోయాయో?" నవ్వుతూ అంటూ చెట్టు దిగాడు గంగన్న.

మిగిలిన పళ్ళు, దుంపలు మూటగట్టింది అపురూప. ముగ్గురూ చెట్టుక్రింద నిలబడ్డారు. గుర్రాలను పిలుస్తూ ఈలవేశాడు గంగన్న.

నిమషం గడిచినా గుర్రాలు వెనక్కి తిరిగి రాలేదు. ఒక రోజంతా మాలిమి అయిన అశ్వాలు అవి! మనుషులకు అలవాటు పడినవి. దూరంగా పోవటం జరగదు. పిలిస్తే వెనక్కి రాకపోవటమూ వుండదు. అలాంటి అశ్వాలు వెనక్కి రాలేదూ అంటే అవి ఏవో ప్రమాదానికి గురి అయి వుండాలి!

"లాభంలేదు గంగా! మనకు పాదయాత్ర తప్పదు!" నవ్వుతూ అన్నాడు నిశీధుడు

"నాకేం ఫరవాలేదు, ధీరా! కాని ఈ సుకుమారి ఏం నడవగలదా అని నా విచారం!" జాలిగా చూశాడు గంగన్న.

తీవ్రంగా అతనివైపు చూసింది అపురూప. "నా గురించి ఎవరూ బాధపడి, దిగులుపడి, కృంగి కృశించిపో నవసరం లేదు...." అంది కోపంగా.

"నిజమే ధీరా! నర్తకి కదా? నృత్యం చేసి చేసి ఆమె పాదాలు మనకంటే మొద్దుబారి వుంటాయి. రాత్రి చూశాను

కదా, ఆ ఆటవికుడో, నరమాంస భక్షకుడినో ఒక్కతన్ని తంతే చావుకేకపెట్టి పడిపోయాడు...." నవ్వుతూ చెప్పాడు గంగన్న.

"ఔనా!" అన్నట్లు చూశాడు నిశీధుడు. నవ్వి వూరుకుంది అపురూప.

కను చివరలనుంచీ నిశీధుడ్ని చూసింది అతని చూపులు తనమీద లేవని గ్రహించి చిన్నగా నిట్టూర్చింది.

రమణీయమైన ప్రకృతి. మనోహరమైన వాతావరణం. కోరి తామిద్దరికీ ఏకాంతం కలిగిస్తూ దూరంగా వెళ్ళాడు గంగన్న.

కోరి వచ్చిన కాంత చెంతనుంచి సరసమాడుదామనో, జలకాలాడుదామనో వుండదేం మొరటు మనిషికి?

అతని చెయ్యి పట్టుకుంటూ ధీరా...." అని పిలిచింది నెమ్మదిగా.

ఆమె చెయ్యి విదిలించుకుని ఒక్క అంగలో ముందుకు పోయాడు నిశీధుడు. మోకరించి కూర్చుని యిసుకలో నుంచీ ఏదో తీశాడు.

చిన్నబుచ్చుకున్న మొహంతో కోపంగా ఏదో అనబోయింది అపురూప. అతను వాగుపట్టునున్న యిసుకలో నుంచీ ఏదో తీయటంతో ఆగిపోయి అతని ప్రక్కకి వచ్చింది.

నిశీధుని చేతిలో తళతళ మెరుస్తోంది ఒక బంగారు ఉంగరం; ఆ ఉంగరంలోని వజ్రం.

"అపురూపా? ఇది శ్రీశర్మది....అంటే శ్రీ ఈ అడవిలోకి వచ్చాడు - ఎందుకోసమైనా గాని! ఎక్కడికి వెళ్ళాడో



ఎవరిని కలుసుకున్నాడో తెలుసుకోవాలి!" సాలోచనగా అన్నాడు నిశీధుడు.

"ఇంతదూరం వచ్చాక శ్రీశర్మ గురించి తెలుసుకోకుండా వుంటామా ధీరా! నువ్వు చెప్పిన దాన్నిబట్టి, అతను చిన్నవాడైనా సాహసీ తెలివిగలవాడని అర్థమౌతోంది. అలాంటి వాడు చూస్తూ చూస్తూ ప్రమాదంలో చిక్కుకుంటాడా? కాకపోతే ఎవరికో చిక్కి బంధించబడి వుంటాడు!" అంది అపురూప అతని భుజం మీద చెయ్యివేస్తూ.

తల పంకించాడు నిశీధుడు "నీవు వెళ్ళి స్నానం చేసిరా, అపురూపా! నేనిక్కడే వుంటాను...." అంటూ వాగు వద్దునే వున్న ఒక చెట్టుకి ఆనుకుని కూర్చున్నాడు.

అక్కడ కూర్చుంటే వాగులో స్నానంచేసే తనూ అతనికి కనిపించదు అతని అభిప్రాయం అర్థం అయేక అంతుబట్టని నీరసం ఏర్పడింది ఆమెలో. అయినా మౌనంగా ఒక పొదచాటుకు నడిచి. దుస్తులు విప్పి. వెనక్కి తిరిగి చూసింది.

నిశీధుడిలో కదలిక లేదు. తపస్సమాధిలో మునిగిన మౌనిలా కూర్చుని వున్నాడతను. 'జడపదార్థం' అనుకుంటూ వాగులోకి దూకింది అపురూప.

పేరుకు వాగుకాని నదిలా ఉధృతంగా ప్రవహిస్తున్నది నీరు. ఆ ప్రవాహాన్ని చూచి భయపడలేదామె జంటగా జలకాలాడుదా మనుకుంది.... ఆపాటి సరసం తెలియదే ఆ పెద్ద మనిషికి.

నీటిలో ఈదుతూ ఆలోచిస్తో, నిశీధుడు కూర్చున్న

చెట్టువైపు చూస్తోంది అపురూప. వెనకే అనుసరించి వస్తున్న ప్రమాదాన్ని గమనించలేదామె.

నిశ్శబ్దంగా నీటిలో ఈదుకుంటూ వస్తోందో మకరి. వెనకపాటుగా వచ్చి గుటుక్కున అందుకుంది అపురూప పాదాన్ని.

కెవ్వున అరిచింది అపురూప. కాలు వెనక్కి లాగుకునే ప్రయత్నం చేసింది. నెరవేరలేదు ఆమె ప్రయత్నం.

అపురూప ఆర్తనాదం వింటూనే కదలబోయాడు నిశీధుడు. బరువుగా అతని గుండెలమీద తగిలిందో పాదం.

ఎగిరి వెనక్కి పడుతూ చూశాడు నిశీధుడు.

మనిషికంటే ఎత్తుగా, లావుగా, భయంకరంగా ఒంటి నిండా రోమాలతో నిలబడి వుందో ఆకారం.

మర్రి కొమ్మల్లా వున్నాయి చేతులు. ఆ చేతులతో రొమ్ము బాదుకుంటూ భీకరంగా గర్జించింది ఆ ఆకారం.

ఆ ఆకారాన్ని చూస్తూనే గ్రహించాడు నిశీధుడు.

అడవి మనిషి!

నడుముకి వున్న కత్తి సర్రున లాగి ఎగిరి ఆ ఆకారం మీదకు దూకాడు నిశీధుడు. వికృతంగా అరుస్తూ నిశీధుణ్ణి గాలిలోనే పట్టుకుని ఎత్తి నేలకు విసిరాడు ఆ అడవిమనిషి.

ఆ అదురుకు కత్తి ఎగిరి ఎక్కడో పడింది. నడుము కలుక్కుమంది. వెంటనే కదలలేక పోయాడు నిశీధుడు.

మర్రి మొదళ్ళల్లా వున్న పాదాలు ఎత్తి ఎత్తి వేస్తూ నిశీధుణ్ణి సమీపిస్తున్నాడు అడవి మనిషి. అంతలో మరోసారి వినిపించింది అపురూప ఆర్తనాదం.

# 7

అహ్హాహ్హా! ఏమంటున్నది ఎర్ర చీమ? వికటంగా నవ్వుతూ అడిగాడు ఆ వ్యక్తి.

కదలనని మొరాయిస్తున్న మెడ నరాలని అతి కష్టం మీద కదిలించి తల తిప్పి చూశాడు శ్రీశర్మ తలక్రిందులుగా వ్రేలాడ కట్టిలేదతను.

క్రింద మంటలూ లేవు; పైన తన పాదాలని కాటు వేయడానికి కాచుకున్న సర్పాలూ లేవు! ఒక రాతి తిన్నె మీద పడివున్నాడు తను. కాళ్ళకి చేతులకు ఇనుప గొలుసులు వున్నాయి. ఎందుకని ఆ చిత్రహింసనుంచీ తనని తప్పించినట్లు?

శ్రీశర్మ ఆలోచన గ్రహించినట్లు నవ్వాడు ఆ వ్యక్తి.

"నీ మీద జాలితో కాదు శ్రీశర్మా! నిన్ను వెంటనే చంపటం నా అభిప్రాయం అయితే, ఆ పని ఎప్పుడో చేసేవాడిని.... కాని నిన్ను చిత్రహింసలు పెట్టి చంపటం నా అభిమతం! అందుకనే నిన్ను ఇలా బంధించి వుంచాను.

అంతే కాదు శ్రీశర్మా! నిన్ను వెదుక్కుంటూ నీ గురువు నిశీధుడు బయల్దేరాడట! అలక్ నందా రాజ్యంలో ప్రవేశించి తప్పించుకున్నాడుట అక్కడిదాకా వచ్చిన వాడు ఎప్పుడో ఒకప్పుడు ఇక్కడికీ రాకపోడు. వచ్చిన వాడిని నీ ప్రాణాలు పణంగా పెట్టి లొంగదీసుకుంటాను....!" అంటూ మరోసారి వికటంగా నవ్వాడు ఆ ముసుగు మనిషి.

అతని వైపు చూసి మౌనంగా వుండిపోయాడు శ్రీశర్మ.

గాయాల బాధ అతన్ని మరి త బాధిస్తూనే వున్నా దాని గురించి పట్టించుకునే స్థితిలో లేదతని మనసు.

నిశీధుడు బయల్దేరి వచ్చాడూ అంటే తన కోసమే అయివుండాలి! అతను యిక్కడికి రావాలేగానీ ఈ ముసుగు మనిషి వ్యవహారం తేల్చేయటం ఎంతసేపు?

శ్రీశర్మ ఆలోచన ఏమిటో ముసుగు మనిషికి అంతు బట్టినట్లు లేదు. "ఏం శ్రీశర్మా! అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు...." అని పరిహాసంగా అడిగాడు.

"నన్ను పణంగా పెట్టి నిశీధుడ్ని పట్టుకోవాలనుకునే నీ మూర్ఖత్వాని గురించి ఆలోచిస్తూన్నాను...." చిన్నగా అన్నాడు శ్రీశర్మ.

కోపంతో ఎర్రబడినాయ ముసుగు వ్యక్తి నేత్రాలు. "ఏం మీ నిశీధుడు అంతటి అజేయుడా? ఎవరికీ దొరకని, తల వంచని వీరుడా?" అడిగాడు కోపంగా చూస్తూ.

"ఏమో! నేను చెప్పటం దేనికి? త్వరలోనే నీవూ చూస్తావు.... చేసుకోవల్సిన ఏర్పాట్లు చేసుకో... ఇప్పుడే!" అంటూ తల తిప్పుకున్నాడు శ్రీశర్మ.

పళ్ళు పటపట కొరికి ఆ గదిలోనుంచీ బయటకు వచ్చాడు ముసుగు వ్యక్తి. గది తలుపులు మూయమని, జాగ్రత్తగా కాపలా కాయమని హెచ్చరించాడు. ఆ తరువాత మెట్లెక్కి ఆ భూగృహంనుంచీ పైకి వచ్చాడు.

విశాలంగా వున్న నడవాలో పది గజాలకు యిద్దరు వంతున నిలబడి వున్నాడు అతని అనుచరులు

ముసుగు మనిషిని చూడగానే వారందరూ అభివాదాలు చేశారు. తల వూపుతూ ముందుకు నడిచాడు. ఆ భవనానికి



ఎదురుగా వుందో పెద్ద భవనం. తిన్నగా ఆ భవనంలోకి పోయాడు ముసుగు మనిషి. ఒక పెద్ద గదిలోకి ప్రవేశించి బల్ల ముందు కూర్చున్నాడు. బల్ల ప్రక్కగా వున్నదో గంట.

బల్ల వెనుక ఆసనంలో కూర్చుంటూ ఠంగ్‌మని గంట మ్రోగించాడు ముసుగు వ్యక్తి. అర నిముషం కూడా గడవకుండానే లోపలకు వచ్చాడు ఒక దృఢకాయుడు.

"కోయల రాజ్యంలోని విశేషాలు తెలిసాయా?" అడిగాడు ముసుగు వ్యక్తి.

"తెలియలేదు, నాయకా!"

"జాగ్రత్తగా వుండండి! కోయలు ఒక్కరే లొంగకుండా, అప్పుడప్పుడూ మెరుపు దాడులు చేస్తూ, మనకి పక్కలో బల్లెంలా వున్నారు! కోయనాయకుడు పుళిందుడు సాటిలేని వీరుడు! అతన్ని ముఖాముఖి ఎదిరించి నిలబడటం కష్టం!" అన్నాడు ముసుగు మనిషి.

"ఔను నాయకా! ఆ పుళిందుడు వీరుడే కాదు; అసామాన్య వీరుడు....ఆవలించకుండానే ప్రేగులు లెక్కబెట్టే రకం!" అన్నాడు దృఢకాయుడు.

తల వూపాడు ముసుగు మనిషి. "పుళిందుడ్ని ఒక కంట కనిపెట్టి వుండండి. మన శత్రువు గూఢచారి నిశీధుడు అతనితో ఏకమయితే మరింత ప్రమాదం...." అంటూనే ఏదో ఆలోచన వచ్చినట్లు దృఢకాయుడ్ని దగ్గరకు పిలిచాడు.

దృఢకాయుడి చెవిలో చిన్నగా ఏదో చెప్పాడు ముసుగు మనిషి.

o o o

అపురూపని. నిశీధుడ్ని వదిలి వాగుకి ఇంకో ప్రక్కకి పోయాడు గంగన్న. చెట్లు దట్టంగా వున్నాయి ఆ ప్రాంతాలలో.

ఒకసారి పరిసరాలు పరికించి, శరీరం మీదవున్న దుస్తులను తీసి ప్రక్కన వుంచి లంగోటితో వాగులోకి దిగాడు గంగన్న.

దూకగానే నాలుగు మునకలు వేసి బారలువేస్తూ ఈద నారంభించాడు గంగన్న.

రెండు నిముషాలు కూడా గడవకముందే కెవ్వుమని వినిపించింది అపురూప ఆర్తనాదం!

వింటూనే క్షణకాలం ఈదటం మరచిపోయి నిలిచి పోయాడు గంగన్న.

అపురూప అలా అరిచిందంటే అందుకు కారణం ఏమిటయి వుంటుంది? ఆమె ప్రమాదంలో చిక్కుకుంది- అందుకు సందేహం లేదు.

నిశీధుడు పక్కన వుండగా అపురూపకు ప్రమాదమా? నిశీధుడి పైన మనసు పడింది అపురూప. ఆ సంగతి తనకు తెలుసు అందుకనే ఆ యిద్దర్నీ వదలి వచ్చాడు తను. నిశీధుడితో శృంగారంలో మునిగిపోయి, అల్లరికి అరిచిందేమో ఆ పిల్ల?

తను వెడితే రసాభంగమయి, పానకంలో పుడకలా వచ్చాడని తిట్టుకుంటుందేమో? ఆలోచిస్తూ అలాగే వుండి పోయాడు గంగన్న.

మరో నిమషం గడిచి పోయింది. మళ్ళీ వినిపించింది అపురూప ఆర్తనాదం,



సందేహం లేదు. అపురూప అల్లరికి అరవటం లేదు. నిజంగానే ఆమె ఆపదలో పడింది. రెండు బారలలో వాగు వడ్డుకు చేరుకున్నాడు గంగన్న.

గట్టున పొదలలో దాచిన దుస్తులను, కత్తిని అందుకుని నిశీధుడు, అపురూప వున్న వైపు పరుగు తీయాలని అతని ఆలోచన.

వాగు అంచునే కనిపించాయి అతనికి పెద్దపెద్ద పాదాలు. ఒకరూ యిద్దరూ కాదు వడ్డున వున్నది దాదాపు పది మంది.

ఆటవికులో, కోయలో తెలియలేదు గంగన్నకు. అందరి దగ్గరా ఆయుధాలున్నాయి. వాటిని ఝళిపిస్తూ గంగన్న వైపు చూసి వెకిలిగా నవ్వారు వాళ్ళు.

చేతిలోవున్న ఈటెను గంగన్న మొహంమీదకు తెచ్చి, మరింత వికృతంగా నవ్వాడు అందరికీ ముందున్న వాడు.

వడ్డుకి చేరాలి అంటే ఆ పదిమందితో పోరాడుతూ కూర్చోవాలి. దానివల్ల ప్రయోజనం లేకపోగా అపురూపా, నిశీధులు ఇద్దరూ మరింతగా ప్రమాదంలో చిక్కుకుంటారు.

తన మొహం మీదకు వచ్చిన ఈటెను బలంగా పట్టి లాగాడు గంగన్న. ఆ మనిషి గంగన్న అలా చేస్తాడని ఊహించలేదు కాబోలు. ఈటెను వదిలేయటమే కాక ముందుకు తూలాడు.

వాడి గురించి పట్టించుకోలేదు గంగన్న. ఈటె చేతిలోకి రాగానే దాన్ని అందుకుని తిరగేసి అందరి కాళ్ళమీదా కొట్టి తల్లక్రిందులుగా నీటిలోకి నెట్టి కొట్టాడు గంగన్న.

ఈటెతో సహా నీటిలోకి మునిగిపోయి పైకి తేలకుండా లోపలే ఈదుతూ ముందుకి వెళ్ళిపోయాడు గంగన్న.

ఈటె తిరగేసి గంగన్న కొట్టిన దెబ్బకు బాధగా అరు ముందుకు పడ్డారు ఆ పదిమంది.

చేతులలో వున్న ఆయుధాలు జారి నీళ్ళల్లో పోయాయి. లేచి తేరుకునేసరికి గంగన్న ఏమయిపోయా అంతు బట్టలేదు ఎవరికీ.

అయినా పట్టు వదలలేదు వారు. "నడవండి! ఎక్క అక్కడ వాగు తీరాన తేలక పోడు జిత్తులమారి!" అం ఒకరి నొకరు హెచ్చరించుకుని . అటు కొంతమంది. ఇ కొంతమంది పరుగు తీశారు ఆ పది మంది.

గంగన్న వారి కంటపడకుండా నీటి అడుగునే వేగం ఈదుతూ ముందుకు పోయాడు. దానికి తోడు ప్రవాహ వాలుకూడా అతనికి సహకరించింది.

మరో రెండు నిమషాలలో అపురూపవున్న ప్రాంతా చేరుకున్నాడు గంగన్న. అప్పటికే గొంతువరకు నీటిలో లాగబడింది అపురూప. ఆమె చుట్టూవున్న నీళ్ళనీ ఎర్ర వున్నాయి.

భయంతో స్పృహతప్పి పోతున్నట్లు వుందామె పరిస్థి ఆ భయంలోనే అరుస్తున్నదామె. మొసలిలాంటిదేదో ఆ పాదాలను పట్టి లోపలకు ఈడ్చుకు పోతున్నదని గ్రహి చాడు గంగన్న.

"అపురూపా! భయపడకు...." అని అరిచి నీటి మునిగాడు గంగన్న.

అపురూప పాదాన్ని పట్టి లోపలికి ఈడ్చుకు పోతు మొసలిని చూడగానే ఈటెతో బలం కొద్ది పొడిచా గంగన్న.



ఆ దెబ్బకు ఆమె పాదాన్ని వదిలి గిర్రున తిరిగింది మొసలి. నోరు తెరిచి గంగన్న మీదకు తిరగబడింది.

ఈటెను బలంకొద్దీ దాని నోటిలో గుచ్చాడు గంగన్న. ఒక్కసారిగా తలక్రిందులై పోయింది మొసలి. మరో పోటు పొడిచే అవకాశం లేకుండా దాని శరీరం నీళ్ళలోకి జారిపోయింది.

ఒక్క మునకవేసి నీళ్ళపై తేలింది అపురూప. నగ్నంగా వున్నాననే విషయం ఆ స్థితిలో కూడా మరచి పోలేదు ఆమె. తిరిగి కంఠంవరకు నీళ్ళలో మునిగిపోతూ "గంగన్నా! నీ మిత్రుని సంగతి చూడు...." అంది ఆందోళనగా.

ఈటెను వడ్డుకు విసిరి రెండు బారలువేసి తీరానికి చేరుకున్నాడు గంగన్న. ఈటెను అందుకుంటూనే ముందుకు పరుగు తీశాడు.

చెట్ల మధ్య అడవి మనిషితో భయంకరంగా పోరాడుతున్నాడు నిశీధుడు. రాక్షసాకారుడైన ఆ అడవి మనిషి బలముందు నిశీధుడి పోరాట పటిమ. వేగం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి

ఎగిరి ఎగిరి ఆ అడవి మనిషిపై దాడి చేస్తున్నాడు నిశీధుడు. అతనికి కత్తి అందుకునే అవకాశం లేకుండా విసిరి కొడుతున్నాడు అడవిమనిషి.

ఎలాంటి శత్రువునైనా నిర్భయంగా ఎదుర్కొనే నిశీధుడు సునాయాసంగా అలసిపోతున్నాడు అడవి మనిషి చేతిలో. అది గమనించి క్షణకాలం నిలిచిపోయాడు గంగన్న.

ముఖాముఖి అడవిమనిషిని ఎదిరించి ప్రయోజనంలేదని గ్రహించాడు గంగన్న. వెనకగా వెళ్ళి రివ్వున పరుగెత్తుకుంటూ ఈటెను గురిచేసి ముందుకు వచ్చాడు.

"తప్పుకో ధీరా!" అని బిగ్గరగా అరిచాడు. ఆ అరుపుకి గిరుక్కున తిరిగాడు అడవి మనిషి.

సుడిగాలిలా దూసుకు వచ్చేశాడు గంగన్న. అతని చేతిలోని ఈటె బలంగా దూసుకు పోయింది అడవి మనిషి కంఠంలోకి

వికృతం అరుస్తూ, వెనక్కి తూలిపోతున్నాడు అడవి మనిషి. ఎర్రటి రక్తం సుడులు తిరుగుతూ వెలువడుతోంది అతని కంఠంలోనుంచీ.

"సమయానికి వచ్చావు, గంగన్నా!" అంటూ ఉషారు పుంజుకుని క్రిందవున్న కత్తి అందుకుని బలంకొద్దీ అడవి మనిషి వీపులో పొడిచాడు నిశీధుడు.

మరింత వికృతంగా అడవి దద్దరిల్లేలా అరిచాడు అడవి మనిషి

క్రోధంతో నేలను తంతూ గొంతులోనుంచీ ఈటెను పెరికి ఎదురుగా వున్న గంగన్న మీదకు విసిరాడు.

ప్రక్కకు తప్పుకుని ఆ ఈటెను అందుకుని మళ్ళీ విసిరాడు గంగన్న.

ఆ ఈటె ఈసారి అడవి మనిషి ఛాతిలో దిగబడింది. రక్తం ధారలుగా చిమ్ముతూండగా బోర్లగిలా పడిపోయాడు అడవి మనిషి.

కాళ్ళు చేతులు కొట్టుకుంటూ వికృతంగా అరుస్తున్నాడు.



"జాగ్రత్త గంగా!" అంటూ వాగుపైకి పరుగు తీశాడు నిశీధుడు. అప్పటికి తీరానికి చేరి బోర్లా పడుకుని వున్నది అపురూ. ముత్యాలు అందినట్లు తళతళా మెరుస్తోంది ఆమె బంగారు రంగు దేహం.

అపురూపమైన ఆమె సోయగాలు, వంపులు వన్నెలు తిలకించే దృష్టిలో లేడు నిశీధుడు. తిన్నగా పొదదగ్గరకు పోయి అపురూప వలువలు తీసుకువచ్చి ఆమె మీద పడేసి "కట్టుకో" అంటూనే మళ్ళీ చెట్లలోకి పరుగు తీశాడు నిశీధుడు.

అడవి మనిషి కొనవూపిరితో గిజగిజలాడుతున్నాడు. వాడి అరుపులు, కేకలు భరించలేక, కత్తిలాగి మరోసారి వాడి గుండెల్లో పొడిచాడు గంగన్న.

అంతటితో అంతరించి పోయింది వాడి శరీరంలో చలనం. అపురూపా, నిశీధులకోసం వెనక్కి తిరిగాడు గంగన్న.

అప్పటికి ఎలాగోలా దుస్తులు ధరించి యిసుకలో కూర్చుని వుంది అపురూప. ఆకుపసరులు ఏవో తీసి ఆమె వేలిమీద పోస్తున్నాడు నిశీధుడు.

మొసలి పట్టువల్ల గాయపడింది అపురూప. బాధను బిగబట్టుకున్నట్లుంది ఆమె మొహం చూస్తే

"ఆడవాళ్ళు గూఢచారిణులైతే వచ్చే సమస్య యిదే!" అన్నాడు గంగన్న చిన్నగా.

అది వినసే వి.ది అపురూప. కొరకొర చూచింది గంగన్న వైపు. "చూడు సోదరా! నీ మిత్రుండో జడపదార్థం! కాకపోతే నాకీ ఆపద వచ్చేది కాదూ: నీవు వచ్చి

రక్షించాల్సిన అవసమూ వుండేది కాదు" అంది తీవ్రంగా.

నవ్వుతూ ఆమెవైపు చూశాడు నిశీధుడు. "నీ సోదరికి తనతోబాటూ నేనూ బలకాలాడలేదని కోపం" అన్నాడు.

"మరీ అంత విడమరచి చెప్పాల్సిన అవసరం లేదు.. ఇక పోదామా!" అడిగింది అపురూప.

"నడవగలవా?" అడిగాడు నిశీధుడు

"లేకపోతే ఎత్తుకుంటావా?" అడిగింది అపురూప నవ్వుతూ

"మీరిద్దరూ ఇలా వాదులాడుకుంటూ వుంటే మన కోయ మిత్రులో, నరమాంస ప్రియులైన మన హితులో వచ్చేస్తారు...." అని హెచ్చరించాడు గంగన్న అటూ యిటూ చూస్తూ.

"ఏం? ఏకెక్కడైనా వాళ్ళు తటస్థపడ్డారా?" నవ్వుతూ అడిగాడు నిశీధుడు.

తల వూపి, జరిగింది క్లుప్తంగా చెప్పాడు గంగన్న. విని సాలోచనగా తల పంకించాడు నిశీధుడు. "సరే! పోదాం మనం...." అంటూ అపురూపకు చెయ్యి అందించాడు.

మొసలినోట చిక్కి కాలు బాగా నలిగిపోయింది. పళ్ళు దిగి రక్తం కూడా బాగానే స్రవించి పోయింది నిశీధుడి వైద్యం కొంత పనిచేసినా కాలు పూర్తిగా నేలకి ఆన్చి నడవలేక పోతోంది ఆమె.

"ఇంక తప్పేది ఏముంది ధీరా? ఎత్తుకో..నేను ముందు నడుస్తాలే" అంటూ నాలుగడుగులు ముందుకు వేశాడు గంగన్న.



"అంత అవసరం లేదు...." అంటూ నిశీధుడి భుజం మీద చెయ్యివేసి ఆసరాగా నడవటం ప్రారంభించింది నర్తకి అపురూప.

పది అడుగులు కూడా వేయలేదు ఆ ముగ్గురూ.

వికృతంగా అరుస్తూ గుర్రాలమీద వారిని చుట్టు ముట్టారు పది మంది. అందరిదగ్గరా కత్తులున్నాయి.

చూడటానికి వారి వేషాలు అటవికుల మాదిరిగా వున్నా, వాళ్ళు ఆటవికులు కాదని గ్రహించాడు నిశీధుడు.

గుర్రాలను వలయాకారంగా తిప్పుతూ, హేళనగా నవ్వుతున్నాడు ఆ పదిమందీ.

"ధీరా! వీళ్ళే యింత క్రితం నాపై దాడిచేసింది.... చూస్తావేం ...విజృంభించు...." అంటూ ఎగిరి ఒకడి మీదకు దూకాడు గంగన్న.

"అపురూపా! జాగ్రత్త!!" అంటూ ఆమెను క్రిందికు జారవిడిచి, తొడ చరిచీ గాలిలోకి ఎగిరాడు నిశీధుడు.

గాలిలోనే పల్టీకొట్టి కాలితో ఒకడి మెడమీద తన్నాడు. ఫట్ మంటూ పొడుచుకు వచ్చింది వాడి మెడ ఎముక.

గుర్రం మీదనుంచీ చిన్నగా మూలుగుతూ జారి పోయాడు వాడు.

అదే వేగంతో మరొకడి గుండెలమీద తన్నాడు నిశీధుడు. నాలుగు మణుగుల బరువున్న బండరాయి ఏదో మీదపడినట్లు కెవ్వున అరిచాడు వాడు. వాడి పెదాల చాటు నుంచీ క్రిందకు జారింది చారెడు రక్తం.

మంచు ముద్దలా క్రిందకు జారిపోయాడు వాడు. నేలకి

వాలుతూనే ఒక గుర్రాన్ని చేజిక్కించుకున్నాడు నిశీధు
కత్తి దూసి మిగిలిన వారిమీద విరుచుకుపడ్డాడు.

గుర్రం మీదనుంచీ ఒకడ్ని పడగొట్టి ఆ గుర్ర
ఎక్కాడు గంగన్న. మిత్రులిద్దరూ ఏకమై వూచకో
కోయటం ప్రారంభించారు.

క్రింద వున్న అపురూప ఊరికే కూర్చోలేదు. ఇద్ద
దృఢకాయుల శవాల నడుమకు వున్న కత్తులు లా
గుర్రాలమీద తనని సమీపించబోయే మరో యిద్దరి మీద
విసిరింది

అపురూప నుంచీ అటువంటి ప్రతిఘటన ఊహిం
లేదు వారు. ఫలితం అనుభవించవల్సి వచ్చింది.

కత్తులు రెండూ యిద్దరి గుండెలలోనుంచీ దూసు
పోయాయి. దారుణంగా ఆర్తనాదాలు చేస్తూ వెనక్కి
పోయారు వారు.

ఆ గుర్రాలు రెండూ ముంగాళ్ళమీద లేచి గట్టిగా సకి
చాయి దాంతో వారి శవాలు పూర్తిగా నేలమీదకు జారా
మరో గుర్రాన్ని పట్టుకుని అతి కష్టంమీద దానిమీ
ఎక్కి కూర్చుంది అపురూప.

అప్పటికి మిత్రులిద్దరి ధాటికి మిగిలిన అటవిక వేష
లోని శత్రువులందరూ అంతంకాక తప్పలేదు.

"గంగా! వీరందరూ నిస్సందేహంగా మన శత్రువు
అటవికులూ కోయలూ కాదు....." క్రింద పడివున్న
లను పరీక్షగా చూస్తూ అన్నాడు నిశీధుడు.

"ఔను ధీరా! నల్లకొండలలో మన శత్రువులున్నా
దానికి నిదర్శనం ఈ నకిలీ అటవికులు!" అన్నాడు గంగ



"ఇంకా మనం ఇక్కడే ఆలస్యం చేయటం దేనికి?" అడిగింది అపురూప.

సమాధానంగా మిత్రులిద్దరూ గుర్రాలను ముందుకు ఉరికించారు. వారి ననుసరించి తనూ తన అశ్వాన్ని అదిలించింది నర్తకి అపురూప.

మూడు గుర్రాలూ పరుగెత్తుతున్నాయి. ఆ పరిసరాలను దాటి వెళ్ళిపోయిన నిముషం తరువాత అక్కడికి చేరుకుందో చిన్నది.

ఆమె శ్రీశర్మను తోడుగా తీసుకుని కోయగూడెం పోయిన సుందరి.

క్రింద పడివున్న నకిలీ కోయలను పరీక్షగా చూస్తూ, కొన్ని క్షణాలు నిలబడింది ఆమె! ఆ తరువాత చెట్ల మధ్యగా పరుగులు తీస్తూ వెళ్ళిపోయింది.

## 8

అందగాడుట ఆ నిశీధుడు ........ చూడటానికి నలుపే అయినా చూసిన వారిని యిట్టే ఆకర్షించుకుంటాడుట.... అలాంటి అందగాడుట. ఒక్క అందమేనా? సాహసం. తెలివి....దీనికదేనట....అందగాడు కదా అన్న అహమూ లేదట....అలాగని కిందపడిన ఆడదాన్ని వేటాడే గుణమూ లేదుట...." అని వివరంగా చెపుతోంది ఒక కోయ పడుచు.

చెక్కిట చెయ్యిచేర్చి, ఏదో చూస్తున్న నేత్రాలతో వింటోంది ఆ సుందరి. దారెడేసి కనులలో సంభ్రమమూ, అలౌకికమైన తన్మయత్వమూ వున్నాయి.

"వింటున్నావా?" అడిగింది నిశీధుడి గురించి చెప్తున్న పడుచు.

తల వూపింది ఆ సుందరి. ఈ వివరాలన్నీ నీకెలా తెలుసే!" అని అడిగింది నవ్వుతూ.

"మీ అన్న-మన కోయ నాయకుడు పుళిందుడు గూడెం పెద్దలతో చెపుతూండగా విన్నాను.... అదేమిటే వింటూనే అలా అయిపోయావు? రేపు కళ్ళారా చూస్తే అసలు నిన్ను నువ్వే మరచిపోయేట్లున్నావే!" అని నవ్వింది ఆ పడుచు.

"పోతే నువ్వు మరీనూ అందాన్ని ఎవరు మెచ్చుకోరు! అందమూ శౌర్యమూ ఒక చోట చేరిన ఆ నిశీధుడ్ని చూడాలని నాకేకాదు; మన గూడెం వారందరికీ లేదా?" చిరు కోపంతో అడిగింది ఆ సుందరి.

"వుంటే మాత్రం ఏమి ప్రయోజనం? మేము సాధారణ స్త్రీలం; నీవో కోయగూడెం నాయకుడికి సోదరివి! నిశీధుడు ఇక్కడికి వచ్చినా మీ యింటనే వుంటాడు. కనులారా చూడటమే కాదు. అతనికీ నీకూ యిష్టమైతే తనివారా...."

"ఛత్! నోర్మూసుకోవే! అంత అదృష్టమా నాకు?" చిన్నగా నిట్టూరుస్తూ అడిగింది ఆ సుందరి.

"ఏమో? ఆ అదృష్టం వరిస్తే నిన్నే వరించాలి........ మాకే భాగ్యం ఎలాగూ వుండదు...."

అంతలోనే బయటినుంచీ వినిపించిందో పిలుపు "అత్తా-... అత్తా...." అంటూ.

పిలుపుతోబాటే లోపలకువచ్చిందో పదిహేనేళ్ళ యువతి ఆమెను చూడగానే నవ్వింది సుందరి.



"ఏం నందా? అంత ఆయాసపడుతూ పరుగునవచ్చావు? ఏమిటి విశేషం?" అని అడిగింది.

"అత్తా! నిశీధుడనే గూఢచారి మన గూడేనికి రావచ్చునని అయ్య చెపుతూనే వున్నాడు. విన్నావా?" అడిగింది నంద.

"విన్నాను. అందులో వింత ఏముంది! ఎందరో అన్న కోసం వస్తూంటారు పోతూంటారు...."

మోచేత్తో సుందరిని పొడిచింది పడుచు. ఆమెపైపు కనుబొమ్మలెగరేసి... కనుల్రెరచేసి చూసింది సుందరి.

"అత్తా! ఆ నిశీధుడ్ని చూశాను. పదిమందిని అతనూ, అతని మిత్రుడూ ఎదుర్కొన్నారు. ఒక్క వేటుకి ఒక్క తల! కాలితో తంతే రక్తం కక్కుకుని చచ్చాడొకడు.... గుర్రాలెక్కి వెళ్ళిపోయారు?" అని వివరించింది నంద.

ఎంత అణచిపెట్టినా ఆగలేదు సుందరి మదిలోని ఆరాటం. "నువ్వు చూశావా నందా? ఆ నిశీధుడు ఎలా వున్నారు?" అని అడగకుండా వుండలేక పోయింది.

"ఆఁ చూశాను...."

"ఎలా వుంటాడు?" పొంగి వచ్చే నవ్వు నాపుకుంటూ అడిగి సుందరికి దూరంగా జరిగింది కోయపడుచు.

"నల్లగా నిగనిగలాడుతూ బలంగా లావుగాపొడుగ్గా.... బాబోయ్.... అతను శత్రువుమీదకు దూకుతుంటే ఆ కనులలో కోపం ... పులీ, సింహం కూడా అంత క్రౌర్యంగా చూడవు...." వర్ణించబోతోంది కోయ యువరాణి నంద.

"యువరాణీ! మీరు నిశీధుడ్ని వర్ణించాల్సిన తీరు అది కాదమ్మా!"

నంద కోయ పడుచువైపు తిరిగింది. "మరి ఎలా?" అని ప్రశ్నించింది.

"ఆ విషయం మీ అత్త ఆనందను అడుగు...." కిసుక్కున నవ్వి మరింత దూరంగా జరిగింది కోయపడుచు.

"అదేమిటి అత్త అసలు ఆ నిశీధుడ్ని చూడనేలేదుగా!" ఆశ్చర్యంగా అడిగింది నంద.

"చూడాలిటమ్మా! మనసులో చిత్రించుకున్న రూపం.. చెరిగిపొమ్మన్నా పోదు. పదే పదే కనులముందు కదలాడుతూనే వుంటుంది...."

"అంటే...." అర్థం కానట్లు అడిగింది నంద.

"అంటే...." అంటూ ఏదో వివరించ బోయింది కోయ పడుచు.

"ఇదిగో, చమ్కీ....పిచ్చివాగుడు కట్టిపెడతావా లేదా? పసిపిల్ల....దానితో ఏమిటి వాగుడు...." కోపంగా చూసింది ఆనంద.

"పసిపిల్లా! ఇంకా నయం. ఆ శ్రీశర్మ ఇక్కడే వున్నట్లయితే ఈ పాటికి నలుగురు పిల్లల్ని కూడా కనేది" నవ్వింది చమ్కీ.

"నిజమా? నాకీ విషయం తెలియదే!" ఆశ్చర్యంగా చూసింది ఆనంద.

చిన్నగా నవ్వి దూరంగా జరిగింది నంద.

"తప్పేముందమ్మా! మీరా శ్రీశర్మకు మనసిచ్చారు .. మీ అత్త ఆనంద నిశీధుడ్ని చూడకుండానే ఆరాధిస్తున్నారు అంతే! అత్తా కోడళ్ళు, ఆ గురుశిష్యుల గురించి ముచ్చ



టించుకుంటూ వుండండి! నేనుపోయి భోజనాలకు ఏర్పాట్లు చేస్తాను...." అంటూ వెళ్ళిపోయింది చమ్కీ.

"ఏం అత్తా! నిజమా?" నవ్వుతూ అడిగింది నంద.

సిగ్గుతో అరమూతలయే అరవింద నయనాలను పైకి ఎత్తలేక తల వూపింది ఆనంద. "నందా! అన్నతో చెప్పకు...." అంది చిన్నగా.

"ఏం చెపితే? అయ్య నీ మాట కాదంటాడా, అత్తా?" అమాయకంగా అడిగింది నంద.

"అన్న నామాట కాదంటాడనికాదు; అసలు ఆ నిశీధుడు ఏమంటాడో ఎలా వుంటాడో తెలియదు...." సాలోచనగా అంది ఆనంద.

నిశీధుడి వెంటవున్న అందగత్తె గురించి అత్తకు చెప్పాలో వద్దో అన్న సందిగ్ధంలో మునిగిపోయింది కోయ యువరాణి నంద.

నిశీధుడు కోయ గూడేనికి వస్తాడా? వచ్చినా తనని చూచి ప్రేమిస్తాడా? అనే ఆలోచనలో మునిగిపోయింది కోయ నాయకుడు పుళిందుని సోదరి ఆనంద.

# 9

"అపురూపా....అపురూపా...." అని బిగ్గరగా పిలిచాడు నిశీధుడు. అతనితోబాటే మరింత బిగ్గరగా పిలిచాడు గంగన్న.

జవాబులేదు అపురూపనుంచీ. ఏమైంది ఆమె'

నకిలీ కోయలనుంచీ గుర్రాలను చేజిక్కించుకుని, ఆ

పదిమందినీ నేలకూల్చి బయల్దేరారు ముగ్గురూ. సూర్యుడు నడిమింటకు చేరేసరికి విపరీతమైన దాహమూ, ఆకలి బాధించ నారంభించాయి మిత్రులిద్దరినీ. గుర్రాలను నిలువరించి చూశారు ఇద్దరూ.

అప్పటిదాకా కొంచెం ప్రక్కగానో, లేక బాట దుర్గమంగా వుంటే వెనుకగానో అనుసరించి వస్తూనే వుంది నర్తకి అపురూప.

ఉన్నట్లుండి అదృశ్యమై పోయింది ఆమె. ఏం జరిగింది? శత్రువు లెవరయినా వెనకపాటున ఆమెని అనుసరించి వచ్చారా?

"ఆలోచిస్తూ కూర్చుంటే అపురూప మరింత ప్రమాదంలో పడవచ్చు! వెనక్కి పోదాం పద, ధీరా!" అని హెచ్చరించాడు గంగన్న.

ఆందోళనాభరిత హృదయాన్ని చిక్కబట్టుకుంటూ అశ్వాన్ని వెనక్కి మళ్ళించి పరుగు తీయించాడు నిశీధుడు.

ఎక్కువ దూరం పోకుండానే కనిపించింది అపురూప.

గుర్రంమీద కాదు; నేలమీదకాదు. గాలిలో తేలుతోంది ఆమె శరీరం!

మెడకు తగులుకున్న ఉచ్చుతాడు కొస చెట్టు కొమ్మకు బిగించబడి వుంది. కొన ఊపిరితో గిజగిజలాడుతూ చేతులతో మెడకు బిగుసుకుంటున్న తాడుని పట్టుకుని వ్రేలాడుతోంది అపురూప.

"ధీరా! నేను కత్తి విసిరి తాడు తెగవేస్తాను. నువ్వు అపురూపను క్రింద పడకుండా పట్టుకో...." అని చెప్పి వరనుంచీ కత్తిలాగి, చెట్టుకొమ్మనుంచీ వ్రేలాడుతున్న



తాడు-అపురూప తలమీదుగా తెగిపోయేట్లు గురిచూసి విసరబోయాడు గంగన్న.

నెరవేరలేదు అతని ప్రయత్నం. ఖంగ్ మంటూ అతని చేతిలోని కత్తికి తగిలిందో బాణం.

ఎగిరి దూరంగా పడిపోయిందా కత్తి. చటుక్కున నేలకు వరిగిపోయారు మిత్రులిద్దరూ.

"ధీరా! జాగ్రత్త...." అంటూనే హెచ్చరించి నేలమీద దొర్లాడు గంగన్న. అతని అభిప్రాయం గ్రహించి తనూ వేగంగా నేలమీద దొర్లాడు నిశీధుడు. రివ్వు రివ్వుమంటూ దూసుకు వచ్చిన బాణాలు ఆ యిద్దరూ మొదట నిలబడిన చోట నేలలో దిగబడి పోయాయి.

వాటి గురించి ఆలోచించకుండా దట్టీలో వుంచిన ఛురిక అందుకుని పైకి విసిరాడు నిశీధుడు.

ఛురిక తగిలి తెగింది అపురూప మెడకు బిగుసుకుంటున్న ఉరితాడు చాపచుట్టలా గాలిలో దొర్లుకుంటూ వచ్చి క్రింద పడిపోతున్న అపురూపను చేతులతో అందుకుంటూ దారి ప్రక్కనే వున్న పొదలలోకి దొర్లి పోయాడు నిశీధుడు.

దుస్తుల చాటున దాచిన ఉండను తీసి నేలకు కొట్టి దొర్లుకుంటూ నిశీధుడ్ని అనుసరించాడు గంగన్న.

రివ్వు రివ్వున బాణాలు దూసుకు వస్తూనే వున్నాయి. గంగన్న నేలకు విసిరికొట్టిన ఉండ టపీమంటూ విచ్చుకుంది.

విచ్చుకున్న వెంటనే ఆవరించాయి దట్టమైన నల్లని పొగలు రెండు నిలువుల ఎత్తున లేచిన ఆ పొగలలో నిశీధుడికి, గంగన్నకూ గురిచూచి బాణాలు వదలటం సాధ్యం కాలేదు శత్రువులకు.

"చూడండి! వెదకండి! ఎటో పారిపోయి వుంటారు ఆ యిద్దరూ. పోతూ. పోతూ మనం బిగించిన ఆ అందగత్తెను కూడా విడిపించుకు పోయారు! వెదకండి.........దొరక్కపోతే బాణాలు ప్రయోగించి చంపండి!" అని హెచ్చరిస్తూ చెట్టు మీదనుంచీ క్రిందకు దూకాడో దృఢకాయుడు.

అతన్ని అనుసరించి క్రిందకు దూకారు మరో పదిమంది. అందరి దగ్గరా విల్లూ బాణాలూ వున్నాయి.

క్రిందకు దూకుతూనే వింటికి బాణాన్ని సంధించి సంసిద్ధులై పరుగు అందుకున్నారు వారందరూ.

"ధీరా! జాగ్రత్త! ఆపుతూప అసలే గాయపడి వుంది.. ఆమెకు బాణాలు తగలకుండా చూడాలి...." అంటూ మెలికలు తిరుగుతూ, పొదలను, చెట్లను చాటు చేసుకుంటూ పరుగు తీస్తున్న నిశీధుడ్ని అనుసరించాడు గంగన్న.

రివ్వు రివ్వుమని బాణాలు వెనకనుంచీ దూసుకు వస్తూనే వున్నాయి. కొన్ని చెట్లకు గుచ్చుకుంటున్నాయి. మరికొన్ని పొదలలో పడిపోతున్నాయి.

రొప్పుతూ ఒక వాగు తీరానికి చేరుకున్నారు మిత్రులిద్దరూ. తీరానవున్న పొదలో అపురూపను దించి ఆయాసం తీర్చుకుంటూ అటూ యిటూ చూశాడు నిశీధుడు.

వాగు వైపుకు వస్తున్నాయి ఆరు ఏనుగులు, వాటితో బాటు రెండు గున్నలు నాలుగు మగ ఏనుగలు.

వాటిని చూడగానే నిశీధుడి మనసులో ఒక ఆలోచన రూపు దిద్దుకుంది.



గంగన్నను నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించి రెండు చేతులూ నోటికి అడ్డం పెట్టుకుని సింహాల మంద ఒకేసారిగా గర్జిస్తున్నట్లు ధ్వని సృష్టించాడు.

అదిరిపోయింది ఏనుగుల గుంపు. తొండాలు ఎత్తి, చెవులు నిక్కబొడిచి ఘీంకరించాయి మగ ఏనుగులు, ఆడ ఏనుగులు. గున్నలు తల్లుల పాదాలచాటుకు చేరాయి.

మరోసారి అడవి దద్దరిల్లేలా వినిపించింది సింహాల గర్జన

గిరుక్కున తిరిగాయి ఏనుగులు. బాణాలు వేస్తూ నిశీధుడ్ని, గంగన్ననూ వెదుక్కుంటూ పరుగు పరుగున వస్తున్నారు దృఢకాయులు

వారి బాణాలలో కొన్ని ఏనుగుల మందమీద పడ్డాయి. అంతటితో అంతరించి పోయింది వాటి సహనం.

భీకరంగా ఘీంకరిస్తూ, తొండా లెత్తి, చెవులు చేటల్లా టపటప లాడిస్తూ ముందుకు పరుగు పరుగున వస్తున్నాయి.

వాటి వేగానికి అదిరి పోయారు దృఢకాయులు. చెట్లను చాటు చేసుకుని ఏనుగులమీదనే బాణాలు ప్రయోగించటం ప్రారంభించారు. వారు చేసిన పొరబాటు అదే!

ఏనుగంత సాధు జంతువు ఇంకోటిలేదు. తిక్క రేగితే, దాన్ని రెచ్చగొడితే దానంత క్రూరమైన జంతువూ లేదు.

అసలే సింహాల గర్జనలతో భయపడి అదిరిపోయి వున్నాయవి. జాతి శత్రువు సింహం! ఆ భయంతో వున్న ఏనుగుల మంద జోలికి పోవటమంత బుద్ధి తక్కువ ఇంకోటి లేదు.

మీదపడే బాణాలను లెక్కచేయకుండా, భూమి అదిరేలా

అడుగులు వేస్తూ పొదలను, చిన్న చిన్న చెట్లను విరగ
దొక్కుకుంటూ ముందుకు వచ్చేశాయి మగ ఏనుగులు.

తొండాలతో చెట్ల కొమ్మలను విరిచి అటూ యిటూ
తిప్పుతూ బాణాలు తగలకుండా జాగ్రత్త పడుతున్నాయి
ఆ మత్తకరీంద్రాలు.

అదిరి పోయారు దృఢకాయులు వాటి తెలివి చూచి
ఏనుగుల మందమీద బాణాలు ప్రయోగించి ప్రయోజనం
లేదని, పలాయన మంత్రం పఠించక తప్పదని అర్థమైంది
వారికి.

వెనక్కి తిరిగి పరుగుతీయ బోయారు ఆ దృఢకాయులు
నెరవేరలేదు వారి ప్రయత్నం.

తొండాలతో తిప్పుతున్న చెట్ల కొమ్మలను వారి ముందు
పడేలా విసిరాయి ఆ గజరాజులు.

పరుగు తీయబోయి చెట్లకొమ్మలు కాళ్ళకు తగుల్కొని
ఒకరి తరువాత ఒకరుగా బోర్లగిలా పడిపోయారు వారు.

లేచి క్రిందపడిన విల్లూ, బాణాల సంగతి పట్టించుకో
కుండా పరుగు తీయాలనుకున్నారు వారు.

వారికంటే వేగంగా చుట్టుముట్టింది ఆ ఏనుగుల మంద
కసి కసిగా మర్రి మొదళ్ళల్లా వున్న పాదాలు ఎత్తి
అందిన వాడిని అందినట్లే తొక్కటం ప్రారంభించాయి
ఆడ ఏనుగులు

కొండ చిలువలా వున్న తొండాలు చాచి ఒక్కొక్కడ్ని
పట్టి గిరగిరా తిప్పి నేలకినేసి బాదాయి మగ ఏనుగులు.

అది చూచి ఉషారుగా ఘీంకరించాయి గున్నలు.



ఐదు నిమిషాల తరువాత శాంతించింది ఆ ఏనుగుల
మంద. శత్రుసంహారం పూర్తిచేసి, విజయపతాకాలు ఎగ
రేస్తున్నట్లుగా తొండాలు ఎత్తి, విజయ దుంధుభులు
మోగిస్తున్నట్లుగా ఘీంకరిస్తూ ఎంత రౌద్రంగా వచ్చాయో,
అంత ప్రశాంతంగా వెనక్కి తిరిగిపోయింది ఆ గజరాజ
కుటుంబం.

# 10

అపురూపా! ఎలా వుంది? లేచి నడవగలవా?" నెమ్మదిగా
అడిగాడు నిశీధుడు,

ఏనుగుల మందను దృఢకాయుల గుంపుమీదకు మళ్ళిం
చిన వెంటనే వాగులోకిపోయి దట్టీని తడిపి తీసుకు
వచ్చాడు గంగన్న.

చుట్టు ప్రక్కల వెదకి ఏవో ఆకులు తెచ్చి, వాటిని
నలిపి ఆ రసాన్ని ఆమె ముక్కులలో పిండాడు నిశీధుడు.
దట్టీ తడిపి తెచ్చిన నీటితో ఆమె మొహాన్ని తుడిచాడు
గంగన్న. అప్పుడు కనులు తెరిచింది అపురూప. రెండు
సార్లు తుమ్మి లేచి కూర్చుంది.

నిశీధుడు అడిగిన ప్రశ్నకు చిన్నగా నవ్వి తల వూపింది.
"అకస్మాత్తుగా పై నుంచి నా మెడలో పడింది. ఆ ఉరితాడు
గొంతెత్తి మిమ్మల్ని పిలిచే అవకాశం లేకుండా ఆ ఉరి
తాడు నన్ను పైకి లాగేసింది. ఆ తరువాత ఏం జరిగిందో
నాకు తెలియదు చేతులతో ఆ తాడు పట్టుకున్నాను.
అంతే!" అని అడగకుండానే వివరించింది అపురూప.

ఇంక గుర్రాలకోసం ప్రయత్నించి లాభంలేదు. వాటిని వదలి చాలా దూరం వచ్చేసారు కూడా. కాలి నడకనే బయల్దేరక తప్పదు

ముగ్గురూ తిరిగి నెమ్మదిగా నడక ప్రారంభించారు.

"మెరుపు దాడులు చేయటంలో మన శత్రువులు అఖండులు ధీరా! ముఖాముఖీ పోరాటానికి వాళ్ళు సంసిద్ధులు కారు...." అన్నాడు గంగన్న.

తల పూపాడు నిశీధుడు. "మనం కోయనాయకుడు పుళిందుడ్ని కలుసుకునేంతవరకు జాగ్రత్తగా వుండాలి.... లేకపోతే...." అంటూ చటుక్కున ఆగిపోయాడు.

మాట్లాడుతూ అతను మధ్యలో ఎందుకు ఆగిపోయాడో అంతుబట్టలేదు గంగన్నకు అపురూపతోబాటు అతనూ, నిశీధుడు ఎటు చూస్తున్నాడో అటువైపు దృష్టి మళ్ళించాడు.

దారికి అడ్డంగా కూర్చుని తీక్షణంగా చూస్తూ, తోకని నేలకేసి బాదుతూ వున్నదో మృగరాజు.

జలదరించింది అపురూప సుకుమార శరీరం. అవసరమైతే దొంతనాలు చేస్తూ రాటుతేలిన గుండెతో, నిశీధుడితో చేరి కర్కోటకంగా హత్యలు చేసిన గంగన్న కూడా ఆ మృగరాజు కనులలోకి చూడలేక కంగారుపడి పోయాడు.

వరలోవున్న కత్తి తీయబోయాడు నిశీధుడు. మిగిలిన యిద్దరికంటే రెండు అడుగుల ముందున్నాడతను.

కత్తి తీయకముందే తోకను నేలకేసి బాది, పరిసరాలు ప్రతిధ్వనించేలా గర్జించి కుప్పించి అతనిమీదకు లంఘించింది ఆ మృగరాజు,



అపురూపను, గంగన్ననూ చెరొక ప్రక్కకూ మోచేతులతో నెట్టివేస్తూ వెల్లకిలా పడిపోయాడు నిశీధుడు.

కత్తి వరలోనుంచీ లాగే అవకాశం లేకపోయినా రెండు చేతులతో సింహాన్ని పట్టుకున్నాడు నిశీధుడు.

దాని ముందు రెండు కాళ్ళూ అతని చేతులలో చిక్కుకుపోయాయి. భయంకరంగా గర్జిస్తూ కోరలు చాచి నిశీధుడి కంఠాన్ని అందుకోబోయింది ఆ సింహం.

దాని నోటినుంచీ వెలువడుతున్న దుర్వాసన, చెవులు చిల్లులుపడే గర్జన నిశీధుడ్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

బలమంతా మోకాళ్ళల్లోకి తెచ్చుకుని దాని డొక్కల్లో కుమ్మాడు నిశీధుడు.

ఎగిరి అవతలబడింది సింహం. మెరుపులా లేచాడు నిశీధుడు, క్రింద పడిన వెంటనే లేచి నిలబడింది సింహం.

తల విదిలించి జూలు ఎగరేసింది నోరంతా తెరిచి భయంకరంగా గర్జించింది ఆ సింహం, పంజా ఎత్తి కాలు నేలకు దువ్వింది.

"ధీరా! అందుకో...." విసిరాడో కత్తిని గంగన్న.

నిశీధుడు ఆ కత్తిని అందుకోవటం, సింహం అతని మీదకు లంఘించటం ఒకేసారి జరిగింది.

సరిగ్గా నిశీధుడు కత్తి ఎత్తుతున్న సమయంలో లంఘించటం వల్ల కత్తి తిన్నగా సింహం గుండెల్లోనుంచీ పైకి దూసుకు వచ్చింది.

భయంకరంగా అరిచి కాళ్ళు నేలకితన్ని వెల్లకిలా పడిపోయిందా మృగరాజు. నిమిషం తరువాత దాని శరీరంలో చలనం నశించి పోయింది.

క్రింద పడినప్పుడు దుస్తులకు అంటిన మట్టిని దులుపుకుంటూ అపురూప వైపు చూశాడు నిశీధుడు.

సజల నేత్రాలతో అతనివైపే చూస్తోంది ఆమె. గంగన్న ప్రక్కన లేకపోయినట్లయితే ఒక్క పరుగున వచ్చి అతని కౌగిలిలో వాలిపోయేది.

చిన్నగా నవ్వి "గంగా! రండి పోదాం" అంటూ సింహం శరీరంలో దిగిన కత్తిని పైకిలాగి దానికి అంటిన రక్తాన్ని చెట్ల ఆకులలో తుడిచి శుభ్రపరిచి వరలో పెట్టుకున్నాడు

ముగ్గురూ నడుస్తూ దారిలో దొరికిన ఫలాలు, నేలను తవ్వి సేకరించిన దుంపలు తింటూ అడవి చివరికి చేరుకున్నారు.

ఒక లోయిలాంటి ప్రదేశంలో కనిపించింది కోయ గూడెం.

# 11

"అయూరే వీరుడా .... స్వాగతం! అయూరే మగరాయుడా స్వాగతం...." అంటూ చేతులు చాచి ముందుకు వచ్చాడు పుళిందుడు.

సాదరంగా అతన్ని కౌగలించుకుని స్నేహభావాన్ని ప్రకటించాడు నిశీధుడు. తన ప్రక్కన నిలబడిన గంగన్ననూ, అపురూపను పరిచయం చేశాడు.

"మయూరే, మగలేడా! విన్నాను నీ సాహసాలు..లోగా నాకు మిత్రుడు. నీ గురిం, నీ మగటిమి గురించి ముందే చెప్పినా. అడవిలో అడవి మనిషిని మన శత్రువులను, సింహాన్ని ఎదిరించిన నీ ప్రతాపం గురించి నా వేగుల



ఎప్పటికప్పుడూ చెపుతూనే వున్నారు రాయుడా! అన్నాడు పుళిందుడు నవ్వుతూ.

తల వంచుకున్నాడు తననే పరీక్షగా చూస్తూన్న కోయ పడుచులను చూసేసరికి మరింత ఎర్రబడి పోయింది అతని వదనం. "రాయుడా! రా" అంటూ సాదరంగా చేయిపట్టుకుని నిశీధుణ్ని ముందుకు తీసుకు పోయాడు పుళిందుడు.

విశాలమైన ఒక తిన్నెమీద ఆసీనులయినా రందరూ. "తిన్నెచుట్టూ కోయిల నివాసాలు వున్నాయి. తిన్నెకు వెనుకగా వుందో పది అడుగుల ఎత్తున్న విగ్రహం. అది కోయల కులదేవత విగ్రహం

వెన్నెల పిండి ఆరబోసినట్లు తెల్లగా మెరిసిపోతోంది. ఆ వెలుగులో, చల్లని మలయమారుత స్పర్శలో ప్రయాణ బడలిక తెలియటం లేదు ఆ ముగ్గురికీ.

కులదేవతా విగ్రహానికి అటూ యిటూ ప్రత్యేకమయిన అలంకరణలతో నిర్మింపబడి వున్నాయి రెండు కుటీరాలు.

ఒక కుటీరానికి అటూ యిటూ నిలబడి నిశీధుడినే పరీక్షగా చూస్తున్నారు యిద్దరు పడతులు.

"మిత్రమా! నీ శిష్యుడు శ్రీశర్మ అమితసాహసి! వయసుకు పిన్న కాని సాహసంలో మిన్న! నా గూడెం మీద దాడిచేసిన ఆ నల్లకోట వీరులని, చిచ్చరపిడుగులా చీల్చి చెండాడాడు. దురదృష్టవశాత్తు అతన్ని సకాలంలో కాపాడలేక పోయాం...." అన్నాడు పుళిందుడు విషాద భరిత స్వరంతో.

అతని విషాదాన్ని పట్టించుకోలేదు ఆ ముగ్గురూ. ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకుని అడిగారు.

"నల్లకోట వీరులా?"

"ఔను....ఇక్కడ నల్లకొండలలో వున్నదే నల్లకోట! పూర్వ కాలంలో ఎప్పుడో నిర్మించబడిందా నల్లకోట. దాన్ని చేజిక్కించు కున్నాడో దుర్మార్గుడు. అంగబలాన్ని సమకూర్చుకుని కుట్రలు పన్నుతున్నాడు. ఎప్పుడు చూచినా ముసుగులోనే వుంటాడుట! నా వేగులు చెప్పిన విషయం అది!

అంతేకాదు మిత్రమా! ఆ నల్లకోట వీరులకు మేము ప్రతిబంధకంగా తయారయినాము ఏదో విధంగా మా గూడాన్ని నాశనం చేయాలని వాళ్ళ పట్టుదల. మేము లొంగటం లేదు. తరచుగా మాతో యుద్ధాలూ తప్పటం లేదు వాళ్ళకు.

"ఇంకో విషయం, నిశీధా! ఆ నల్లకోటలోనే బంధింపబడి వున్నాడు అలక్ నందాదీవి పరిపాలకుడు ఆయనే మహారాజు. విప్లవ వీరుడిగా పరారీ అయినాడని చెప్పబడుతున్న నరేంద్రవర్మ కూడా ఆ నల్లకోటలోనే బంధించబడి వున్నాడు...." అని వివరించాడు పుళిందుడు.

ఆశ్చర్యంగా చూశాడు గంగన్న, అపురూప సాలో చనగా తలపంకించాడు నిశీధుడు. "మిత్రమా! కోయ... నాకు ఇలాంటిదేదో వున్నదనే అనుమానం వున్నది. ప్రగూసం గూఢచారి లోలా నన్ను యిక్కడికి వెళ్ళమని నిన్ను కలుసుకోమని, అందుకు అపురూప సహకరించగల దని మాత్రమే చెప్పాడు. అంతకంటే చెప్పేందు... అతని ప్రాణం నిలవలేదు....శత్రువులకు చిక్కి చిత్ర...



హింసలపాలయి వున్నాడతను. తన కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు లోలా!" అన్నాడు నిశీధుడు.

"లోలా మరణించాడా? అయ్యో!" అని విచార గ్రస్తుడైనాడు పుళిందుడు.

కొన్ని నిముషాలు భారంగా గడిచాయి. చిన్నగా దగ్గి కలతం సవరించుకున్నాడు నిశీధుడు.

తలెత్తి ఏమిటో చెప్పమన్నట్లు చూశాడు పుళిందుడు.

"నల్లకోట గురించి తెలుసు. అదెక్కడున్నదో తెలుసు, ఆ కోటలోని శత్రువులకు ఒక ముసుగు మనిషి నాయకుడనీ తెలుసు....ఇన్ని వివరాలూ తెలిసికూడా...." అని సంధిగ్ధంగా ఆగిపోయాడు నిశీధుడు.

అర్థమైందన్నట్లు తల వూపాడు పుళిందుడు. "నీ సందేహం అర్థమైంది మిత్రమా! తగిన అంగబలం వుంది. సాహసులైన కోయవీరులూ వున్నారు. కాని ఆ నల్లకోటపై దాడిచేసి ఆలక్ నందాదీవి పరిపాలకుని ఎందుకు విడిపించలేదనేగా నీ సందేహం?" అని ప్రశ్నించాడు.

ఔనన్నట్లు తల ఊపాడు నిశీధుడు. కోయనాయకుని కుటీరంలోనుంచీ ఇద్దరు యువతులు రాయంచగమనలై తిన్నెదగ్గరకు వచ్చారు. వారి చేతులలో వున్నాయి. వెదురు బుట్టలు. బుట్టలమీద కప్పిన పెద్దపెద్ద ఆకులు తీసి ముగ్గురి ముందూ పరిచారు ఆ కన్యలు.

బుట్టలలోనుంచీ కాల్చి మాంసమూ, ఉడక బెట్టిన దుంపలు, మగ్గిన పండ్లూ, తీసి ఆ ఆకులలో వుంచారు.

ముంతలతో తేనె, నీరు పుంచి ప్రక్కకి జరిగి నిల బడ్డారు ఆ స్త్రీలు.

"మిత్రమా! ఈ పిల్ల నా కూతురు నంద. ఇది నా చెల్లి ఆనంద! నందకీ, మీ శ్రీశర్మకూ పరిచయమైంది.

అంతే కాదు శ్రీశర్మపైన మనసు పడింది. అతగాడిని ఆ నల్లకోట పీపులు ఎత్తుకు రాకపోతే తప్పనిసరిగా అతన్ని నా గూడెం వదిలిపోనిచ్చేది లేదు .." నవ్వుతూ చెప్పాడు పుళిందుడు.

'ఔనా!' అన్నట్లు ముగ్గురూ చిరునవ్వుతో పదహారేళ్ళ నంద వైపు చూశారు.

సిగ్గుపడలేదు నంద. తలవూపి, "దొరా! ఆ నల్ల కోటకు మీరు వెడితే నేనూ వస్తాను. నా మనసు దోచిన వాడిని దోచుకుపోయాడు ఆ రాక్షసులు. ముందుండి నిలిచి గెలవలేక వెనక దెబ్బ కొట్టారునీచులు...." అంది పళ్ళు కొరుకుతూ.

ఆమె పట్టుదల, శ్రీశర్మపై ఆమెకు వున్న ప్రేమా చూచి విస్మితురాలైంది అపురూప. ఆమెవైపు అభిమానంగా చూస్తూ "తప్పకుండా నిన్నూ మాతో తీసుకు పోతాము నందా!" అంది.

"ఊఁ తరువాత మాట్లాడుకోవచ్చును. ముందు కడుపు నింపుకోండి...." అన్నాడు పుళిందుడు.

ముగ్గురూ ఆ హెచ్చరికతో ఆకులతో వడ్డించిన వాటిని ఆరగించటం ప్రారంభించారు.

"అమ్మా! నందా! చెల్లీ ఆనందా! మీరిద్దరూ మన అతిథులకు ఏం కావాలో చూడండి........ కడుపు నిండాక, 



కంటినిండా నిద్రపోయేందుకు ఏర్పాటు చేయండి .... స్వయంగా అన్నీ చేయండి...." అని ఆ పడుచులకు చెప్పి-

"మిత్రమా! నిదానంగా కడుపు నింపుకోండి. ఆ తరువాత విశ్రాంతి తీసుకోండి .... నేను గూడెంలోని వీరులందర్నీ సిద్ధం చేస్తా. తెల్లవారగానే నల్లకోటపై దాడి చేసేందుకు ఆలోచించి పథకాలు వేద్దాం. నీ శిష్యుడు విడిపించబడటమూ, అటు మా జయసేన మహారాజు కూడా విడిపించబడటమూ కూడా ఒకేసారి జరగాలి!" అని చెప్పి వెళ్ళిపోయాడు పుళిందుడు.

వచ్చినది మొదలు నిశీధుడ్నే రెప్ప వేయకుండా చూస్తోంది ఆనంద

కోయ యువరాణి నంద ఆ విషయాన్ని గమనించింది. "అత్తా! వీరుడికి నువ్వు పడక సిద్ధం చెయ్యి మిగిలిన వారికి నేను ఏర్పాటు చేస్తాను...." అంది.

ఉలిక్కిపడి తలెత్తి చూసింది అపురూప. అప్పటికే కదిలి వెళ్ళిపోయింది ఆనంద.

"ఏం కావాలి?" అడిగింది నంద.

ఏమని చెపుతుంది అపురూప. తనకి, నిశీధుడికి వేరువేరుగా పడకలు వద్దని, నిశీధుడికి దూరంగా తను వుండలేనని ఎలా చెపుతుంది?

అసలు నిశీధుడిపై తనకి ఎలాంటి హక్కువుంది?

చిన్నగా నిట్టూర్చి ఏమీ లేదన్నట్లు తల తిప్పింది నర్తకి అపురూప.

గంగన్న మాత్రం ఆమె ఆలోచన గమనించి నవ్వుకున్నాడు.

# 12

అద్భుతంగా అలంకరింపబడిన శయ్యను చూచి వెనక్కి తిరిగాడు నిశీధుడు.

భోజనం కాగానే అపురూపను, గంగన్ననూ గూడెం లోని విశేషాలు చూపిస్తానంటూ బలవంతంచేసి తీసుకు పోయింది నంద.

కాదనలేక వెళ్ళిందే కాని, తనని వదలివెళ్ళే అభి ప్రాయం ఎంతమాత్రం అపురూపకు లేదని తెలుసు నిశీధుడికి.

ఆమెని గురించి నవ్వుకుంటూ తనకోసం ఏర్పాటు చేసిన కుటీరంలోకి ప్రవేశించాడు నిశీధుడు.

ఒక అతిధికోసం అంతగా అలంకరించే శయ్యను ఏర్పాటు చేస్తారా ఈ కోయలు? ఆ అలంకరణ చేసినవారిని ప్రశంసించాలని చూశాడు నిశీధుడు.

వెదురు బద్దల తలుపుకి దగ్గరగా నిలబడివుంది ఆనంద. నిశీధుడు కుటీరంలోకి రాగానే కనిపించింది ఆమె మేను. చిరు చెమటతో తడిసిపోయాయి ఆమె దుస్తులు.

"నీవేనా ఈ అలంకరణ చేసింది?" అని ప్రశ్నించాడు నిశీధుడు చిన్నగా నవ్వుతూ.

జవాబు చెప్పలేదు ఆనంద కంగారుగా తల వూపింది.

"మాట్లాడవేం? సిగ్గా....మూగనోమా?" అని అడు గుతూ వెనక్కి తిరిగాడు నిశీధుడు. "చాలా అలసిపోయాను. నిద్ర వచ్చేస్తోంది. ఆ అపురూప వచ్చేసరికి నిద్రపోతూ



వుండాలి. లేకపోతే నన్ను బ్రతక నివ్వదు." అంటూ శయ్యను సమీపించి నిలబడి పోయాడు.

శయ్యమీద రంగు రంగుల పూలతో చిత్రించబడి వుంది ఓ చిత్రం.

పోలికలు తెలియక పోయినా స్త్రీ పురుషులు ఒకరినొకరు కౌగలించుకుని మైమరచి పోతున్న చిత్రం.

తను పడుకునే శయ్యమీద అలాంటి చిత్రమా? అపురూప గురించి తన గురించీ తెలిసే చిత్రించిందా ఈ కోయసుందరి?

నిశీధుడు వెనక్కి తిరగటం, వెదురు బద్దల తలుపు మూసి దానికి ఆనుకుని ఆనంద నిలబడటం ఒకేసారి జరిగాయి.

కనుబొమలు ముడివేశాడు నిశీధుడు. సూటిగా ఆమెవైపు చూశాడు. నెమ్మదిగా ముందుకు వచ్చాడు.

"ఆనందా! శయ్యపైన అలాంటి చిత్రం ఎందుకు వేశావు?" అని ప్రశ్నించాడు.

తల ఎత్తింది ఆనంద. ఆమె అరవింద నయనాల నుంచీ జాలు వారింది కన్నీరు అరుణాధరాలు పండుటాకుల్లా చలించి పోయాయి.

"నేను....నేను .. నిన్ను...నిన్ను ...." అంటూ రెండు చేతులతో మొహం కప్పుకుంది.

అర్థమైపోయింది నిశీధుడికి క్షణకాలం అలాగే నిలబడి పోయాడు. "ఆనందా! నన్నింతక్రితం చూడలేదు. నా గురించి విని వుంటావు. అలా విని నన్ను ప్రేమించావు,

ధన్యుడ్ని. నీ మనసులో చోటు చేసుకున్న నా జీవితం, ధన్యమైంది ఆనందా!

కాని, నాదీ దేశం కాదు. నేను యిక్కడ వుండలేను. నిన్ను నాతో తీసుకు వెళ్ళలేను. కారణం నాకు భార్య వుంది. అలాగని నిన్నిక్కడే పెళ్ళి చేసుకుని ఇక్కడే వుంచేసి నా దారిననేను పోలేను. నా వృత్తిరీత్యా చాలా మంది అందమైన స్త్రీలు పరిచయమౌతారు. వారినందరినీ పెళ్ళాడగలనా? అదీగాక నా వృత్తి ప్రమాదకరమైనది. ఎప్పుడు ఎక్కడ ప్రాణం వదలవల్సి వస్తుందో నాకే తెలియదు. నన్ను ప్రేమించి లేదా పెళ్ళిచేసుకుని ఎవరూ బాధపడటం నాకు యిష్టంలేదు.

ఇక అపురూప సంగతి అంటావా? ఆమె నేనూ ఒకే వృత్తిలో జీవించే వాళ్ళం! పైగా ఆమె నర్తకి! రేపు మా కర్తవ్యం నెరవేర్చగానే ఎవరిదారిన వారం పోతాం.... మళ్ళీ కలుసుకోవచ్చు; కలుసుకోక పోవచ్చు.

నీ జీవితం అలా కాదు ఆనందా! అలా కాకూడదు! మీ గూడెంలోనే నాకంటే అందమైన వారు. వీరులు వుంటారు చూచే వారి దృష్టినిబట్టి వుంటుంది అందం! మంచివాడిని, నీ నిరంతరం నీ కళ్ళముందే వుండేవాడిని నువ్వు పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలని కోరుకుంటున్నాను ఆనందా!

నిన్ను కాదన్నానని కోపగించుకోకు! నన్ను సోదరునిగా ప్రేమించు....కాదనను. ఇంక నందా, శ్రీశర్మల విషయం....అది వారిద్దరి యిష్టం! పైగా శ్రీశర్మ బ్రహ్మచారి...." అని వెనక్కి తిరిగాడు నిశీధుడు.



చటుక్కున మోకరించింది ఆనంద. నిశీధుడు నిలబడిన చోట నేలను కనులకు అద్దుకుని, బుగ్గలు, కనులు తుడుచుకుని రెండు చేతులు జోడించి నమస్కరించింది. ఆ వెంటనే తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళిపోయింది ఒక్క పరుగులో.

నలుగురు దృఢకాయులు ఆమెని పట్టుకున్నారు. ఒకడు నోరు నొక్కాడు. మరొకడు ఆమె నాసిక రంధ్రాలవద్ద ఏదో వాసన చూపించాడు. తల వాల్చేసింది ఆనంద. క్రిందకు జారిపోతున్న ఆమెని మరొకడు ఎత్తి భుజంమీద వేసుకున్నాడు.

ఎంత నిశ్శబ్దంగా వచ్చారో అంత నిశ్శబ్దంగానూ చీకట్లలోకి జారిపోయారు ఆ నలుగురూ?

చిన్నగా నిట్టూర్చి శయ్యపై వ్రాలి తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయాడు నిశీధుడు. ఆనందను ఎవరో ఎత్తుకుపోయిన విషయం పసిగట్టలేదతను.

o o o

"ఇది మా కులదేవత....అయనే మా కులగురువు...." అంటూ దూరంనుంచీ చూపించింది నంద.

తల వూపాడు గంగన్న. చూపించాల్సిన విశేషాలు ఏమైనా వుంటే వెంటనే చూపించమ్మాయ్! పోయి నిద్ర పోవాలి...." అన్నాడు నవ్వుతూ.

"అలాగే....మా అత్త మంచి చిత్రకారిణి. ఆమె వేసిన చిత్రాలు చూశాక వెళ్ళిపోదాం...." అంటూ వారి జవాబుకు ఎదురు చూడకుండా ముందుకు కదిలింది నంద.

ఆమె ఆరాటం వేరు. అపురూపను, గంగన్ననూ కొంత
యినా నిరోధించగలిగితే అత్త ఆనంద నిశీధుడితో
పు గడుపుతుంది.

ఆ ఆలోచనలోనే గూడెం చూపించే వంకతో అందరినీ
తోంది నంద. చివరగా అత్త వేసిన చిత్రాలు
ంచే నెపంతో ఆమె కుటీరానికి తీసుకువెళ్ళింది.

వాటిని చూస్తూనే గంగన్న, అపురూపలకు ఆనంద
చిత్రకారిణి అని అర్థమై పోయింది.

"చూస్తూ వుండండి! యిప్పుడే వస్తాను...." అంటూ
టకు వెళ్ళిపోయింది నంద.

న్నింటిని చూసి ఎందుకో తలెత్తింది ఆనంద, శయ్యకు
గా ఒక తిన్నెమీద రాతిపలక ఒకటి కనిపించింది.
ద జింక చర్మం కప్పి వుంది. తిన్నెమీద రంగుల
లు, కుందేలు కనిపించాయి.

నంద ఏదో చిత్రాన్ని వేస్తున్నట్లు గ్రహించింది
పా. పలకమీద వున్న జింకచర్మాన్ని తొలగించి
నిలబడి పోయింది అపురూప.

లకంమీద వున్న చిత్రం ఎవరిదో కాదు నిశీధుడిది.
ప్పటికీ లేచి వచ్చాడు గంగన్న. అతనూ ఆచిత్రాన్ని
డు.

రేవా! పుళిందుడి సోదరి ఎంత గొప్ప చిత్రకారిణి?
చూడనైనా చూడలేదు యింతవరకు, అతని గురించి
ంత అద్భుతంగా బొమ్మ వేసిందంటే, సోదరీ, దీని
మిటి?" అని అడిగాడు.



తీక్షణంగా అతని వైపు చూసింది అపురూప. "ఒక కన్య ఒక యువకుని చిత్రాన్ని చిత్రించిందీ అంటే దాని అర్థం అతన్ని ఆరాధిస్తున్నదనే కదా!" అని అడిగింది.

తల వూపాడు గంగన్న. "అపురూప! ఆనంద నిశీధుడ్ని ఇంతగా ఆరాధిస్తున్నదంటే నీకు ఈర్ష్యగాలేదా?" అని ప్రశ్నించాడు.

"కాదు....నిశీధుడ్ని ఆరాధించే హక్కు నాకు మాత్రమే అని నేను అనుకోవటం లేదు. అలాగని నిశీధుడు కూడా అందిన అదదాన్నల్లా పాడుచేసే స్వభావం కలవాడని నేనూ అనుకోవటంలేదు...." దృఢ స్వరంతో అంది అపురూప.

"మరి నువ్వు నిశీధుడ్ని...." ఆగిపోయాడు గంగన్న.

"నా జీవితంలో నన్నుకోరి చాలామంది వచ్చారు. నేను కోరి చేరినది నిశీధుడి చెంతకే! మా పరిచయం - ప్రణయం శాశ్వతమని అనుకోను; ఆశపడను....గంగన్నా! నువ్వు వెళ్ళు.... నేను యిక్కడే పడుకుంటాను....నందతో చెప్పు. వస్తే నాకు తోడుగా వుంటుంది." అంటూ ఆనంద శయ్య మీద వాలిపోయింది అపురూప.

ఆమె నిశీధుడితో ఆనందకి ఏకాంతం కలిగించాలని నిర్ణయించుకుందని గ్రహించాడు గంగన్న. అపురూప లాంటి స్త్రీలు ఏదైనా ఒక నిర్ణయానికి వస్తే ఆ నిర్ణయం మారదని తెలుసు అతనికి.

ఆ కుటీరంలోనుంచీ బయటకు వచ్చేసి కులదేవత విగ్రహం ముందువున్న తిన్నెవైపు అడుగులు వేశాడు గంగన్న.

అదే సమయంలో ఆనంద కుటీరంలో శయనించి వున్న అపురూపమీదకు నలుగురు దృఢకాయులు దాడిచేశారని, అరవకుండా నోరునొక్కి స్పృహ పోగొట్టి అపురూపను ఎత్తుకు పోయారని గంగన్నకే కాదు; ఆ గూడెంలో ఎవరికీ తెలియదు.

# 13

"అహ్హా! అపురూప....ప్రపంచ గూఢచారుల సంస్థ తరపున వచ్చిన గూఢచారిణివా నీవు? గూఢచారిణి కాకంటే జారిణిగా బాగా పనికివస్తావు! నీ అందం నలుగురికి విందు చేయిస్తాను...." అంటూ ముసుగుమనిషి బంధించబడిన అపురూప ముందునుంచీ ఆనంద దగ్గిరకు కదిలాడు.

"ఆనంద! ఈ....కోయగూడెం నాయకుడు పుళిందుని సోదరి....ఔనా.... కోయ పడుచులలో ఇంత అందం వుంటుందని అనుకోలేదు. ఈ అందం యిచ్చే ఆనందం ఏమిటో చూడాలి!" వెకిలిగా నవ్వాడు ముసుగుమనిషి.

"ఛీ! నీచుడా! అర్ధరాత్రివేళ దొంగచాటుగా దెబ్బతీసి బంధించిన నీది ఒక శౌర్యమేనా? అందం అందం అని ద స్తున్నావు ఈ అందంతోబాటు ఎలాంటి శౌర్యం వుందో చూస్తావా? చేవవుంటే చేతిలో కత్తి యిచ్చి చూడు!" అంది ఆనంద రౌద్ర స్వరంతో.

"ఓహో! అంతటి ప్రతాపశాలివా? అదీ చూస్తాను..." అంటూ వెనక్కి తిరిగాడు ముసుగు మనిషి.

ఆ గదిలోనే చివరగా ఒక తిన్నెమీద పడుకున్న



వున్నాడు శ్రీశర్మ. అతని దగ్గరకు వచ్చారు ముసుగు మనిషి.

"ఏం శ్రీశర్మ! నీకోసం కాకపోయినా ఈ అందగత్తెల కోసమైనా రాడా ఆ నిశిధుడు? వచ్చాక ఈ నల్లకోటలో ఎక్కడికి తప్పించుకు పోగలడు? అన్ని కోటల్లాంటిదీ కాదీ నల్లకోట. ఈ నల్లకోట రహస్యాన్ని ఛేదించటము ఎవరితరమూ కాదు!" అన్నాడు సగర్వంగా.

"మంచిది .... అభేద్యమయిన నల్లకోట రహస్యాన్ని ఛేదించిన కీర్తి మాకే దక్కుగాక!" అన్నాడు శ్రీశర్మ నవ్వుతూ.

పరిహాసంగా నవ్వాడు ముసుగు వ్యక్తి. శ్రీశర్మా! నల్లకోట రహస్యం ఛేదించటం కాదుగదా? అసలు ఈ కోట లోకి ప్రవేశించమే కష్టం! వచ్చినవాడు తప్పించుకోవటమూ కష్టం! పద్మవ్యూహ్యంలో ప్రవేశించిన అభిమన్యుడు బయట పడ్డాడా? లేదే....? మీ నిశిధుడూ అంతే!" అన్నాడు హేళనగా.

"మా నిశిధుడు అభిమన్యుడో, అర్జునుడో మాటలతో చెప్పటం ఎందుకు? చేతలతోనే తెలుస్తుంది...." అంటూ మొహం తిప్పుకున్నాడు శ్రీశర్మ.

"సరే! అదీ చూద్దాం...." అంటూ ఆ గదిలోనుంచీ బయటకు వచ్చారు ముసుగు మనిషి.

కాపలా వున్న అనుచరులను లోపలకి పోవద్దని, బయటనే వుండి జాగ్రత్తగా కాపలా కాయమని హెచ్చరించి కదిలాడు.

పెద్ద ఆవరణలోకి చేరి పైకప్పులకి వ్రేలాడుతున్న

పెద్ద గంటను తంగ్‌మని మ్రోగించాడు, ఆ వెంటనే
గుంపులు గుంపులుగా రా నారంభించారు అతని అనుచరులు.

"మిత్రులారా! ఎంతో కాలంగా మనం యిక్కడ చేరి
స్థావరం ఏర్పరుచుకుని, ఈ నల్లకోట శత్రు నిర్భేద్యంగా
అనితర సాధ్యంగా తయారు చేసుకున్నాము. అలాంటి
మన స్థావరంమీదకు దాడి రాబోతున్నారు మన శత్రువులు!
వారిలో మనకి ప్రబల శత్రువు హస్తినాపుర గూఢచారులలో
ప్రథముడు నిశీధుడనే వాడు! ఆ నిశీధుడికి అపరూప అనే
ర్తకిని, గూఢచారిణినీ, మన శత్రువు పుళిందుడనే
యల గూడెం నాయకుడు చెల్లెలు అనంద అనే యువతినీ
సుకువచ్చి బంధించాము. వారికోసం కోయగూడెం
సైన్యంతో కలిసి గూఢచారి నిశీధుడు యిక్కడికి రాక
ప్పదు....

వచ్చిన శత్రువుని ఉక్కిరిబిక్కిరి చేసి అంతం చేయాలి!
ప్పటిదాకా కోయ సైన్యం మనల్ని ఏమీ చేయలేక
యింది కాని యిప్పుడు ఆ నిశీధుడి అండతో విజృం
ంచినా ఆశ్చర్యం లేదు.

ఆదినుంచీ మనకి యిక్కడ స్థావరం ఏర్పరుచుకోవటం
నూ, తగిన అంగబలాన్ని సమీకరించటంలోనూ నల్ల
చు ముఠా సహాయం చేస్తున్నది. ఆ నల్లత్రాచు ముఠా

---

'నల్లత్రాచు' ముఠా అసలు ఎలా తలెత్తిందో తెలుసు
కునేందుకు తుర్లపాటి రచన 'గూఢచారి నిశీధుడు'
చదవండి. త్వరలో పాపులర్ పబ్లిషర్స్, విజయవాడ
3 ద్వారా విడుదల!



మనల్ని నిశీధుడు గురించి తరచుగా హెచ్చరిస్తూనే వున్నది.
ఇప్పుడా ప్రమాదం ముందుకు వస్తూనే వుంది.

తగిన జాగ్రత్త వహించకపోతే మనం ఏర్పరచుకున్న
కోట నాశనమై పోతుంది. మన ఆశయాలు విచ్ఛిన్నమై
పోతాయి. మన కలలు కల్లలై పోతాయి. అందుకని మీరం
దరూ తగిన శ్రద్ధతో అప్రమత్తులై వుండాలి. నల్లకొండల
నడుమవున్న సరస్సుని జాగ్రత్తగా కావలి కాయండి!
రక్షణ ఏర్పాట్లు ఎక్కువ చేయండి" అని చెప్పి అనుచరు
లందరూ జేజేలు పలుకుతూండగా వెళ్ళిపోయాడు ముసుగు
వ్యక్తి.

"నల్లత్రాచు ముఠాకి జై! నల్లకోట వర్ధిల్లాలి! నల్లకోట
వీరులు వర్ధిల్లాలి!" అని నినాధాలు చేశారు అందరూ.

ఆ నినాదాలతో ప్రతిధ్వనించింది ఆ ఆవరణ. గుంపులు
గుంపులుగా కదిలారు అందరూ.

## 14

అపరూప, అనందులు అపహరించబడ్డారని గ్రహించగానే
ఆవేశంతో రగిలిపోయారు కోయవీరులందరూ.

"మోగించండి రణభేరీలు.... అందుకోండి ఆయుధాలను
....నాయకా అనతివ్వు!" అంటూ ఆవేశపడుతూ అరిచాడు
కోయగూడెం సేనాని,

నిశీధుడి వైపు చూశాడు పుళిందుడు. అడుగు ముందుకు
వేసి అందరినీ శాంతించమన్నట్లు చూశాడు నిశీధుడు.

"మిత్రులారా! ఆవేశపడకండి .... నల్లకోట గురించి నా

తంటే మీకే బాగా తెలుసు. మీలో సాహసులు, శౌర్యవంతులూ లేకకాదు; కాని ఆ నల్లకోటనిగాని, అందులోని మీ శత్రువులనుగాని ఏమీ చేయలేక పోయారంటే అర్థం ఏమిటి? ఈసారి నేనూ వున్నాను. మీతో కలిసి ముందుకు వస్తాను. నల్లకోటని నాశనం చేద్దాం! మీ మనిషి ఆనందతో బాటే నా శిష్యుడూ, నాతో వచ్చిన యువతీ వారికి చిక్కిపోయారు నావారినేకాదు రక్షించుకోవల్సింది....

ఆవేశం తగ్గించుకోండి ........ అందరూ స్థిమితంగా కూర్చోండి. ఒక నిర్ణీత పథకం ప్రకారం పనిచేద్దాం.... శత్రువుని అంతం చేద్దాం...." అన్నాడు.

"చెప్పండి! మా ప్రాణాలయినా యిస్తాం. కాని మా ఆడబడుచుని అపహరించిన ఆ నల్లకోట వీరులు అంతమై తీరాలి!" అని అరిచారు అందరూ.

"శుభం! అదే మన దీక్ష! చెప్పండి....అసలు నల్లకోట ఎలా వుంటుంది? ఎక్కడుంటుంది? వివరంగా చెప్పండి-" అడిగాడు నిశిధుడు.

కంఠం సవరించుకుని వివరించటం ప్రారంభించాడు పుళిందుడు. "నిశిధా! ఈ నల్లకోట అన్ని కోటల్లాగా నేల మీద లేదు. భూగర్భంలో వుంది. అదీ మనకు బయటకు కనిపించదు. నల్లకొండలు నాలుగు ఒకేచోట వున్నాయి. వాటి మధ్య వుంటుందో పెద్ద సరస్సు! ఆ సరస్సు క్రింద వుంది నల్లకోట! ఎప్పుడో కొన్నివేల సంవత్సరాల క్రితం ఎవరో ఆ కోటను నిర్మించి వుంటారు. ఇప్పుడది ఈ దుర్మార్గులు చేజిక్కించుకుని వాడుకుంటున్నారు...." అన్నాడు.



"సరస్సు క్రిందవుంటే మరి వాళ్ళు లోపలికి రావటం, పోవటం ఏ విధంగా జరుగుతున్నది?" అని ప్రశ్నించాడు నిశిధుడు.

"సరస్సు మధ్యలో పెద్ద యినుప తలుపువుంది. ఆ తలుపుకి క్రింద సూటీగా మరో చిన్న సరస్సువుంది. అందువల్ల తలుపు తెరవగానే నీరు ఆ క్రింది సరస్సులో పడిపోతుంది. పైకి వచ్చేందుకు, క్రిందకు దిగేందుకు ఆ యినుప తలుపుకే గొలుసులు, నిచ్చెనలు వుంటాయి" అని వివరించాడు పుళిందుడు.

"ఆహార పదార్థాలు, దుస్తులూ యిలాంటివి ఎలా తీసుకుపోతారు?" అడిగాడు అప్పటిదాకా మౌనంగా వుండిపోయిన గంగన్న.

"పై సరస్సులోనూ, క్రింది సరస్సులోనూ చిన్న చిన్న పడవలు ఉపయోగిస్తారు...."

"సరస్సు అడుగుభాగం అంతా రాతి ఫలకలవంటివి వున్నాయా?"

ఔనన్నట్లు తల వూపాడు పుళిందుడు.

"మరి సరస్సులోని నీరు ఇనుపతలుపు తెరిచినప్పుడల్లా లోపలికి పోతుంది కదా? మళ్ళీ కొత్త నీరు ఎలా వస్తుంది?" అని ప్రశ్నించాడు గంగన్న.

"నాలుగు కొండలకు అవతల పెద్దపెద్ద నీటి వాగులున్నాయి. కొండలలోనుంచి దారి ఏర్పరచి అవసరమైనప్పుడు నీటిని రానిచ్చి పై సరస్సు నిండేలా చేస్తారు!"

"మంచిది పుళిందా! మొత్తం మీ కోయసైన్యం ఎంత మంది?" అడిగాడు ఆలోచనలోనుంచి తేరుకున్న నిశీధుడు.

"ఐదు వందలమంది .... అవసరమైతే గూడెంలోని అందరూ ఆయుధాలు పట్టేందుకు సిద్ధమే!"

"అంత అవసరం రాదు! మీలో కొందరు వెళ్ళి ఏ విధంగానైనా సరే, బొగ్గు. పెట్లుప్పు, ఖానర్వం. గంధకం, ఇనుప గుండ్లు సంపాదించండి! అవి చాలా అవసరం...." అంటూ పుళిందుని వైపు చూశాడు నిశీధుడు.

"అవసరమైతే అడ్డదారులవెంట నగరానికి పోయి అయినా తీసుకువస్తారు. కాని వాటితో ఏం పని?" అడిగాడు పుళిందుడు.

"పని అంతా వాటితోనే వుంది! వెంటనే అవి తెప్పించే ఏర్పాటు చేయండి! తరువాత ఏం చేయాలో చెపుతాను.." అంటూ తన పథకం వివరించటం ప్రారంభించాడు నిశీధుడు.

# 15

అయిదుగురు కోయవీరులని మాత్రం వెంట బెట్టుకుని నల్లకొండల మధ్య వున్న సరస్సు దగ్గరకు చేరుకున్నాడు నిశీధుడు.

వెంటనే ఎక్కడినుంచో వచ్చి ఆ ఆరుగుర్నీ చుట్టుముట్టారు ఇరవై మంది దృఢకాయులు.

వారితో తలబడి ఎక్కువసేపు పోరాడవద్దనీ. పోరాడినట్లే నటించి లొంగిపొమ్మనీ ముందే చెప్పాడు నిశీధుడు.

యిద్దర్ని పడగొట్టి కత్తి జారిపోయినట్లు నటించాడు నిశీధుడు. ఆ సమయంలో అతనిమీద పడి చేతులు విరిచి



పట్టుకున్నారు నలుగురు. మిగిలిన కోయలని లొంగదీసుకున్నారు పదిమంది దృఢకాయులు.

కత్తులు వీపులకు గుచ్చి పడవ ఎక్కించారు. సరస్సు మధ్యకు చేరుకుంది పడవ. వెంటనే ఒకడు పడవలో నుంచీ లంగరులాంటిది క్రిందకు జారవిడిచాడు.

ఖంగుమంటూ నీటిలోపల ఎక్కడో తగులుకుంది ఆ లంగరు. ఆ వెంటనే పెద్దగా చప్పుడు చేస్తూ సరసులోని తలుపు క్రిందకు జారింది.

హోరున శబ్దంచేస్తూ సరస్సులోని నీరు క్రిందకు పోయింది. ఐదు నిముషాల తరువాత నీటి ఉధృతం తగ్గింది.

ఇనుప తలుపుకివున్న గొలుసులను, నిచ్చెనలనూ పట్టుకుని క్రిందకు దిగమని హెచ్చరించారు దృఢకాయులు.

ఒకరి తరువాత ఒకరుగా కోయలు, నిశీధుడు క్రిందకు దిగారు. సిద్ధంగా వుందో పడవ అందులోకి చేరారు అందరూ.

నిముషంలో పడవ తీరానికి లాగబడింది. తీరం మీద కాలుమోపిన వెంటనే మరో ఇరవై మంది దృఢకాయులు విచ్చు కత్తులతో చుట్టుముట్టడం చూసి తనలో తను నవ్వుకున్నాడు

విశాలమైన ఆవరణలోకి నడిపించారు. ఎత్తయిన తిన్నె మీద నిలబడి వున్నాడు ముసుగు వ్యక్తి.

"స్వాగతం! సుస్వాగతం!! ప్రముఖ గూఢచారి నిశీధుడికి స్వాగతం!" అన్నాడు ముసుగు మనిషి. చిర్న

నవ్వుతో ఆ మనిషిని పరీక్షగా చూశాడు నిశీధుడు. ముసు గులో ఉండాల్సిన అవసరం ఏముంది ఇతనికి?

"ఏం నిశీధా! కోరివచ్చి ఉక్కుల్లో పడుతున్నావు.... పాపం! నీ మిత్రుడికోసం కాబోలు...." వికటంగా నవ్వాడు ముసుగు వ్యక్తి.

"కాదు! నీ నల్లకోట రహస్యం ఏమిటో దాని అంతు చూడాలని! తీక్షణంగా చూస్తూ అన్నాడు నిశీధుడు.

ఎర్రవారిన కనులలో క్రోధంగా చూశాడు ముసుగు వ్యక్తి "నిశీధా! నీవున్నది అడవి కాదు. ఏమార్చి పారి పోయేందుకు...." అంటూ అనుచరులవైపు చూశాడు.

"ఇతన్ని జాగ్రత్తగా బంధించి వుంచండి .... తప్పిం చుకు పోనివ్వద్దు!" అని ఆజ్ఞాపించాడు

కత్తులు గురిపెట్టి. ఇనుప గొలుసులతో తనని సమీ పించే దృఢకాయులను గమనించాడు నిశీధుడు.

వారిని దెబ్బ తీయటం ఒక సమస్యకాదు. కాని శ్రీశర్మ అపురూప, ఆనందలు ఎక్కడ బంధించబడినారో తెలియ దు. తొందరపడి ప్రయోజనం లేదని మౌనం వహిం చాడు నిశీధుడు.

అతను ప్రతిఘటించక పోవటంతో సునాయాసంగా అతని కరచరణాలు బంధించ గలిగారు ఆ దృఢకాయులు. గొలుసులచివర పట్టుకుని ఒక పెద్ద గదిలోకి లాగుకు పోయారు.

గోడకు గొలుసులు బిగించి, గది తలుపులు మూసి



వెళ్ళిపోయారు. తనతో వచ్చిన కోయలను వేరే గదిలో బంధించారని గ్రహించాడు నిశీధుడు

ఆగదిని పరీక్షగా చూశాడు. తలుపు తప్ప వేరే దారి లేదు. గాలి వెలుతురూ కూడా ఆ తలుపుకు ఉన్న చిన్న కిటికీలోనుంచే రావల్సిందే!

సరిగ్గా అరగంట తరువాత వచ్చాడు ముసుగు మనిషి వెంట నలుగురు దృఢకాయులున్నారు.

నిశీధుడి దుస్తులు వెదికి ఆయుధాలన్నీ తీసేయమని ఒక దృఢకాయుడికి ఆజ్ఞాపించాడు.

ఆ దృఢకాయుడు నిశీధుడి దట్టీలోవుండే చురకత్తులను తొడలకు పట్టీలో బిగించికట్టిన ఛురికలను తీసేసుకున్నాడు ఆ దృఢకాయుడు.

నిశీధుడి డొక్కమీదుగా ఆకులువేసి బిగించి కట్టబడి వుందో కట్టు.

దానివైపు పరీక్షగా చూశాడు ముసుగుమనిషి. కట్టుమీద ఎర్రటి రక్తపు మరకలు కనిపిస్తున్నాయి

"పాపం! ఎప్పుడో గాయమైనట్లుంది...." పరిహాసంగా నవ్వాడు ముసుగు మనిషి.

తలవూపి, మౌనంగా వుండిపోయాడు నిశీధుడు.

"నిశీధా! నల్లత్రాచు ముఠా నీకో వెల నిర్ణయించింది తెలుసా?"

"అలాగా? ఎంత?" నవ్వుతూ అడిగాడు నిశీధుడు.

"నిన్ను ప్రాణాలతో పట్టుకుంటే ఐదు లక్షల వరహాలు. నిన్ను బంధించిన వార్త నల్లత్రాచు ముఠా అగ్రనాయకు

కు తెలియజేస్తున్నాను...." చిన్నగా నవ్వాడు ముసుగు
మనిషి.

"నీకు డబ్బు అవసరమా?" ఆశ్చర్యంగా అడిగాడు
శీధుడు.

"నాకు డబ్బు అవసరంలేదని ఎందుకు అనుకుంటు
న్నావు?" కించిత్ ఆశ్చర్యం ధ్వనించింది ముసుగు మనిషి
ంఠంలో.

"ఒక రాజ్యాన్నే స్వాధీనం చేసుకునేందుకు కుట్ర
న్నిన వాడివి .... నీకు డబ్బు ఎందుకు?" అడిగాడు
శీధుడు.

క్షణకాలం విశ్రాంతితో మౌనం వహించాడు ముసుగు
నిషి. తల పంకించి, "నువ్వు ఆవలించకుండానే పేగులు
క్కబెట్టే అసాధ్యుడివి! నీకు చాలా తక్కువకాలంలోనే
న్ని దేశాలలోనూ యింత కీర్తి ఎందుకు వచ్చిందో
ప్పుడు అర్థమైంది...." అంటూ గోడలోవున్న చక్రాన్ని
ప్పాడు ముసుగు మనిషి.

కిర్రుమని శబ్దంచేస్తూ గోడలో సగం పైగా ప్రక్కకి
ప్పుకుంది. ఎదురుగా మరో గది కనిపిస్తోంది. ఆ గదిలో
ధించబడి వున్న శ్రీశర్మ, అపురూప, ఆనందలను
శాడు నిశీధుడు సంతృప్తితో చిన్నగా నిట్టూర్పు
లాడు.

"చూశావా, నిశీధా! నిన్ను- నీతోబాటు వీరినందరినీ
తం చేయగలను....అది నా చేతిలో పని? కాని నిన్ను
త్రాచు ముఠాకి వప్పగించి, ఆ ముఠాలో నా కీర్తి స్థాయి



పెంచుకుంటాను. నీ సహచరుడ్ని యిక్కడే చంపేస్తాను..
ఈ ఆడవాళ్ళను నా ఆనందానికి వినియోగించుకుంటాను."

"ఛీ! నీమదా - ఆడదంటే అలుసా నీకు?" అంటూ
తుపుక్కున ముసుగు మనిషి మొహంమీద వుమ్మేసింది
ఆనంద.

"ఎంత పొగరే నీకు నామీదనే ఉమ్మేస్తావా!" అంటూ
ముందుకు వచ్చాడు ముసుగు మనిషి.

"రేయ్! ఆ యిద్దర్నీ మీ రిద్దరూ చెరో కొరడా అందు
కుని విరగబాదండి? నేను దీని వంటి పొగరెక్కడుందో
చూస్తాను" అని ఆజ్ఞాపించి ఆనంద పైట కొంగు అందు
కుని లాగేశాడు ముసుగు మనిషి.

అవమానంతో ఎర్రబడి పోయింది ఆనంద మొహం.
రెండు చేతులూ బంధించబడి వున్నా, కాలెత్తి పెడీమని
తన్నింది ముసుగు వ్యక్తిని.

వెనక్కి పడిపోయాడు ముసుగు మనిషి. పళ్ళు పటపట
కొరుకుతూ లేచాడు.

"చూస్తారేంరా! ఆ నర్తకినీ, శ్రీశర్మనూ కొరడాలతో
కొట్టి చిత్రహింస పెట్టండి...." అని అరిచి ఆనంద మీదకు
దూకాడు.

ఆమె శరీరంమీద రవిక, మోకాళ్ళమీద వున్న లంగా
మాత్రమే వున్నాయి.

"నిశీధా! ఈ సుందరి అందాన్ని అనుభవించబో
తున్నాను. ఈమెని నువ్వు కాపాడగలవా!" వికటంగా

నవ్వుతూ అని, ఆనంద రవికమీద చెయ్యివేశాడు ముసుగు మనిషి.

తన కారణంగా బంధించబడి అవమానింపబడుతోంది ఆనంద. చూస్తూ చూస్తూ భరించటమా?

ఫటఫటమంటూ ఉప్పొంగాయి నిశీధుడి కండరాయి. ఆవేశంలో ఎర్రబడి పోయాయి అతని నేత్రాలు.

మరోసారి తల తిప్పి పరిహాసంగా చూశాడు ముసుగు వ్యక్తి. ఆ తరువాత ఆనంద రవికమీద చేతిని కదిలిస్తూ వికృతంగా నవ్వాడు.

## 15

అదే సరస్సు.... అవి నల్లకొండలు! వాటి వెనుక వున్నాయి వాగులు...." అని వివరించాడు పుళిందుడు.

తల వూపాడు గంగన్న. అతని వెనుక పెద్ద పెద్ద కడవలంత మట్టిగుళ్ళు పట్టుకుని వున్నారు పదిమంది. నిశీధుడు ఫిరంగి గుండ్లమందులో తయారు చేయించిన ప్రేలుడు కడవలు.

పుళిందుడి వెంట అతని కూతురు నంద. ఏడు వందల మంది కోయ సైన్యం వున్నారు. నల్లకొండల చుట్టూ కాపలా కాస్తున్నారు నల్లకోట వీరులు.

కోయ సైన్యం బండలను, చెట్లను చాటుచేసుకునే విష బాణాలు వదిలారు. అరిచేందుకు కూడా అవకాశం లేకుండా హతమై పోయారు నల్లకోట వీరులు.



మిగిలిన వారిమీదకు కత్తులూ ఈటెలూ పుచ్చుకుని విజృంభించింది కోయసైన్యం.

పుళిందుని నాయకత్వంలో ఒకవంక అలా హోరాహోరీ పోరాటం జరుగుతూనే వుంది.

మరోవైపు గంగన్న నాయకత్వంలో పదిమంది పట్టుకున్న ప్రేలుడు కడవలతో నక్కుతూ దాగుతూ నాలుగు కొండలను చుట్టి ఒక్కొక్క కొండలోనూ రెండేసి ప్రేలుడు కడవలు అమర్చి, అన్నింటికి కలిపి కొవ్వుతో తడిపిన తాడుకట్టి వెనక్కి వచ్చే ప్రయత్నం జరుగుతోంది. రెండే రెండు కట్టి వెనక్కివచ్చే ప్రయత్నం జరుగుతోంది. రెండే రెండు కడవలు మిగిల్చి ఒక చెట్టు క్రింద కూర్చుని వుంది నంద. ఆమె శ్రీశర్మ గురించి ఆలోచిస్తోంది.

తను మళ్ళీ శ్రీశర్మను చూడగలుగుతుందా? అతను వెళ్ళిపోతూ తనని పెళ్ళాడి తీసుకుపోయేందుకు అంగీకరిస్తాడా!

"ఏం తల్లీ! ఏ లోకంలో విహరిస్తున్నావు? నల్లకోట వీరులతో ముఖాముఖీ పోరాడే మనవాళ్ళనందరినీ వెనక్కి రమ్మని సంకేతంగా కొమ్ము బూర వూదు! ప్రేలుడు కడవలకు కట్టిన తాడుకి నిప్పు అంటించేశాం. వెంటనే అందరం వెనక్కిపోతే మనం కూడా ఆ కొండరాళ్ళ క్రింద నలిగి నాశనం కావల్సిందే!" నంద చెవిదగ్గర నోరుపెట్టి బిగ్గరగా అన్నాడు గంగన్న.

ఉలికిపడి కనులు తెరిచింది నంద. చిన్నగా నవ్వి

లొంటిన దాచిన కొమ్ము బూర తీసి ఊదింది. అది ఊదగానే వెనక్కి వచ్చేయాలని అందరికీ ముందే చెప్పేలాడు కోయ నాయకుడు పుళిందుడు

నల్లకోట వీరులతో పోరాడుతూనే వున్న వారందరూ ఒక్కసారి వెనక్కి తిరిగి వచ్చేశాడు కోయలందరూ.

అపలాయన మంత్రంలోని అంతర్యం ఏమిటో గ్రహించకుని వేగంగా కోయ యువకులని వెంటాడే ప్రయత్నం చేయబోయారు నల్లకోట వీరులు. నెరవేరలేదు వారి ప్రయత్నం.

అగ్ని పర్వతం బ్రద్దలయినట్లు ఒక్కసారిగా పెటిల్ మనే ధ్వనితో బ్రద్దలయినాయి ప్రేలుడు కడవలన్నీ.

ఏనుగులంత వున్న బండరాళ్ళు ఎగిరెగిరి సరస్సులో పడ నారంభించాయి ఆ అదురుకు సరస్సులోని నీరు పొంగి బయటకు వస్తూండగా బండరాళ్ళ తాకిడికి సరస్సులోని యినుప తలుపు దానంతటే తెరుచుకుంది

ప్రేలుడు ఉధృతం తగ్గేంతవరకు కోయసైన్యంతో బాటు గంగన్న తదితరులు ఎక్కడి వారక్కడ కూర్చుండి పోయారు.

ఆ తరువాత కత్తులు, ఈటెలు ఎగరేస్తూ అరుస్తూ సరస్సులోకి దూకారు. బండరాళ్ళ క్రిందపడి నలిగి పోయారు కొందరు నల్లకోట వీరులు. ప్రేలుడు ధాటికి గుండెలు బ్రద్దలయి చచ్చారు మరికొందరు.



తెరుచుకున్న ద్వారంలోనుంచీ క్రిందకుదిగారు గంగన్నా, పుళిందుడూ. ఆ వెనుక నంద, ఆమెను అనుసరించి కోయ సైన్యం దిగ నారంభించారు.

* * ०

బలమంతా ప్రయోగించి కాళ్ళు నేలకి తన్ని పెద్దగా పెడబొబ్బ పెట్టాడు నిశీధుడు.

కిరకిరమంటూ గోడనుంచీ ఊడి వచ్చాయి అతన్ని బంధించిన యినుప గొలుసులు. ఆ శబ్దానికి ఆనంద రవిక మీద చెయ్యివేసి, రవిక లాగబోతున్న ముసుగు వ్యక్తి గిరుక్కున తిరిగాడు.

మరుక్షణం వరనుంచీ కత్తినిలాగి నిశీధుడిమీదకు దూక బోయాడు. చేతికి వున్న గొలుసు గిర్రున విసిరాడు చేతికి వున్న గొలుసు గిర్రున తిప్పి విసిరాడు నిశీధుడు.

ఖంగ్‌మంటూ ముసుగు మనిషి చేతిలోని కత్తికి తగిలింది యినుపగొలుసు. తగిలిన వెంటనే ఎగిరి దూరంగా పడింది.

"శేయ్! చూస్తారేంరా. వీడిని చంపండి!" అని అరిచాడు ముసుగు వ్యక్తి.

అపురూపనూ, శ్రీశర్మను కొరడాలతో కొడుతున్న నలుగురూ ముందుకు వచ్చారు.

రెండు చేతులకు వున్న యినుప గొలుసులనూ గిరగిరా తిప్పుతూ వారిమీదకు దూకాడు నిశీధుడు.

గుబాసుల తాకిడికి ఒక్కొక్కడికీ ఎముకలు విరిగినంత పనౌతున్నది. నిశీధుడ్ని ఎదిరించే ధైర్యంలేక బయటకు పరుగు తీశారందరూ.

ఎప్పుడు వెళ్ళిపోయాడో ముసుగు మనిషి ఆ గదిలో లేడు. డొక్కకివున్న కట్టు వూడదీసి, ఆకుల్ని చేతిలోకి గట్టిగా నలిపి వాటి రసాన్ని శ్రీశర్మని బంధించిన యినుప గొలుసులమీద పోశాడు నిశీధుడు.

రసం పడిన వెంటనే బుసబుసమని పొంగుతూ కరిగిపోనారంభించాయి ఆ గొలుసులు.

"ఇక చాలుగురూ! నువ్వా ముసుగు నాయాల సంగతి చూడు. నేను వీళ్ళని విడిపించి తీసుకువస్తాను" అన్నాడు శ్రీశర్మ ఉత్సాహంగా.

"అంతే కాదు, శ్రీ! అలక్ నందాదీవి ప్రభ్వువు జయసేనుడు కూడా ఎక్కడో బంధించబడి వుంటాడు. ఆయన్ని వెదికి విడిపించుకు రావాలి. చాలా త్వరగా జరగాలి. ఈ వ్యవహారం అంతా! ఏ క్షణానయినా మన గంగన్న ఈ నల్లకోటను భూ గృహంలోనే కాల్చివేస్తాడు!" అని హెచ్చరించి ఆ గదిలోనుంచీ బయటకు పరుగు తీశాడు నిశీధుడు.

గొలుసులు కరిగిపోగానే లేచాడు శ్రీశర్మ. కొరడా దెబ్బల బాధకి వళ్ళంతా పచ్చి పుండులావున్నా, దాని గురించి పట్టించుకునే స్థితిలో లేడు శ్రీశర్మ.

క్రిందపడిన కత్తి అందుకుని. చకచకా ఆనంద కట్లు కోసేశాడు. చేతులు విదిలించి క్రిందపడిన పైట అందు



కుంటూనే వంటికి చుట్టుకుంది ఆనంద. ఆ వెంటనే క్రింద పడివున్న కొరడాని అందుకుని బయటకు పరుగెత్తింది.

"ఆగు! ఆనందా .... నేనూ వస్తూన్నాను...." అని అపురూప వారిస్తున్నా వినలేదామె.

"త్వరగా నా కట్లు కోసెయ్ శ్రీ! ఆనంద ఆవేశంతో ప్రమాదం కొని తెచ్చుకుంటుంది...." అని అపురూప అంటూ వుండగానే ఆమెని బంధించిన తాళ్ళు కోసేశాడు శ్రీశర్మ.

"జయసేనుడ్ని వెదికే పని నీదే! మీ వంతు ఆ ముసుగు మనిషి అనుచరులు...." అని చెప్పి మరో కొరడా అందుకుని వెళ్ళిపోయింది అపురూప.

"గురువుగారు ఘటేవాడే! అందంలోనే కాదు; శౌర్యంలోనూ పోటీపడే వారిని వెంట తెచ్చినట్లున్నాడు...." అనుకుంటూ కత్తి కట్టుకుని కదిలాడు శ్రీశర్మ.

○ ○ ○

చేతులకు వున్న గొలుసుసు పూర్తిగా వదిలించుకో లేదు నిశీధుడు. వాటి గురించి ఆలోచిస్తే ముసుగు వ్యక్తి తప్పించుకు పోతాడు. గొలుసులను రెండు చేతులతో పట్టుకుని పరుగున ముందుకు వస్తున్నాడు నిశీధుడు.

ముసుగు వ్యక్తి గురించి ఆలోచిస్తూ వస్తున్న నిశీధుడు ముందుకు వచ్చే ప్రమాదాన్ని గుర్తించలేదు.

ఒక గోడచాటునుంచీ రివ్వున దూసుకు వచ్చిందో చురకత్తి. చివరి క్షణంలో దాన్ని గుర్తించాడు నిశీధుడు. ఎగిరి ప్రక్కకు దూకాడు. గుండెల్లో దిగబడవల్సిన చురకత్తి కుడిభుజంలో దిగబడి పోయింది.

పళ్ళు బిగబట్టి పక్కకు తూలాడు నిశీధుడు. ఆ వెంటనే దూసుకు వచ్చింది యింకో చురకత్తి ప్రక్కకు తూలిన నిశీధుడ్ని రాసుకుంటూ పోయింది అతన్ని వెనక్కు.

కెవ్వున అరుపు వినిపించి గిరుక్కున తిరిగాడు నిశీధుడు.

ఆనంద!

గుండెల్లో దిగబడిన కత్తిని రెండు చేతులతో పట్టుకుంటూ కుప్పలా కూలిపోయింది నిశీధుడికి గురి చేయబడిన కత్తి అది!"

అతను తప్పుకోవటం ఆ కత్తి ఆనందకు తగిలింది.

ఒక్క అంగలో ఆమెను సమీపించాడు నిశీధుడు. "ఆనందా! ఎందుకు వచ్చావు? ఇలా ప్రాణం పోగొట్టుకునేందుకా!" అంటూ ఆమె తలని వడిలోకి తీసుకుంటూ కూర్చున్నాడు.

నవ్వింది ఆనంద. "చావు నేను కోరుకుంటూనే వున్నాను. నీకు కాని ఈ దేహం ఇంకొకరికి చెల్లదు...." అంటూనే గుండెల్లో దిగబడిన కత్తిని బలంగా పెరికి నిశీధుడి తలమీదుగా వెనక్కి విసిరింది ఆనంద.

గిరుక్కున తిరిగాడు నిశీధుడు. ముసుగు వ్యక్తి వెనకపాటున వచ్చి కత్తి ఎత్తి నరకబోతున్నాడు. ఆనందకు కనిపించింది. నిశీధుడు ఆమెను చూస్తూ కూర్చుని వున్నాడు కనుక గమనించలేక పోయాడు.

కత్తి వదిలేస్తూ వెనక్కి వాలిపోయాడు ముసుగు మనిషి.



"నీచుడు....నా చేతిలో చావు తప్పలేదు వాడికి.........నీ వడిలో చావు నాకు ఆనందమే .... మీ శ్రీశర్మకు, మానందకు తప్పకుండా వివాహం...." అంటూనే తల వాల్చేసింది ఆనంద.

చెమర్చిన నేత్రాలు తుడుచుకున్నాడు నిశీధుడు. తన భుజంమీద ఎవరిదో చెయ్యి పడటం చూసి తుడుచుకున్నాడు నిశీధుడు. తన భుజంమీ ఎవరిదో చెయ్యి పడటం చూసి తలెత్తాడు.

అపురూప!

"ధీరా! ఆనందలాంటి స్త్రీ మరణానికి విచారించి ప్రయోజనంలేదు. ఆమె నీపై నిలుపుకున్న ప్రేమ శాశ్వతం! నువ్వు మరచినా నేను మరువలేను. పోదాం పద!" అంది నెమ్మదిగా.

చిన్నగా చిటూర్చి కదిలాడు నిశీధుడు. ఇద్దరూ నాలు గడుగులు వేసేసరికి భయంకరంగా వినిపించాయి ప్రేలుడు ధ్వనులు.

భూగృహం అంతా కంపించి పోయింది ఆ శబ్దాలకు.

"అపురూపా! మన గంగన్నకు అప్పగించిన పని పూర్తి చేసినట్లున్నాడు. శ్రీ శర్మ ఏడీ!" అని అడిగాడు.

"వస్తున్నాను, నన్ని దిక్కుమాలిన భూ గృహంలో వదలిపోకు....ఇదిగో....అలక్ నందాదీవి ప్రభువులు.....!" అంటూ బక్కచిక్కిన వృద్ధుడ్ని వెంట బెట్టుకుని వచ్చేశాడు శ్రీశర్మ.

ం ం ం

"ఇంతకూ ఆ దొరగారు కోయగూడెం వదిలి రానన్నాడా? అక్కడే వుండిపోయి ఆ కోయ యువరాణిని పెళ్ళి చేసుకుంటాడా! అంతే కోయగూడెం నాయకుడు కాబోతున్నాడన్న మాట...." నిశీధుడు ఒక్కడూ రావటం చూస్తూనే గ్రహిస్తున్నాడు కార్తికేయుల వారు.

పెదవి విప్పకుండా ఆయన ఎదుట కూర్చుని గదిలో వున్న శిల్పాలను, తైలవర్ణ చిత్రాలను చూస్తూ వుండి పోయాడు నిశీధుడు.

నల్లకోటలో ముసుగు మనిషి మరణించాక తిరగబడి పోయిన అతని అనుచరులను వెనకనుంచీ కమ్ముకుని ఊచకోత కోసేశారు కోయసైన్యం. గంగన్న, నిశీధుడు కలగజేసుకోవాల్సిన అవసరం లేకపోయింది. ఆ తరువాత అపురూపను, గంగన్న ఎవరిదారిన వారిని వదిలి వచ్చేశారు తనూ, శ్రీశర్మ హస్తినాపురం చేరారు. మరోసారి తప్పకుండా రావాలని బాస చేయించుకుని, వచ్చినప్పుడు తనను పెళ్ళాడాలని వాగ్దానం చేయించుకుని, మరీ వదిలిపెట్టింది కోయ యువరాణి నంద.

"నువ్వే వెళ్ళి మన పెద్దాయనకు కనిపించి రా. గురో! నన్ను చూస్తే ఎందుకు అలక్ నందాదీవికి వెళ్ళావని మండి పడిపోతాడు! ఆయన కోపం చల్లారాక నిదానంగా వెళ్ళి కనిపిస్తాలే...." అని చెప్పి తన గదిలో ముసుగు పెట్టేశాడు శ్రీశర్మ.